# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ మంగళవారం 13-8-2019 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :25 సంచిక: 280 పేజీలు 8 వెల: రూ.1/-


## బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని మోడీ,వెంకయ్య

న్యూఢిల్లీ,ఆగస్ట్12(ఆర్ఎన్ఎ): ప్రధాని నరేంద్ర మోదీ, ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు దేశంలోని ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ ట్వీట్ చేస్తూ.. ఈద్ అల్ అద్హా పర్వదినం పురస్కరించుకుని ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలుపుతున్నాను. ఈ పర్వదినం మన సమాజానికి శాంతిని, మరింత ఆనందాన్ని పంచుతుందని ఆశిస్తున్నాను అని ట్వీట్ చేశారు.

ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుతూ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు కూడా ట్వీట్ చేశారు. ఈ పర్వదినం భక్తికి, విశ్వాసానికి, త్యాగానికి సంకేతం. సోదరభావం, కరుణ, ఐక్యతకు ఈద్ అల్ అద్హా పర్వదినం ఆదర్శంగా నిలుస్తుందని వెంకయ్య ట్వీట్‌లో పేర్కొన్నారు.

# కృష్ణమ్మ ఉగ్రరూపం

- నదీపరీవాహక ప్రాంతాల జలమయం
- ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలింపు
- జూరాలకు 9లక్షల క్యూసెక్కుల వరదనీరు
- శ్రీశైలం, నాగార్జున సాగర్‌కు పరవళ్లు తొక్కుతున్న కృష్ణమ్మ
- నాగార్జున సాగర్ 26గేట్లు ఎత్తిన అధికారులు
- ప్రాజెక్టుల వద్ద సందర్శకుల తాకిడి

నల్గొండ, ఆగస్టు12(ఆర్ఎన్ఎ) : రాష్ట్రంలో కృష్ణమ్మ ఉగ్రరూపం దాల్చుతోంది. ఎగువ నుంచి భారీగా వరద వస్తుండటంతో.. గంటగంటకు కృష్ణానది ఉధృతి పెరుగుతోంది. దీంతో నారాయణపేట, గద్వాల జిల్లాల పరిధిలోని నదీ పరివాహక ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. ముంపు గ్రామాల ప్రజలను ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఇదిలా ఉంటే జూరాల నుంచి శ్రీశైలంకు.. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు వరదనీరు పోటెత్తడంతో సోమవారం నాగార్జున సాగర్‌కు చెందిన 26గేట్లను ఎత్తి వరదనీటిని అధికారులు దిగువకు వదులుతున్నారు. సాగర్ ప్రాజెక్టుకు 9లక్షల క్యూసెక్కులకుపైగా ఇన్‌ఫ్లో వస్తోంది. పెరుగుతున్న ఇన్‌ఫ్లో ఆధారంగా గంటగంటకు గేట్లను ఎత్తుతునారు అధికారులు. ప్రస్తుతం 60వేల క్యూసెక్కుల నీటిని కిందకు వదులుతున్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం.. 590 అడుగులు కాగా.. ప్రస్తుతం 560 అడుగులకు చేరింది. సాగర్ సామర్థ్యం 312 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం ప్రాజెక్ట్ 230 టీఎంసీలకు నీటి నిల్వ చేరుకుంది. గేట్లు ఎత్తడంతో సాగర్ పరివాహక ప్రాంత ప్రజల్ని అప్రమత్తం చేశారు అధికారులు. రెండు రోజులు ఇదే విధంగా వరద ఉధృతి కొనసాగితే పులిచింతల ప్రాజెక్టు నిండుకుండలా మారనుంది. అనంతరం ప్రకాశం బ్యారేజీ మీదుగా కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతూ బంగాళాఖాతాలో చేరనుంది.

### నారాయణపూర్ నుంచి భారీగా వరద..

కర్ణాటకలోని నారాయణపూర్ నుంచి భారీగా వరద వస్తుండటంతో.. శ్రీశైలం ప్రాజెక్ట్ కు వరద పోటెత్తింది. అటు తుంగభద్ర నుంచి నీళ్లు విడుదల కావడంతో శ్రీశైలానికి వరద అంతకంతకు పెరుగుతోంది. జూరాల నుంచి కేవలం 13 రోజుల్లోనే 359 టీఎంసీల నీరు శ్రీశైలానికి చేరుకుంది. 24 గంటల్లో శ్రీశైలం నుంచి దాదాపు 60 టీఎంసీలకుపైగా విడుదల చేశారు.

ప్రస్తుతం జూరాలకు 9లక్షల క్యూసెక్కుల నీరు ఎగువ ప్రాంతాల నుంచి వచ్చి చేరుతుండగా.. అక్కడి నుండి శ్రీశైలానికి 7లక్షల 47వేల క్యూసెక్కులకుపైగా వరద వచ్చిచేరుతుంది. దీంతో 10గేట్లను ఎత్తి.. 8లక్షల 50వేల క్యూసెక్కుల వరదను అధికారులు కిందికి వదులుతున్నారు. శ్రీశైలం పూర్తిస్థాయి సామర్థ్యం 215 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 181 టీఎంసీల నిల్వఉంది. ఇదిలా ఉంటే జూరాల, శ్రీశైలం, నాగార్జునసాగర్‌కు జలకళ సంతరించుకోవడంతో ప్రాజెక్టుల వద్ద వరద ఉధృతిని తలికించేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. ఇదిలా ఉంటే నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు మాచర్ల వైపు నుంచి సాగర్‌కు పెద్ద సంఖ్యలో పర్యాటకులు వెళతున్నారు. బక్రీద్ సెలవుతో పర్యాటకుల తాకిడి మరింత పెరిగే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు.

### నీటమునిగిన పంటపొలాలు..

కృష్ణానది పరీవాహక ప్రాంతానికి ఆనుకొని ఉన్న వ్యవసాయక్షేత్రాల్లో సాగు చేసిన పంటలు నీటమునిగాయి. పలు పుణ్యక్షేత్రాల్లోకి సైతం వరదనీరు చేరింది. తెలంగాణలో కృష్ణానదికి ముఖద్వారమైన మాగనూరు వద్ద వాసూనగర్ గ్రామం పూర్తిగా నీటమునిగింది. ఎన్‌డీఆర్‌ఎఫ్ దళాలు ప్రజలను సురక్షిత ప్రాంతానికి తరలించే చర్యలు చేపట్టాయి. హిందూపూరు, మురహర్‌దొడ్డి, ముడుమాల, పసుపుల, నందిమళ్ల తదితర గ్రామాల పరిధిలో పెద్దఎత్తున పంటలు నీటమునిగాయి. ధరూరు మండలంలో నెట్టెంపాడు, ఖమ్మంపాడు, గార్లపాడు తదితర గ్రామాల్లో పంటపొలాల్లోకి వరదనీరు చేరింది. గద్వాల మండలంలో బీరెల్లి గ్రామంలోకి వరదనీరు వచ్చింది. రేకులపల్లి, గుంటిపల్లి నది అగ్రహారం తదితర గ్రామాల్లో పంటలు నీటమునిగినట్లు రైతులు తెలిపారు. బీచుపల్లి రామాలయంలోకి వరదనీరు చేరింది. అటు మక్తల్ మండలంలోని పసుపుల వద్ద పుణ్యక్షేత్రమైన దత్తక్షేత్రంలోకి నీరు చొచ్చుకుపోయింది. రక్షణ చర్యల్లో భాగంగా అక్కడున్నవారిని పోలీసులు ఖాళీ చేయించారు. గద్వాల మండలం నదీ అగ్రహారం వద్ద ఆలయాల్లోకి వరదనీరు చేరింది. ఇటిక్యాల మండలంలో కొండపేట, సాసనూలు, యాక్తాపురం, వీరాపురం, దువ్వాసిపల్లి, ఆర్.గార్లపాడు, కార్వాముల గ్రామాల్లో వ్యవసాయ పొలాల్లోకి వరదనీరు చేరటంతో పంటలు నీటమునిగాయి.

## వచ్చేఐదేళ్లలో..

# లక్షకోట్ల పెట్టుబడులే లక్ష్యం

- దీర్ఘకాలిక వృద్ధిరేటు కోసం పనిచేస్తున్నాం
- ఇటీవల ఎన్నికల్లో విజయం మరింత బాధ్యతను పెంచింది
- నిజాయితీ వ్యాపారులకు అండగా ఉంటాం
- ఆర్థికంగా బలంగా ఉన్న ప్రపంచ దేశాలతో స్నేహ సంబంధాలను కొనసాగిస్తున్నాం
- ఈజ్ ఆఫ్ బిజినెస్‌లో నాలుగేళ్లలోనే 65స్థానాలు ఎగబాకాం
- ఇంగ్లీష్ ఛానల్ ఇంటర్వ్యూలో ప్రధాని నరేంద్ర మోదీ



న్యూఢిల్లీ, ఆగస్టు12(ఆర్ఎన్ఎ) : వచ్చే ఐదేళ్లలో దేశంలోకి లక్ష కోట్ల రూపాయల పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్టు ప్రధాని మోదీ తెలిపారు. ఈ లక్ష్యాన్ని చేరుకోవడం కోసం పెట్టుబడుల ప్రవాహాన్ని పెంచే దిశగా కేంద్రం ఎన్నో ప్రణాళికలను రూపొందిస్తుందన్నారు. ఎకనామిక్ టైమ్స్‌కు ప్రత్యేకంగా ఇంటర్వ్యూ ఇచ్చిన ప్రధాని మోదీ పలు ఆసక్తికర అంశాలను వెల్లడించారు. 2008-14 మధ్య సాధించిన పురోగతి లాంటిది కాకుండా.. దీర్ఘకాలిక వృద్ధి రేటు కోసం పని చేస్తున్నానని ప్రధాని మోదీ తెలిపారు. ఇటీవలి ఎన్నికల్లో ఘన విజయం సాధించడం తమపై మరింత బాధ్యతను పెంచిందని తెలిపారు. అంచనాలు కూడా భారీగా ఉన్నాయన్నారు. గత ఐదేళ్లలో సానుకూల పురోగతి నమోదైందన్నారు. గత ఫిబ్రవరి, జూలై నెలల్లో ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రభావాన్ని ప్రజలు విశ్లేషించాలన్నారు. బడ్జెట్లో ఎవరికి ఏ కేటాయింపులు చేశారని కాకుండా స్థూలంగా దేశ ప్రగతి కోణంలో ఆలోచించాలన్నారు. గత ఐదేళ్లలో ద్రవ్యోల్బణాన్ని నియంత్రించామని ప్రధాని తెలిపారు. ఆర్థికంగా బలంగా ఉన్న ప్రపంచ దేశాలతో స్నేహ సంబంధాలను కొనసాగి స్తున్నామన్నారు. వడ్డీరేట్లు తగ్గించామని, జీఎస్టీ, బ్యాంక్‌రప్టసీ కోడ్ లాంటి ఆర్థిక సంస్కరణలు తీసుకొచ్చామన్నారు. నిరర్థక ఆస్తుల సమస్యను పరిష్కరిస్తున్నాం. మౌలిక వసతుల పెంపును వేగంగా పెంచుతున్నామని, ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారులకు భారత్‌ను అద్భుత గమ్యంగా మార్చామని మోదీ పేర్కొన్నారు. ఈజ్ ఆఫ్ బిజినెస్‌లో భారత్ నాలుగేళ్లలోనే 65స్థానాలు ఎగబాకిందన్నారు. ఇండియా అద్భుత పురోగతి సాధిస్తోందని వరల్డ్ బ్యాంక్ అధ్యక్షుడు జిమ్ యాంగ్ కిమ్ గత ఏడాది నవంబర్లో కొనియాడారని, జీఎస్టీని అమలు చేయాలని, బహిరంగ మలవిసర్జన రహిత దేశంగా భారత్‌ను మార్చాలని, దేశంలోని అన్ని ఇళ్లకు విద్యుత్‌ను అందించాలని, 8 కోట్ల కుటుంబాలకుపైగా వంట గ్యాస్ కనెక్షన్లు ఇవ్వాలని, పది కోట్ల మందికిపైగా పేదలకు రూ.5 లక్షల వరకు ఆరోగ్య బీమా అందించాలని ఐదేళ్ల క్రితం భావించామని, ఆ దిశగా పురోగతి సాధించామని మోదీ తెలిపారు. దీర్ఘకాలంలో స్థిరమైన పురోగతి సాధించడం కోసం బలమైన పునాదులు వేశామని, గత ఐదేళ్లలో తక్కువ సగటు ద్రవ్యోల్బణంతో భారత్ వృద్ధిరేటు సగటు ఎక్కువగా నమోదైందన్నారు. కరెంట్ ఖాతా లోటు, విత్తలోటు, ద్రవ్యోల్బణం తదితర సూచీలను గణీయంగా తగ్గించలగలిగామని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఈ చర్యల వల్ల ఆర్థిక వ్యవస్థ పట్ల నమ్మకం పెరిగిందని, దేశంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల ప్రవాహం పెరిగిందని ప్రధాని స్పష్టం చేశారు. ఆర్థిక వృద్ధి అంటే దేశంలో సంపదను సృష్టించడమని, అంతే కానీ ప్రభుత్వ ఖజానాను నింపడం కాదన్నారు. దేశ ప్రజల దగ్గర డబ్బులు ఉండాలని, సంపదను సృష్టి అంటే అందరి దగ్గర సమృద్ధిగా డబ్బు ఉండాలని మోదీ వెల్లడించారు. గత ఐదేళ్ల పాలన అనుభవంతో చెబుతున్నా.. అత్యున్నత లక్ష్యాలను సాధించేందుకు సరిపడా అన్ని లక్షణాలు భారత ప్రజల్లో ఉన్నాయని మోదీ పేర్కొన్నారు.

కోట్లాది మంది రైతులు, లక్షలాది మంది పారిశ్రామికవేత్తలు, వేలాది మంది యువ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, స్టార్టప్‌లు, మహిళలు అందరూ సమష్టిగా దేశాన్ని ప్రగతి పథంలో నడిపిస్తారనే నమ్మకం ఉందన్నారు.

వ్యాపారవేత్తలు ఎలాంటి గందరగోళం లేకుండా తమ పెట్టుబడుల ప్రణాళికను ముందుకు తీసుకెళ్లొచ్చునని, ప్రభుత్వం వైపు నుంచి చట్టబద్ధంగా అన్నివిధాలుగా అండగా నిలుసామని వ్యాపారవేత్తలకు హామీ ఇస్తున్నామని ప్రధాని తెలిపారు. ప్రపంచంలోని ఫార్చ్యూన్ 500 కంపెనీలు భారత్‌లో ఉత్పత్తులను పెంచేలా కృషి చేస్తున్నామని, ఆ సంస్థలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అర్థం చేసుకుంటున్నామని, వారితో నిరంతరం చర్చలు జరుపుతున్నామని తెలిపారు. గత ఐదేళ్లలో ప్రపంచవ్యాప్తంగా ఎఫ్‌డీఐల ప్రవాహం నెమ్మదించిందని, కానీ 2014-15 నుంచి 2018-19 మధ్య భారత్‌లోకి 286 బిలియన్ డాలర్ల విలువైన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులొచ్చాయని ప్రధాని తెలిపారు.

మేకిన్ ఇండియా ప్రభావం చూపుతోందన్న మోదీ.. భారత్‌లో తయారైన మెట్రో రైళ్లు ఆస్ట్రేలియాలో నడుస్తున్నాయన్నారు. ఎగుమతులను పెంచడం ద్వారా 2022నాటికి రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామన్నారు. ఈ క్రమంలో ఫుడ్ ప్రాసెసింగ్ ప్రధాన పాత్ర పోషిస్తుందన్న మోదీ.. ఈ దిశగా ఇప్పటికే మెగా ఫుడ్ పార్కులు ఏర్పాటు చేశామని, కోల్డ్ చైన్ ప్రాజెక్టులను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

దేశ ఆర్థిక వ్యవస్థకు ఊతం ఇవ్వడం కోసం ప్రభుత్వ బ్యాంకులకు రూ.70 వేల కోట్ల మూలధనాన్ని బడ్జెట్లో ప్రకటించామన్నారు. క్రమబద్ధంగా ప్రభుత్వ రంగ సంస్థల నుంచి పెట్టుబడుల ఉపసంహరణ ప్రక్రియ చేపట్టడం ద్వారా నిధులను పెంచుతున్నామని, ఈ చర్యల ద్వారా ఆర్థిక వ్యవస్థ బలం పుంజుకుంటుందన్నారు. త్వరలోనే ప్రయివేట్ పెట్టుబడులు పెరుగుతాయయని ప్రధాని మోదీ తెలిపారు.

# బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం

హైదరాబాద్/న్యూఢిల్లీ, ఆగస్ట్12(ఆర్ ఎన్ఎ): ఈశాన్య బంగాళాఖాతం, దానిని ఆనుకుని ఉన్న తూర్పు మధ్య బంగాళాఖాతం ప్రాంతాల్లో సముద్రమట్టానికి 3.1 నుంచి 5.8 కిలోమీటర్ల మధ్య ఉపరితల ఆవర్తనం స్థిరంగా కొనసాగుతున్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో 48 గంటల్లో బంగాళాఖాతం వాయవ్య ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశాలున్నాయని చెప్పారు. మరో మూడ్రోజుల పాటు తెలంగాణలో తేలికపాటి నుంచి ఒక మాదిరి వర్షాలు కురువొచ్చని వెల్లడించింది.

## ఇంకా తేరుకోని కర్నాటక

## ఉత్తరాఖండ్‌లో ఇద్దరు మృతి

ఇకపోతే కర్ణాటక వరదలతో అతలాకుతలమవుతోంది. ఆగస్టు 1వ తేదీ నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కుండపోత వర్షాలకు తోడు వరదలు పోటెత్తాయి. ఆగస్టు 1 నుంచి ఇప్పటి వరకు 40 మంది మృతి చెందారు. మరో 14 మంది లో అదృశ్యమైనట్లు ఆ రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. ఇక 5,81,702 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లారు. 50,595 జంతువులను వరదల నుంచి కాపాడారు. 3,27,354 మంది 1168 పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్నారు. ఈ భారీ వర్షాలకు, వరదలకు 17 జిల్లాల్లోని 80 తాలుకాలు తీవ్రంగా నష్టపోయాయి. 2028 గ్రామాల్లోకి వరద నీరు వచ్చి చేరడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 4.20 లక్షల హెక్టార్లలో పంట దెబ్బతిన్నది. 28,325 ఇండ్లు ధ్వంసమయ్యాయి. ఇకపోతే ఉత్తరాఖండలో వరదలు పోటెత్తాయి. వరద ఉధృతికి చమోలి జిల్లా రెండు నివాసాలు కూలిపోయాయి. ఉదయం జరిగిన ఈ ప్రమాదంలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. రూపాదేవీ(35), ఆమె 9 నెలల కూతురు మృతి చెందారు. ఇండ్లు కుప్పకూలిన సమయంలో రూపాదేవీ తన బిడ్డతో కలిసి నిద్రిస్తుంది. ఇక ఘటనాస్థలికి చేరుకున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు సహాయక చర్యలు చేపట్టాయి. శిథిలాలను తొలగిస్తున్నారు. ఇవాళ తెల్లవారు జామున ఒంటి గంట సమయంలో కొండ చరియలు విరిగిపడడంతో 21 ఏళ్ల మహిళ మృతి చెందింది. గత కొద్ది రోజుల నుంచి ఉత్తరాఖండ్‌లో కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. ఈ భారీ వర్షాలకు వరదలు పోటెత్తడమే కాకుండా కొండచరియలు విరిగిపడుతున్నాయి. దీంతో స్థానికులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని జీవనం గడుపుతున్నారు.

## ఆలయంలో తొక్కిసలాట...

### - ఒకరు మృతి... పలువురికి గాయాలు

పాట్నా, ఆగస్టు12(ఆర్ఎన్ఎ) : బీహార్‌లోని లఖీసరాయ్ జిల్లాలో గల అశోక్‌థామ్ మందిరంలో తొక్కిసలాట చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఒక భక్తుడు మృతి చెందాడు. 10 మందికిపైగా గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే శ్రావణ సోమవారం సందర్భంగా ఆలయానికి భారీ సంఖ్యలో భక్తులు వచ్చారు. మరోవైపు ఆలయ ప్రాంగణంలో మేళా ఏర్పాటు చేశారు. రద్దీ కారణంగా జరిగిన తొక్కిసలాటలో ఒకరు మృతి చెందారు. భక్తుల రద్దీ అధికంగా ఉన్నప్పటికీ ఆలయ నిర్వాహకులు బందోబస్తు ఏర్పాట్లు చేయలేదు. ఆలయంలో గందరగోళం నెలకొనడంతో భక్తులు ఇటునటు పరుగులు తీశారు. కాగా సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. గాయపడ్డ భక్తులను చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు, మిగిలిన క్షతగాత్రుల ఆరోగ్యం మెరుగ్గా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

## చరిత్రలో నేటినిజం



కం॥ మానసముల దోచు నటికి -
వాణిని సేవించినట్టి వరసుకుమారికా -
జాణకి - సినిమా రాణికి -
జేనమ్మకు చిరయశము శ్రీదేవి గానెన్!!

( ఆగష్టు 11 కొడాలి సుబ్బారావు జయంతి)

-రాధశ్రీ
సెల్: 9494481210

## సీఎం కేసీఆర్‌కు స్వాగతం పలికిన ఎమ్మెల్యే రోజా

హైదరాబాద్, ఆగష్టు 12: తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు కుటుంబ సమేతంగా కంచి(తమిళనాడు), తిరుమల పర్యటనకు ఇవాళ ఉదయం బయల్దేరి వెళ్లారు. రేణిగుంట విమానాశ్రయం నుంచి రోడ్డుమార్గాన కంచికి పయనం అయ్యారు కేసీఆర్. రోడ్డు మార్గంలో వెళ్తున్న సీఎం కేసీఆర్ నగరికి చేరుకోగానే అపూర్వ స్వాగతం లభించింది. నగరి చేరుకున్న సీఎం కేసీఆర్‌కు ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే, ఏపీఐఐసీ చైర్మన్ రోజా ఘనస్వాగతం పలికారు. అనంతరం కేసీఆర్ కంచికి బయల్దేరారు. కుటుంబ సమేతంగా కంచి అత్తివరదరాజ స్వామిని సీఎం కేసీఆర్ దర్శించుకోనున్నారు. అనంతరం తిరుమల చేరుకుని శ్రీవారిని దర్శించుకుంటారు సీఎం కేసీఆర్.

# అత్తివరదరాజు స్వామివారిని దర్శించుకున్న సీఎం కేసీఆర్ దంపతులు



కాంచీపురం, ఆగష్టు 12: తమిళనాడులోని కాంచీపురంలో ముఖ్యమంత్రి కేసీఆర్ పర్యటన కొనసాగుతోంది. కంచిలో గల అత్తి వరద రాజు స్వామి వారిని ముఖ్యమంత్రి కేసీఆర్ దంపతులు దర్శించుకున్నారు. వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య స్వామి వారికి కేసీఆర్ కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు కేసీఆర్ దేవస్థానానికి చేరుకోగానే ఆలయ అధికారులు, అర్చకులు ఘన స్వాగతం పలికారు. దర్శనం అనంతరం వేదపండితులు ఆశీర్వచనాలతో పాటు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కేసీఆర్ కుమార్తె, మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత, ఏపీఐఐసీ చైర్మన్ రోజా తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు ఎప్పటికీ ఒక తేజమే..!

నేటినిజం

మంగళవారం 13-8-2019

ప్రపంచం ఆధునికంవైపుకు పరుగులు తీస్తున్నా భాషకూడా ఆధునికంవైపుగా అడుగులువేస్తోంది. ఈ నిజాన్ని 19 వ శతాబ్దం ఉత్తరార్థం నాటికి ప్రపంచ దేశాలన్నీ గుర్తించాయి. అదే సమయంలో భారతీయ భాషల్లోనూ ఈ చైతన్యం మొదల యింది. భాషవల్ల కలిగే ప్రయోజనాలు ప్రజలందరికీ చేరాలనే ఆలోచన ఇంషువారి పాలనలో మొదలయింది. ఈ ఆలోచనకు సాహిత్య, ఉద్యమ రూపాల్ని ఇచ్చిన తెలుగు తేజాలు గురుజాడ, గిడుగు.. ఆధునిక భాషోద్యమానికి వీరు మేరుపర్వతం వంటివారు. 1904-1911 వరకు వాడుక భాషకై అనుగుణమైన నిర్ణయాలు తీసుకున్న ప్రభుత్వం ఆ తర్వాత ఆ సమస్యను మద్రాసు విశ్వవిద్యాలయ నిర్ణయానికి వదిలేసింది. విశ్వవిద్యాలయం నియమించిన తెలుగు కంపోజిషన్‌లో తమ వాదం నెగ్గించుకోవడానికి రెండు జట్లూ పోరాడాయి. గిడుగు, గురుజాడ, బుజ్జా శేషగిరిరావు మొదలైనవారు ఒక వర్గం, జయంతి రామయ్య, వేదం వెంకటరాయశాస్త్రి, కొమర్రాజు వెంకట లక్ష్మణరావు వంటివారు పరోక్షంగా పోరాడారు. ఇరువర్గాల మధ్య సంతకాల సమరాలు కరపత్రాల కొట్లాలలు, పుస్తకాలు రాసి పురెక్కించడాలు, శాసన సభల్లో చర్చలు, సభల్లో గోల చేయిం చడాలు, అమితుమీగా పండితుల వాగ్వానాలు, జమిందారుల జుగల్బందీలు, ఇలా కుమ్ములాటల్లోనే గడిచి చివరకు భాషా వాదుల పోరుగడ్డగా నిలిచింది. కళాశాలలు, సాహిత్యసంస్థలు, సాహిత్య పత్రికలు, ఈ పోరుకు కత్తీ కటార్లు నూరుకుంటూ చివరకు ఒక ఓటు తేడాతో గ్రంథిక వాదులు నెగ్గారు. తమ ఓటమి తాత్కాలికమైనదని ఎంచి పట్టు వదలకుండా పండితులతో పోరాడిన గిడుగు ఆ తర్వాత ఇరవైఏళ్లకు విజయం దక్కించుకు న్నారు. కవిత్వమూ, భాష, వచన సాహిత్య భాష, ప్రామాణిక భాష, వాడుకభాష, ఎప్పటికప్పుడు వేరువేరుగా వుంటాయనే ప్రాథమిక అవగాహనతోనే గిడుగు తన ఉద్యమాన్ని ప్రారంభించారు. దేశభాష ఎపుడూ మారుతూ వుంటుందనే సత్యం ఆయనకు తెలుసు. ఎక్కువమంది మాట్లాడే భాషను బోధనాభాషగా సాహిత్యభాషగా రూపొందించాలనే సంకల్పంతో ఆయన తన ఉద్యమాన్ని ప్రారంభించారు. ప్రజల భాషకు బదులుగా సమకాలీన పండితుల భాషను ప్రతిష్ఠింపజేయాలని సమకాలీన పండితులు కొనసాగించే కుట్రలను ఛేదించడానికి గిడుగు ఏళ్ళతరబడి ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారాలతో 19 వ శతాబ్దానికి ముందుగా ప్రచురితమైన మొదటి ప్రతుల పరిశీలనలోను తలమునకలై కఠోర పరిశ్రమ చేసారు. గిడుగు వారి వాదంలో ప్రధానాంశాలు ఇవే.. మొదటిది జీవద్భాష ఎప్పటికప్పుడు మారుతూనేవుంటుంది.. రెండవది లోకవ్యవహారమే కవులకు శరణ్యం. మూడవది ప్రాచీన కవుల ప్రయోగాల లోనూ ఇటు లోక వ్యవహారంలోనూ లేని శబ్దాలు సుశబ్దాలు కావు. ఏది ఎలా వున్నా భాషారంగంలోనే కాకుండా సామాజిక సంస్కరణ రంగంలోనూ కందుకూరి రఘుపతి వెంకటరత్నం నాయుడు, వంటివారి మార్గాన్ని అనుసరించిన గిడుగు స్వయంగా ఒక విధవా వివాహాన్ని జరిపించారు. వెలివేతకు భయపడకుండా సనాతనాచారాలను ఎదిరించి తాము నమ్మిన సిద్ధాంతాలకోసం పాటుపడ్డారు. తెలుగు ప్రజలు ఉండే ప్రాంతాలను ఒరిస్సాలోని కలపకుండా పోరాటం చేసి అందుకోసం ఆయన ఆస్తులన్నీ అమ్మేసారు కూడా.. ఆంధ్ర దేశంలోనే పండితులందరూ వీరికి దాసోహం అన్నారు. వీరు తమ జీవితకాలంలోనే ప్రముఖ సాహిత్యకారులందరూ వాడుకభాషలో గొప్ప రచనలు చేయడం ఆయన అనంతరం విశ్వవిద్యాలయాలు వాడుకభాషకు స్వాగతం పలకడం గిడుగు ప్రభావానికి నిలువెత్తుసాక్ష్యాలుగా మనకు మిగిలిపోయాయి. తెలుగు భాషకు మించిన భాషలేదు.. సంస్కృతిలోనూ, సంప్రదాయంలోనూ తెలుగు వారికిమించి లేవు.. కాకుంటే ఆధునికతలో అవగాహన లోపించింది.. అంతే!! తెలుగు ఎప్పటికీ ఒక తేజమే!!

# ముంపు ప్రాంతాల్లో మంత్రి నిరంజన్ పర్యటన

## సహాయక చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు

వనపర్తి,ఆగస్ట్12(ఆర్ఎన్ఎ): పెబ్బేరు మండలంలోని కృష్ణా నది ముంపు ప్రభావిత ప్రాంతాలను.. మంత్రి నిరంజన్ రెడ్డి పరిశీలించారు. కృష్ణా నది ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో మునగ మాన్ దిన్నె, పెంచికలపాడు, రంగాపూర్, బీచుపల్లి గ్రామాల్లో ముంపు బాధితులను కలిసి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అటు ముందస్తుగా తగిన సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించడంతోపాటుగా అన్ని విధాలా ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ ఛైర్మన్ లోకనాథ్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ఇదిలావుంటే కృష్ణానది పరీవాహక ప్రాంతానికి ఆనుకొని ఉన్న వ్యవసాయక్షేత్రా ల్లో సాగు చేసిన పంటలు నీటమునిగాయి. పలు పుణ్యక్షేత్రాల్లోకి సైతం వరదనీరు చేరింది. తెలంగాణలో కృష్ణానదికి ముఖద్వారమైన మాగనూరు వద్ద వాసూనగర్ గ్రామం పూర్తిగా నీటమునిగింది. ఎన్‌డీఆర్ఎఫ్ దళాలు ప్రజలను సురక్షిత ప్రాంతానికి తరలించే చర్యలు చేపట్టాయి.

హిందూపూరు, మురహర్‌దొడ్డి, ముడుమాల, పసుపుల, నందిమళ్ల తదితర గ్రామాల పరిధిలో పెద్దఎత్తున పంటలు నీటమునిగాయి. ధరూరు మండలంలో నె÷–టటెంపాడు, ఖమ్మంపాడు, గార్లపాడు తదితర గ్రామాల్లో పంటపొలాల్లోకి వరదనీరు చేరింది. గద్వాల మండలంలో బీరెల్లి గ్రామంలోకి వరదనీరు వచ్చింది. రేకులపల్లి, గుంటిపల్లి నది అగ్రహారం తదితర గ్రామాల్లో పంటలు నీటమునిగినట్లు రైతులు తెలిపారు. బీచుపల్లి రామాలయంలోకి వరదనీరు చేరింది. అటు మక్తల్ మండలంలోని పసుపుల వద్ద పుణ్యక్షేత్రమైన దత్తక్షేత్రంలోకి నీరు చొచ్చుకుపోయింది. రక్షణ చర్యల్లో భాగంగా అక్కడున్నవారిని పోలీసులు ఖాళీ చేయించారు.

గద్వాల మండలం నదీ అగ్రహారం వద్ద ఆలయాల్లోకి వరదనీరు చేరింది. ఇటిక్యాల మండలంలో కొండపేట, సానసూలు, యాక్తాపురం, వీరాపురం, దువ్వాసిపల్లి, ఆర్.గార్లపాడు, కార్పాముల గ్రామాల్లో వ్యవసాయ పొలాల్లోకి వరదనీరు చేరటంతో పంటలు నీటమునిగాయి.

# రాయ్‌పూర్‌లో స్వచ్ఛంద సంస్థల వినూత్న చర్చ

## భారీ జాతీయ జెండాతో ప్రదర్శన

రాయ్‌పూర్,ఆగస్ట్12(ఆర్ఎన్ఎ): ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లో జాతీయత ఉట్టిపడింది. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని రాయ్‌పూర్‌లో అతి పొడవైన త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. వేలాది మంది విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు మానవహారంలా ఏర్పడి 15 కిలోమీటర్ల మువ్వెన్నల జెండాను ప్రదర్శించారు.

రాయ్‌పూర్‌లోని రవిశంకర్ శుక్లా యూనివర్శిటీ నుంచి అమపరా చౌక్ వరకు ఈ ప్రదర్శన సాగింది. స్థానిక వసుధైక కుటుంబం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కాగా.. ఈ జెండా ఛాంపియన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకుంది. అతి పొడవైన మువ్వన్నెల జెండా రికార్డు నమోదు చేసింది. ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఛాంపియన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ ప్రతినిధులు ఇందుకు సంబంధించిన ధ్రువపత్రాన్ని వసుధైక కుటుంబం ఫౌండేషన్‌కు అందజేశారు. కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి భూపేశ్ భగేల్ అమరవీరుల కుటుంబాలను సన్మానించారు.

మాజీ ముఖ్యమంత్రులు రమణ్ సింగ్, అజిత్ జోగి ఎమ్మెల్యేలతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. పలు స్వచ్ఛంద సంస్థలు 15 కిలోమీటర్ల జాతీయ జెండాల కార్యక్రమంలో పాల్గొన్నాయి.

అమపార చౌక్ నుంచి పండిట్ రవిశంకర్ శుక్లా యూనివర్సిటీ వరకు ప్రదర్శించారు. ఈ 15 కి.మీ. పొడవునా స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఆయా పాఠశాలల విద్యార్థులు జాతీయ జెండాను రెపరెపలాడించారు.

# గవర్నర్ వ్యవస్థ రద్దుపై చర్చించాలి

హైదరాబాద్, ఆగష్టు 12:అనేక విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుంటున్న మోడీ రాజకీయ సంస్కరణలపైనా దృష్టి సారించాల్సి ఉంది. ప్రధానంగా గవర్నర్ వ్యవస్థపై దృష్టి సారించాలి. ఎందుకంటే ఇది దేశానికి ఆర్థిక భారంగా మారింది. ప్రజల సొమ్ముతో ఈ వ్యవస్థ వల్ల ఏలా కోట్లాది రూపాయలు వృధా అవుతున్నాయి. దీనికితోడు రాజకీయాలకు రాజ్‌భవన్‌లు వేదికగా మారుతున్నాయి. అలాగే రాజకీయ పునరావాస కేంద్రాలకు కారణమవుతున్నాయి. అందువల్ల తోణం దీనిని రద్దు చేస్తే దేశానికి, ఆర్థికరంగానికి మేలు చేసిన వారు అవుతారు. గతంలో అనేక అనుబవాలు చూశాం. ఏ విదంగా గవర్నర్ వ్యస్థను ఉపయోగించి రాష్ట్ర ప్రభుత్వాలను అస్థిర పరిచారో?

గవర్నర్ల వ్యవస్థ అనవసరమని అనుకుంటున్న తరుణంలో వారంతా రాజ్యాంగ విరుద్దంగా ప్రవర్తిస్తున్నారు. నిజానికి అసెంబ్లీ బలపరీక్ష తరవాతనే ఎవరైనా సిఎం కాగలిగేలా చట్టాలను మార్చుకోవాలి. అసెంబ్లీలో నెగ్గిన తరవాతనే ఆ పార్టీ నాయకుడు సిఎం అయ్యేలా చూడాలి. పొత్తులకు సంబంధించి కూడా స్పష్టమైన విధానం ఉండాలి. ఎన్నికల్లో ఒకరిని ఒకరు తిట్టుకుని ఓట్లు పొందాక ఇప్పుడు కలసి అధికారం చేపడ తామంటే సరయినదేనా అన్న చర్చ కూడా చేయాలి. అయితే గవర్నర్ల వ్యవస్థను ఎత్తేయాల్సిన అవసరం ఇటీవలి వరుస ఘటనలు రుజువు చేస్తున్నాయి. ఇన్నాళ్లూ కాంగ్రెస్ పార్టీ గవర్నర్ల వ్యవస్థను అపహాస్యం చేసింది. ఇష్టారాజ్యంగా వాడుకు ంది. రాజ్‌భవన్లను ఆయా రాష్ట్రాల కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాల యాలుగా వాడుకుంది. అలాంటి కాంగ్రెస్ పార్టీ ఇవాళ విలువలు, రాజ్యాంగం గురించి మాట్లాడడం విడ్డూరం కాక మరొటి కాదు. వ్యవస్థలను నిర్వీర్యం చేసి, రాజ్యాంగాన్ని అపహాస్యం చేసిన పార్టీగా కాంగ్రెస్ చరిత్రలో నిలిచిపోయింది. అది చేసిన పాపాలకు దానిని ఎన్ని సార్లు పాతరేసినా పరిహారం తీరదు. మోడీ నేతృత్వంలోని బిజెపి కూడా కాంగ్రెస్ బాటలోనే నడవదన్న సంకేతాలు ఇచ్చింది. అలాంటప్పుడు ఓ పక్కా వ్యవస్థను నిర్మించుకోవాల్సి ఉంది. రాజ్యాంగంలో మార్పులు చేసుకుని సక్రమంగా నడుచుకుని కోర్టుల ప్రమేయం లేకుండా సాగాలి. ఇప్పటి వరకు ఉన్న అనుభవాలను క్రోడీకరించి ముందుకు సాగాలి. అధికార సాధనే తప్ప, ప్రజల బాగోగులు ఏమాత్రం పట్టని నేతలు, పార్టీలు అధికారంలోకి వస్తే ప్రజాస్వామ్యం పరిహాసమయ్యే తీరుకు అనేక ఉదాహరణ.లు ఉ న్నాయి. కేంద్రానికి, రాష్ట్రానికి మధ్య సంధానకర్తలుగా నిలిచి సమాఖ్య వ్యవస్థ బలపడేలా చూడాల్సిన గవర్నర్ల వ్యవస్థను స్వార్థ ప్రయోజనాల కోసం పాలక పార్టీలు బలి చేసిన తీరును దేశ ప్రజానీకం గతంలో అనేకం చూసింది. కేరళలో నంబూద్రిపాద్ మొదలు అనేక రాష్ట్రాల్లో గవర్నర్ల వ్యవస్థను కాంగ్రెస్ భ్రష్టుపట్టించింది. యూపిలో గతంలో జగదాంబికాపాల్‌ను సీట్లో కూర్చుండబెట్టింది కాంగ్రెస్ ప్రభుత్వమే. గతంలో ఉన్న ఉదాహరణలు పట్టించుకోవడం లేదు. మెజార్టీ ఉన్న పార్టీని అధికార ఏర్పాటుకు పిలవడం ఆనవాయితీగా వస్తోంది. కానీ ఇటీవల మణిపూర్, గోవా, మేఘాలయల్లోఅత్యధిక సీట్లను పొందిన పార్టీలను కాదని అడ్డదోవన బిజెపి అధికారాన్ని చేజిక్కించుకుంది. ఇప్పుడదే విధానం అమలు చేయాలని అంటున్న వారు గతంలో ఎలా నడిచారన్నది చూసుకోవడం లేదు. అసెంబ్లీలో బలాల తేడా ఉన్నప్పుడు రెండు పార్టీలను పిలిచి వారి బలాన్ని తెలుసుకుని వారినే ప్రభుత్వం ఏర్పాటుకు గవర్నర్ ఆహ్వానించాలి. నరేంద్రమోడీ ప్రధానమంత్రి గా బాధ్యతలు స్వీకరించిన తరువాత కొన్ని సందర్భాల్లో కాంగ్రెస్ గతంలో అనుసరించిన విధానాలనే పాటిస్తున్నారు. ఎప్పటికి ఏది అవసరమో దానిని ఆచరిస్తున్నారు. దానినే తగిన విధానంగా కొనసాగించారు. ఇందుకు ఆయన కాంగ్రెస్ అనుసరించిన విధానాలనే పాటిస్తున్నారు. కాంగ్రెస్ లాగానే తన అస్మదీ యులను, తాబేదార్లను అనేక రాష్ట్రాలకు గవర్నర్లుగా నియమించారు. గతంలో కాంగ్రెస్ హయాంలో మంత్రులుగా, ముఖ్యమంత్రులుగా పనిచేసిన వారు గవర్నర్లుగా నియమితులై ఆ పార్టీకి అనుకూలంగా అనేకానేక రాజకీయాలు నెరిపారు. అవన్నీ మరచిపోయి ఇప్పుడు విమర్శలు చేసే వారు గతాన్ని తవ్వితీయాలి. గతమంతా కరెక్టా కాదా అన్న వివేచన లేకుండా ఇప్పుడు జరిగిందే తప్పు అని అనడానికి లేదు. ఉమ్మడి ఏపిలో నాదెండ్ల భాస్కర్ రావును సిఎం చేయడం కోసం గవర్నర్ రామ్‌లాల్ ఎలా వ్యవహరించారో చెప్పాలి. అన్యాయంగా ఎన్టీఆర్‌ను పదవీచ్యుతుడిని చేస్తే వందిమాగధుల్లా కమ్యూనిస్టులు వ్యవహరించారు. బాబును భుజానికెత్తుకున్నారు. ఆనాటి గవర్నర్ కృష్ణకాంత్ తీరును ఎందుకు తప్పుపట్టలేక పోయారో చెప్పలేదు. కనీసం పశ్చాత్తాపం కూడా ప్రకటించలేదు. ఎందుకు ఎన్టీఆర్‌ను ఆనాడు పదవీచ్యుతిడిని చేశారో చెప్పాలి. అలాగే ఎన్టీఆర్‌ను బర్తరఫ్ చేసి చంద్రబాబును ఎందుకు సిఎం చేశారో, అందుకు కమ్యూనిస్టులు ఎందుకు వత్తాసు పలికారో చెప్పాలి. ఆనాడు విలువలు మరచిపోయిన నేతలు ఈనాడు విలువల గురించి మాట్లాడుతున్నారు. నిజానికి ఇదంతా వ్యవస్థీకృతంగా ఉన్న లోపం. దీనిపై చర్చించాలి. ఇలాంటి తప్పిదాలు లేకుండా చూసేలా చట్టాలు చేసుకోవాలి. రాజ్యాంగంలో మార్పులు చేసుకోవాలి. మొత్తంగా ఆరోవేలులాగా ఉన్న గవర్నర్ వ్యవస్థను రద్దు చేయడం ఒక్కటే పరిష్కారం కాగలదు.

# ప్రలోభాలతో ప్రజలను తప్పుదోవ పట్టించే విమర్శలు

## ఫలితాలు వచ్చాక అధికారం కోసం కౌగిలించుకోవడం కర్నాటక తరహా రాజకీయాలు మారాల్సిందే

న్యూఢిల్లీ,ఆగస్ట్12 (ఆర్ ఎన్ఎ): ఇటీవలి కర్నాటక ఎన్నికల ప్రచార సమయంలో క్షేత్ర స్థాయిలో నెలకొన్న వాస్తవ సమస్యల ప్రస్తావనకన్నా, ప్రజలను ప్రలోభాల్లో ముంచ డానికే కాంగ్రెస్, బిజెపి, జెడిఎస్ లు కర్నాటకలో ప్రాధాన్యత ఇచ్చాయి. ఈ మూడు పార్టీలు పరస్పరం విమర్శించుకుని పోటీ పడి ఎన్నికల్లో ప్రచారం నిర్వహించాయి. ఎన్నికల్లో కనీసంగా అయినా తాము అవసరమైతే ఒకరినొకరు కలుస్తామని చెప్పలేదు. తీరా ఫలితాలు వెలువడ్డాక 38 సీట్లున్న జెడిఎస్‌ను గద్దెపై కూర్చోబెడతామని కాంగ్రెస్ ఎందుకు అనుకుందో కానీ ఆ పొత్తు 14 నెలలకే విచ్చిన్నం అయ్యింది. కేవలం 38 సీట్లతో ఎలా పాలన చేస్తారో ప్రధానిగా పని చేసిన పెద్దాయన దేవేగౌడకు తెలియదా? ఆయననకు కాంగ్రెస్ ఎలా కింద పడేసిందో అనుభవం లేదా? అయినా కాంగ్రెస్ అయాచితంగా మద్దతు ఇస్తామంటే ఎందుకు ఎగిరి గంతేసారు. ఐదేళ్ల పాటు ఖచ్చింతంగా తమతో పాటే ఉంటామని కాంగ్రెస్ ఏమైనా జెడెస్‌కు హామీ ఇచ్చిందా అంటే అదీ లేదు. అధికారం కోసం అడ్డమైన గడ్డి తినడానికి సిద్దమని కార్నాటక నేతలు ఇప్పుడు కాంగ్రెస్‌పై తప్పునునెట్టి విమర్శిస్తున్నారు. చేశాయి. రైతాంగ సంక్షోభం, సాగు తాగునీటి సమస్య, నిరుద్యోగం, ఉద్యోగ భద్రత, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, విద్య, వైద్యం సామాన్యులకు అందకపోవడం వంటి అంశాల నుండి పక్కదోవ పట్టించడానికి టక్కుటమార విద్యలన్నీ ప్రయోగించాయి. అసలు సమస్యలకు పరిష్కారం చూపకపోగా, కొసరు పథకాలతో మభ్య పెట్టాయి. ప్రజల ఐక్యతను చీల్చడానికి బిజెపి మతాన్ని ఆయుధంగా వాడుతుంటే, తాను కూడా ఆ తానులో ముక్కేనని చెప్పడానికే కాంగ్రెస్ పోటీ పడింది. ఎన్నికల ముందు లింగాయత్‌లకు మతం హోదా కట్టబెడుతూ నిర్ణయం తీసుకోవడం నుండి ప్రచార పర్వంలో దేవాలయాలు, ఆశ్రమాల సందర్శనలో అమిత్‌షాతో రాహుల గాంధీ పోటీ పడటం ఇదే విషయాన్ని తేటతెల్లం చేస్తోంది. కాంగ్రెస్ అనుసరించిన ఈ విధానం ఆ పార్టీకి ఉపయోగపడకపోగా, కోస్తా కర్ణాటకలో బిజెపి అత్యధిక స్థానాలు కైవసం చేసుకోవడానికి దోహదపడింది. అవినీతి, నేర చరిత్ర ఉన్న వారికి టిక్కెట్లు ఇవ్వడం నుండి, ప్రచార పర్వంలో కోట్లు కుమ్మరించడం వరకు మూడు పార్టీలూ పోటీపడ్డాయి. పార్టీల పోకడలు, విధానాలతో పాటు నేతల మాటలు, చేతల్లో ఏ మాత్రమూ తేడా లేని పార్టీల్లో ఏదో ఒక దానిని ఎంచుకోక తప్పని స్థితి ఓటర్లకు ఏర్పడింది. రాజకీయ దిగజారుడు తనానికి దృష్టాంతంగా నిలిచిపోగలదు. మన ఎన్నికల వ్యవస్థలోని డొల్లతనాన్ని ఇది బట్టబయలు చేస్తోంది. ఎన్నికల వ్యవస్థలో సమూల మార్పుల కోసం తీవ్రంగా మేధోమథనం చేయాల్సిన అవసరాన్ని కర్నాటక ఫలితాలు గుర్తు చేసాయి. కేవలం ఎన్నికల ఎత్తుగడలకు, పార్లమెంటరీ పోరాటానికి మాత్రమే పరిమితమయితే ధన రాజకీయాన్ని నిలువరించడం సాధ్యం కాదు. ప్రజల కష్టాలకు, కన్నీళ్లకు కారణాలు చెప్పి, వాటిని సమూలంగా పరిష్కరించే నిజమైన ప్రత్యామ్నాయ విధానాలను ముందుకు తీసుకురావడం, వాటి ఆధారంగా జరిగే ప్రజా పోరాటాలను బలపరచడం అన్న విధానం రావాలి. గవర్నర్ల వ్యవస్థ తటస్థంగా ఉండి ఉంటే అసలు ఏ వివాదమూ రాదు. కేంద్రంలో అధికారంలో ఉన్నవారు గవర్నర్లను నియమించడం, కీలక సమయాల్లో ఆ గవర్నర్లు కేంద్ర పాలకుల అభీష్టాన్ని నెరవేర్చడం ఒక సంప్రదాయంగా స్థిరపడిపోయింది.

# డేకేర్ సెంటర్‌లో దారుణం

## అగ్నిప్రమాదంలో ఐదుగురు చిన్నారుల దుర్మరణం

న్యూయార్క్,ఆగస్ట్12 (ఆర్ఎన్ఎ): అమెరికాలో పెను విషాదం చోటు చేసుకుంది. పెన్సిల్వేనియా ఎరీలో జరిగిన భారీ అగ్నిప్రమాదంలో అభంశుభం తెలియని చిన్నారులు సజీవదహనమయ్యారు. షార్ట్ సర్క్యూట్ తో డే కేర్ సెంటర్ లో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. దీంతో ఐదుగురు చిన్నారులు మృత్యువాత పడ్డారు. మృతులంతా 8 నెలల నుంచి ఏడేళ్ల మధ్య వయసువారేనని అధికార వర్గాలు వెల్లడించాయి. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. 12 నుంచి 17 ఏళ్ల మధ్య ఉన్న ఇద్దరు ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. ఘటనాస్థలికి ÷రిరజన్ చేరుకునేటప్పటికే ఇల్లు పూర్తిగా ధ్వంసం అయింది. ప్రమాదంపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు..విచారణ చేపట్టారు.

# ఆనందంలో లక్షలాది రైతు కుటుంబాలు

## రైతుబంధు సాయంతో పెట్టిబడి దక్కిందని వెల్లడి

హైదరాబాద్,ఆగస్ట్12(ఆర్ఎన్ఎ): తెలంగాణ వ్యాప్తంగా రైతుబంధు పన్నీటి జల్లు చల్లింది. రైతుబంధు పథకం కింద ఇచ్చిన చెక్కులతో పెట్టుబడికి ఆసరా దక్ఇకందన్న ఆనందం వ్యక్తం అవుతోంది. ఎకరాకు ఐదువేల చొప్పున అందచేశారు. రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నగదును అందజేశారు. ఆయా జిల్లాలో అత్యధికంగా ఉన్న గిరిజన రైతులు రైతుబంధు పథకం ద్వారా ఎక్కువ సంఖ్యలో ప్రయోజనం పొందారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తరువాత టీఆర్ఎస్ ప్రభుత్వంలో తొలిసారిగా అన్నదాతలను ఆదుకునేందుకు దేశ చరిత్రలోనే రైతుబంధు పథకాన్నిప్రవేశపెట్టి రైతులకు సాగు సహాయాన్ని ఉచితంగా అందించే కార్యక్రమం విజయవంతంగా కొనసాగించింది. రైతును రాజు చేయాలని.. అప్పులపాలవుతున్న రైతులను ఆదుకునేందుకు సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన రైతుబంధు పథకం వారికి ఆర్థికంగా అండదండగా నిలిచింది.అన్ని విధాలుగా రైతులకు మేలు చేసే విధంగా ఉందని రైతులు అభిప్రాయం వ్యక్తం చేశారు. రైతులను అన్ని విధాలుగా ఆదుకునేందుకు తెలంగాణ రాష్ట్రంలో టీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్న ఈ ఉచిత పెట్టుబడి సహాయం కార్యక్రమానికి రైతుల నుంచి అనూహ్య స్పందన లభించింది. గత పాలకులు ఏనాడూ ఇలా ఆలోచించలేదని రైతుబంధు అందుకున్న రైతులు అభిప్రాయం వ్యక్తం చేశారు. సంక్షేమ దిశగా కొనసాగుతూ ప్రతీ ఇంటా ఆనందాన్ని నింపుతున్న ప్రభుత్వాన్ని రైతులంతా ఆశీర్వదించారు.అధికారులు, మంత్రులు, ఎమ్మెల్యేలు,ఎంపిలు నిరంతరంగా ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారు. గతంలో ఎప్పుడూ లేనివిధంగా అధికారయంత్రాంగం మొత్తం ఈకార్యక్రమం విజయవంతం కావడానికి కృషి చేసింది.

# లవర్‌తో జీవించాలనుకున్న ఇల్లాలు భర్త హత్యతో జైలు జీవితం

జైపూర్,ఆగస్ట్12(ఆర్ఎన్ఎ): లవర్‌తో జీవితాంతం కలిసి ఉండాలని కలలు కని భర్తను వదలించుకున్న ఇల్లాలు ఊచలు లెక్కబెడుతోంది. ఆమెకు సహకరించిన ప్రియుడిని, ఆమె చెల్లెలును కూడ ఆపోలీసులు అరెస్ట్చేశారు. తన భర్తను చంపేసిన ఓ భార్య సంఘటన రాజస్థాన్ రాష్ట్రం కోటా జిల్లాలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఓ మహిళ తన ఇంట్లో దొంగతనం జరిగిందని, ముగ్గురు దొంగలు ఇంట్లోకి చొరబడి కత్తులతో బెదిరించి 18 వేల రూపాయలతో పాటు తన మంగళసూత్రాన్ని ఎత్తుకెళ్లారని పోలీసులకు ఫోన్ చేసింది. స్థానిక ఎస్‌పి దీపక్ భార్గవ్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. సదరు మహిళ భర్త రక్తపు మడుగులో చనిపోయి ఉన్నాడు. దొంగలే తన భర్తను కత్తులతో పొడిచి చంపి పారిపోయారని మహిళ పోలీసులకు వివరించింది. మహిళ, మహిళ చెల్లెలు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విచారణ చేస్తున్నప్పుడు పోలీసులకు మృతుడి భార్యపై అనుమానం వచ్చి తనదైన శైలిలో విచారణ జరపగా తానే నేరం చేశానని ఒప్పుకుంది. సదరు మహిళ ఓం ప్రకాశ్ అనే వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుంది. దీంతో భర్త, భార్యల మధ్య పలు రోజుల నుంచి వివాదం నడుస్తోంది. భర్తను వదిలించుకొని ప్రియుడితో ఉండాలని భర్తను అంత మొందించాలని భార్య అనుకుంది. తన లవర్‌తో కలిసి భర్తను కత్తులతో పొడిచి చంపింది. ఈ మర్డర్ జరుగుతున్నప్పుడు ఆమె చెల్లెలు కూడా ఘటనా స్థలంలోనే ఉందని ఒప్పుకుంది. దీంతో ఆమె చెల్లెలుతో పాటు ఆమెను అరెస్టు చేశారు. ఆమె ప్రియుడు ఓం ప్రకాశ్‌ను బరన్ జిల్లాలో అరెస్టు చేసి రిమాండ్ తరలించారు.

# డ్రోన్ల ద్వారా అడవుల్లో విత్తనాలు చల్లే కార్యక్రమం

## మేడ్చెల్ జిల్లాలో అటవీశాఖ ప్రయోగం

హైదరాబాద్,ఆగస్ట్12(ఆర్ఎన్ఎ): అడవులను మరింత అభివృద్ధి చేసేందుకు విస్తృతంగా మొక్కలు నాటుతున్న రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ లిమిటెడ్ (టీఎస్ఎఫ్‌డీసీఎల్) కొత్త రకం ప్రయోగాన్ని మొదలు పెట్టింది. మనుషులు వెళ్లి విత్తనాలు నాటేందుకు వీలుపడని అడవుల్లో డ్రోన్ల సాయంతో విత్తనాలు చల్లే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దక్షిణ భారతదేశంలో తొలిసారిగా మేడ్చల్ జిల్లా చెంగిచర్ల రిజర్వ్ ఫారెస్టులో అటవీ అధికారులు నేడు డ్రోన్ల సాయంతో విత్తనాలు నాటే కార్యక్రమం చేపట్టారు. గతంలో ఇలాంటి ప్రయోగాన్ని ఉత్తరాఖండ్, రాజస్థాన్‌లో అమలుచేసి మంచి ఫలితాలు సాధిచండంతో తెలంగాణలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. చెంగిచర్ల రిజర్వ్ ఫారెస్ట్‌తో పాటు కీసర, లాల్‌గడి మలక్‌పేట రిజర్వ్ ఫారెస్ట్ బ్లాక్‌లలో డ్రోన్ల సాయంతో భారీ వృక్షాల విత్తనాలను అధికారులు నాటుతున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ ఎండీ పి.రఘువీర్, జిల్లా అటవీ అధికారి సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మళ్లీ సినిమా తీయండి!



హైదరాబాద్, ఆగస్టు 12: 'సమాజానికి మంచి సందేశాన్ని ఇచ్చే మరో సినిమా చేయండి, నిర్మాణపరమైన విషయాలు నేను చూసుకుంటా'నని ప్రముఖ దర్శకుడు కే. విశ్వనాథ్‌ను ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు కోరారు. 'నేను చిన్నప్పటి నుంచి మీ అభిమానిని, మీ సినిమాలంటే చాలా ఇష్టం. మీరు తీసిన ప్రతి సినిమా చూశా. శంకరాభరణం అయితే 25 సార్లకు పైగా చూశా. దాదాపు అన్ని సినిమాలు అలాగే చూశా. ఇప్పటికీ వీలు దొరికితే మీ సినిమాలే చూస్తుంటా' అని కేసీఆర్ చెప్పడంతో విశ్వనాథ్ ఆనందంతో ఉప్పొంగిపోయారు. ఆదివారం హైదరాబాద్ ఫిల్మ్‌నగర్‌లో విశ్వనాథ్ ఇంటికి సీఎం కేసీఆర్ మర్యాదపూర్వకంగా వెళ్లి కలిశారు. విశ్వనాథ్ దర్శకత్వంలో వచ్చిన సినిమాల్లోని సన్నివేశాలు, గొప్పతనం దగ్గరి నుంచి కాళేశ్వరం ప్రాజెక్టు వరకు ఇద్దరి మధ్య గంటకుపైగా చర్చ జరిగింది. 'మీ సినిమా చూసినప్పుడల్లా స్వయంగా కలువాలని అనుకున్నప్పటికీ ఇన్నాళ్లకు ఆ కోరిక తీరిందని కేసీఆర్ ఆనందం వ్యక్తం చేశారు. 'మీరు తీసిన ప్రతి సినిమా ఓ కావ్యంలా ఉంటుంది. ప్రతి సినిమాను ఒక తపస్సులా తీశారు. మాటలు, పాటలు, కళాకారుల ఎంపిక నుంచి సన్నివేశాల చిత్రీకరణ వరకు ప్రతిదీ ఎంతో గొప్పగా ఉంటుంది. కుటుంబమంతా కూర్చుని చూసేలా ఉంటాయి' అని కేసీఆర్ వివరించారు. 'మీ మీద ఉన్న అభిమానమే నన్ను మీ దగ్గరకి తీసుకొచ్చింది. మిమ్మల్ని కలవడం, మీతో మాట్లాడటం నా అదృష్టంగా భావిస్తున్నాను' అన్నారు. 'మీ నుంచి సినిమా రాక పదేళ్లు అయింది. సందేశాత్మక సినిమాలు ఈ మధ్యలో రావడం లేదు. మీరు మళ్లీ సినిమా తీస్తానంటే నిర్మాణ పరమైన బాధ్యతలు నేను చూసుకుంటా' అని కేసీఆర్ కోరారు. 'మీరే స్వయంగా మా ఇంటికి రావడం మా అదృష్టం. మీ ఇంటికి వస్తున్నానని రాత్రి ఫోన్లో చెబితే ఎవరో గొంతు మార్చి మీలాగా మాట్లాడుతున్నారని అనుకున్నాను. స్వయంగా మీరే మాట్లాడారని తెలుసుకున్నాక రాత్రి నిద్ర పట్టలేదు. మీరు చేసే పనుల గురించి ప్రజల కోసం పడే తపించే తత్వం గురించి టీవీలు, పత్రికల్లో చూస్తున్నాను. నేరుగా చూడడం, మాట్లాడడం ఇదే మొదటిసారి. చాలా సంతోషంగా ఉంది. గతంలో ఒకసారి తమిళనాడు ముఖ్యమంత్రి ఎంజిఆర్‌కు కూడా నాతో మాట్లాడారు' అని విశ్వనాథ్ గుర్తు చేస్తూ ఆనందం వ్యక్తం చేశారు. ఆరోగ్యం ఎలా ఉందని కేసీఆర్ ప్రశ్నిస్తే, ఆసక్తికరమైన విషయాన్ని విశ్వనాథ్ చెప్పుకొచ్చారు. 'ఆరోగ్యం బాగానే ఉన్నా మోకాళ్ల నొప్పులున్నాయి. ఆపరేషన్ చేస్తామని డాక్టర్లు చెబుతున్నా, ఆపరేషన్ అన్నా, రక్తమన్నా, హాస్పిటలన్నా నాకు మొదటి నుంచి భయం. అందుకే నా సినిమాల్లో ఆస్పత్రి సీన్లు పెట్టను. ఇక నేనేమి ఆపరేషన్ చేయించుకుంటా, ఇలాగే గడిపేస్తా' అని వివరించారు. తెలుగు భాషపైనా, సాహిత్యంపై ఇంతమంచి పట్టు ఎలా వచ్చింది. చక్కగా మాట్లాడుతారు, కళాభిమానం ఉంది, సాహిత్యాభిలాష ఎలా పుట్టిందని విశ్వనాథ్ ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు గొప్పగా కట్టారని విశ్వనాథ్ భార్య జయలక్ష్మి సీఎం కేసీఆర్‌ను అభినందించారు. రైతులకు సాగునీరు ఇవ్వాలన్న మీ తపన నెరవేరిందన్నారు. మంచి పనులు చేస్తున్నా విమర్శలు తప్పడం లేదు, వాటిని ఎలా భరిస్తున్నారని విశ్వనాథ్ ప్రశ్నించారు. రాజకీయాల్లో విమర్శలు తప్పవని, ప్రజలకు మంచి జరుగుతుంటే వాటిని పెద్దగా పట్టించుకోనని కేసీఆర్ వివరించారు. తమ ప్రభుత్వం సినిమా రంగానికి కొత్త పాలసీని తీసుకరాబోతుందని కూడా కేసీఆర్ వివరించారు. సీఎం స్వయంగా తన ఇంటికి రావడంపై విశ్వనాథ్ మీడియాతో స్పందిస్తూ కుచేలుడి ఇంటికి శ్రీకృష్ణుడు వచ్చినట్టుగా ఉందని వ్యాఖ్యానించారు. ఇలావుంటే, విశ్వనాథ్‌ను కలిసేందుకు సీఎం కేసీఆర్ స్వయంగా వెళ్లడంతో పలు అనుమానాలు వ్యక్తమయ్యాయి. విశ్వనాథ్ ఆరోగ్య పరిస్థితి బాగాలేనందుకే సీఎం పరామర్శకు వెళ్లారంటూ సోషల్ మీడియాలో వార్త వైరలైంది. దీనితో విశ్వనాథ్ స్వయంగా ఒక వీడియోను అప్‌లోడ్ చేయాల్సి వచ్చింది. తాను ఆరోగ్యంగానే ఉన్నానని, కేసీఆర్ తనను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారే తప్ప ఇతరత్రా కారణాలు ఏవీ లేవనీ స్పష్టం చేశారు.

## పరిస్థితి తీవ్రమే

తిరువనంతపురం, ఆగస్టు 12: గత కొన్ని రోజులుగా కేరళను ముంచెత్తుతున్న వర్షాలు.. వాటి ఫలితంగా సంభవిస్తున్న వరదలు ఆదివారం కొంత మేర శాంతించినప్పటికీ పరిస్థితి మాత్రం ఇంకా బీభత్సంగానే కనిపిస్తోంది. ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 2లక్షల 27 వేల మందిని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సహాయ శిబిరాలకు తరలించారు. మృతుల సంఖ్య 60కి పెరిగింది. ముఖ్యమంత్రి పినరాయ్ విజయన్ ఆదివారం సీనియర్ అధికారులతో సమావేశమై వరద పరిస్థితిని అత్యవసరంగా తీసుకోవలసిన చర్యల పైనా సమీక్షించారు. ఈనెల 8వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు, వరదలు బీభత్సం సృష్టించాయని, బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలూ చేపడుతోందని అనంతరం మీడియాతో మాట్లాడుతూ విజయన్ స్పష్టం చేశారు. వర్షాల తీవ్రత తగ్గినప్పటికీ ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. ముఖ్యంగా అనక చోట్ల కొండ చరియలు విరిగిపడే ప్రమాదం కనిపిస్తోందని, ఆ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు గరిష్ట స్థాయిలో అప్రమత్తత పాటించాలన్నారు. రాష్ట్రంలోని అనేక ఆన కట్టల్లో నీటి మట్టం భారీగా పెరిగినప్పటికీ దానివల్ల ఎలాంటి ప్రభావం లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కాగా, రాష్ట్రంలోని కన్నూరు, వాయనాడ్, కాసఫూడ్ జిల్లాల్లో భారీ ఎత్తున వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ విభాగం హెచ్చరించింది.

# తగ్గని వర్షాలు.. తరగని వెతలు!



ముంబయి, ఆగస్టు 12: గత కొన్ని రోజులుగా మహారాష్ట్రలోని అనేక ప్రాంతాలను ముంచెత్తుతున్న వర్షాలు, వరదల కారణంగా ఇప్పటికే జన జీవనం తేరుకోలేని పరిస్థితి కొనసాగుతూనే ఉంది. రాష్ట్రంలో వరద ముంపునకు గురైన ప్రాంతాల నుంచి 4 లక్షల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించామని అధికారులు ఆదివారం వెల్లడించారు. అలాగే సంఘ్లీ జిల్లాలో పడవ బోల్తాపడిన ఘటనలో మరణించిన వారి సంఖ్య 17 కు పెరిగింది. పశ్చిమ మహారాష్ట్రలో వరద తీవ్రతను తగ్గించేందుకు 5 లక్షల క్యూ సెక్కుల నీటిని విడుదల చేశారు. రాష్ట్రంలోని ఐదు జిల్లాల్లో వర్షాల కారణంగా మరణించిన వారి సంఖ్య 30కి పెరిగిందని అధికారులు తెలిపారు. సంఘ్లీ బోటు ప్రమాదంలో మరణించిన 17 మందిలో అనేక మంది మృతదేహాలను వెలికి తీసినట్లు అధికారులు తెలిపారు. కోల్హాపూర్, సతారా, థానే, పూణె, నాసిక్, రాయగఢ్, సిందూదుర్గ్ జిల్లాల్లో గత వారం రోజులుగా వర్షాలు కురుస్తూనే ఉన్నాయని అధికారులు తెలిపారు. వరద ముంపునకు గురైన ప్రాంతాల నుంచి క్రమంగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నామని వెల్లడించారు. వరదల కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా 761 గ్రామాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, ముంపు ప్రాంతాల్లో చిక్కుకుపోయిన ప్రజలకు హెలికాప్టర్ ద్వారా ఆహార పదార్థాలను, మందులను అందిస్తున్నామని అధికారులు తెలిపారు. సహాయక చర్యలో ఎన్డీఆర్ఎఫ్‌తో పాటు, నౌకాదళం సైనిక బృందాలు కూడా చురుగ్గా పాల్గొని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నాయని అధికారులు వెల్లడించారు. ముఖ్యంగా వరద ప్రాంతాల్లో బోట్లలో వెళ్లి మరీ చిక్కుకుపోయిన వారిని ఈ బృందాలు ఒడ్డుకు తెస్తున్నాయని తెలిపారు. కాగా, ప్రజలకు తక్షణ వైద్యాన్ని అందించేందుకు వరద ప్రాంతాలకు వందకు పైగా ప్రవేట్ డాక్టర్ల బృందాన్ని ప్రభుత్వం పంపిస్తోంది. వరదల వల్ల దెబ్బతిన్న విద్యుత్ మీటర్లను ఉచితంగానే మారుస్తామని మహారాష్ట్ర విద్యుత్ బోర్డు ప్రకటించింది.

# ద్రవ్య లభ్యతకు చర్యలు



న్యూఢిల్లీ, ఆగస్టు 12: రియల్ ఎస్టేట్ రంగాన్ని ప్రభావితం చేస్తున్న సమస్యలను త్వరలో పరిష్కరించడం జరుగుతుందని కేంద్ర ప్రభుత్వం ఆదివారం తెలిపింది. రియల్ ఎస్టేట్ రంగానికి చెందిన సంస్థలు, ఇళ్ల కొనుగోలుదారులు ఆదివారం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిసి ద్రవ్యలభ్యత కొరత, డిమాండ్ మందగించడం, ప్రాజెక్టులు నిలిచిపోవడం వంటి సమస్యలను వివరించారు. నిర్మలా సీతారామన్ ఆదివారం రెండుసార్లు వివిధ సంస్థలతో వేర్వేరుగా సమావేశమయ్యారు. ఆమె తొలుత రియల్ ఎస్టేట్ రంగానికి చెందిన సంస్థలు సీఆర్ఈడీఏఐ (క్రెడాయి), ఎన్ఏఆర్ఈడీసీఓ (నరెడ్కో)తో సమావేశమయ్యారు. తరువాత ఇళ్ల కొనుగోలుదారుల అసోసియేషన్‌తో సమావేశమయ్యారు. ఈ రెండు సమావేశాలలోనూ ఆమె స్థిరాస్తి రంగం ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ఈ రంగాన్ని బలోపేతం చేయడానికి తీసుకోవలసిన చర్యల గురించి మాట్లాడారు. గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పురి, ఆర్థిక శాఖ సహాయ మంత్రి అనురాగ్ ఠాకూర్, ఆర్థిక వ్యవహారాలు, రెవెన్యూ, హౌసింగ్, సీబీడీటీ, కార్పొరేట్ వ్యవహారాలు, రెరా శాఖలకు చెందిన పలువురు ఉన్నతాధికారులు నిర్మలా సీతారామన్‌తో పాటు ఈ సమావేశాలలో పాల్గొన్నారు. ద్రవ్యలభ్యత కొరత, అంతగా విక్రయాలు లేకపోవడం వల్ల స్థిరాస్తి రంగంలో అశాంతి నెలకొందని క్రెడాయి, నరెడ్కోలకు చెందిన ప్రతినిధులు నిర్మలా సీతారామన్‌కు వివరించినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. స్థిరాస్తి రంగ ప్రాజెక్టులకు రుణాలు ఇవ్వడానికి బ్యాంకులు, బ్యాంకింగ్‌యేతర ఆర్థిక సంస్థల (ఎన్‌బీఎఫ్‌సీలు)ను ప్రోత్సహించాలని వారు ఆర్థిక మంత్రిని కోరారు. ఈ సమావేశానంతరం మంత్రి హర్‌దీప్ సింగ్ పురి మీడియాతో మాట్లాడుతూ స్థిరాస్తి రంగానికి చెందిన సంస్థల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఎంతో ఉపయోగకరమయిన చర్చ జరిగిందని తెలిపారు. ఈ రంగానికి సంబంధించిన అనేక సమస్యలను తాము ఈ చర్చల్లో గుర్తించామని, రానున్న రోజుల్లో ప్రభుత్వం ఈ సమస్యలను పరిష్కరిస్తుందని ఆయన చెప్పారు.

# అది దేశ, కాశ్మీర్ ప్రజల అభిమతం




చెన్నై, ఆగస్టు 12: జమ్మూ కాశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తిని కలిగించే ఆర్టికల్ 370 రద్దు అంశాన్ని రాజకీయ కోణంలో చూడొద్దని ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు స్పష్టం చేశారు. కాశ్మీర్ అంశం భారత్‌లో అంతర్భాగమనీ, అక్కడి ప్రజల అభిమతంగా అంతా గుర్తించాలని పేర్కొన్నారు. రెండు సంవత్సరాల్లో రాజ్యసభలో వెంకయ్యనాయుడి అనుభవాలను ఉటంకిస్తూ రాసిన 'లిసనింగ్, లెర్నింగ్, లీడింగ్' పుస్తకాన్ని చెన్నైలో ఆదివారం హోం మంత్రి అమిత్ షా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఉప రాష్ట్రపతి వెంకయ్య మాట్లాడుతూ ఆర్టికల్ 370 రద్దును ప్రతిపాదిస్తూ పార్లమెంట్ ఆమోదానికి కృషి చేసిన అమిత్‌షాను తొలుత అభినందించారు. 'ఇపుడు బిల్ పార్లమెంట్ ఆమోదం పొందింది. దేశ అభిమతం దృష్ట్యా ఇది అవసరం.. మంచి అంశం' అని పేర్కొన్నారు. పార్టీలకు అతీతంగా దేశ అభిమతాన్ని దృష్టిలో ఉంచుకొని మాత్రమే ఆర్టికల్ 370 రద్దు బిల్లును ప్రతిపాదించారని.. పార్లమెంట్ దీనిని ఆమోదించిందని అన్నారు. కాశ్మీర్ ప్రజల మనోగతాన్ని దృష్టిలో ఉంచుకొని కూడా బిల్లు ఆమోదం జరిగిందన్న సంగతిని గుర్తుంచుకోవాలని రాజ్యసభ చైర్మన్ వెంకయ్యతో పాటు హోం మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. కాశ్మీర్ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు ఏమైతే ఉన్నాయో వాటి పరిష్కారానికి కృషి చేయడంతో పాటు అక్కడ పరిస్థితి సాధారణ స్థితికి వచ్చేందుకు అవసరమైన అన్ని చర్యలను కేంద్రం తీసుకొస్తుందని వీరు పేర్కొన్నారు. 1964లో బిల్లును అప్పటి ప్రభుత్వం ఆమోదించినప్పుడు కాశ్మీర్‌కు చెందిన ముగ్గురు సభ్యులు దీనిని వ్యతిరేకించాలని.. దీనివల్ల కాశ్మీర్‌కు ఎలాంటి లబ్ధి ఉండదని ఆనాడే స్పష్టం ఏశారన్న సంగతిని గుర్తు చేశారు. వెటరన్ సామాజికవేత్త రాం మనోహర్ లోహియా కూడా ఈ అంశాన్ని ఆనాడే స్పష్టం చేశారు. 'పార్టీలకు అతీతంగా సభ్యులు బిల్లు రద్దును సమర్థించారనీ.. మనమంతా చరిత్రను గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందని' అన్నారు. అకస్మాత్తుగా కొంతమంది బిల్లు రద్దుపై విమర్శలు గుప్పించడాన్ని గుర్తు చేస్తూ వెంకయ్య పై వ్యాఖ్యలు చేశారు. ఈనెల ఐదో తేదీన బిల్లుపై చర్చ జరిగిన సందర్భంలో నేను చాలా 'టెన్షన్' పడ్డానని.. మొత్తమీద సభను సజావుగా నడిపించగలిగానని వెంకయ్య పేర్కొన్నారు.

# ఇర్కోడు'తో దేశ, విదేశాలకు మాంసం

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 12: దేశవిదేశాలకు మాంసకృత్తుల ఉత్పత్తులను ఎగుమతి చేసేలా ఆర్డర్లు తెచ్చుకునేలా ఇర్కోడ్‌లో మాంసం పరిశ్రమ నెలకొల్పోతున్నామని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. దేశంలోని 28 రాష్ట్రాల ప్రజలు సగం మాంసం తింటే.. మిగత సగం తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో తింటున్నారని ఆయన వెల్లడించారు. ఆదివారం సిద్దిపేట రూరల్ మండలం ఇర్కోడ్ గ్రామంలోని లావణ్య గార్డెన్స్‌లో మహిళలకు అవగాహన, సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. 'కొత్తది చేద్దాం... మార్కెట్లో డిమాండ్ ఉన్నది చేద్దాం.. ఎవరూ చేయనిది చేద్దామన్నదే తన ఆలోచన అని అన్నారు. క్యాష్‌లెస్ ట్రాన్సాక్షన్స్, వడ్ల బీట్‌లో నిర్వహణలో ఫస్ట్ నిలిచిన ఇర్కోడ్ గ్రామాన్ని మరింత ఆదర్శంగా మార్చేలా గ్రామంలో మటన్‌ప్రాసెసింగ్ యూనిట్‌తో మరో ముందడుగు వేస్తున్నామని వెల్లడించారు. ఇర్కోడ్ మాంసం తొక్కు అంటే.. లొట్టలేసుకొని తినేలా బ్రాండ్‌గా మారుద్దాం' అన్నారు. మొదట సారిగా మహిళలు శిక్షణ పొంది స్వయం సమృద్ధి సాధించాలని హరీశ్ పిలుపునిచ్చారు. అభివృద్ధి చెందడమంటే రోడ్లు, భవనాలు నిర్మిస్తేకాదని మీరు వ్యక్తిగతంగా ఎదిగితే నిజమైన అభివృద్ధి అన్నారు. బెంగళూరు వారు వచ్చి హైదరాబాద్ సూపర్ మార్కెట్లో మటన్ వ్యాపారం చేస్తుండగా లేనిది ఇర్కోడ్ మటన్ అమ్మకాలు మనం చేయలేమా? అని ప్రశ్నించారు. దేశంలో మొత్తంలో మాంసపుకృత్తులకు సంబంధించిన శిక్షణ కేంద్రం హైదరాబాద్‌లో ఉందని తెలిపారు. 20 రోజులపాటు మీకు శిక్షణ ఇప్పించనున్నట్టు తెలిపారు. మాంసకృత్తులను రకరకాలైన వంటకాలుగా మార్చుకునేలా తయారు చేయవచ్చునని వెల్లడించారు. సంఘం బలపడితే.. మహిళలు ఆర్థికంగా ఎదుగుతారని, సిద్దిపేట మున్సిపాలిటీలో ఏర్పాటు చేసే స్లాటర్ హౌస్‌ను 2 కోట్లతో ఇర్కోడ్‌లో ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఇక మనకు హైదరాబాద్‌లో కావాల్సిన మార్కెట్ ఇర్కోడ్‌లో ఉంటుందన్నారు. ఇర్కోడ్ గ్రామాన్ని దత్తత తీసుకున్న చందర్‌రావు సహకారంతో ఇర్కోడ్ మటన్ హైదరాబాద్ ప్యారడైజ్ బిర్యానీ అవుతుందన్నారు. మొదటి అడుగు హైదరాబాద్ వేద్దామని, రెండవ అడుగు ఇర్కోడ్ మటన్ మస్కట్, దుబాయ్ పోవాలని పిలుపునిచ్చారు. అంతర్జాతీయ స్థాయిలో ఎగుమతులు జరుగుతాయనే నమ్మకం తనకు ఉందన్నారు. ఆ దిశగా శిక్షణలో అన్ని విషయాలు శోధించి సాధించాలని కోరారు. ఈ నెల 17న నుండి 20 మంది మహిళలు శిక్షణ పొందవలసి ఉంటుందన్నారు. ఇర్కోడ్ మహిళల్నందరినీ లక్షాధికారులుగా చూడాలన్నది తన కోరికన్నారు. రాష్ట్రంలోనే మొదటిసారిగా చేస్తున్న కార్యక్రమమిదని మొదట్లో కొంత కష్టంగా ఉన్న భవిష్యత్తులో లాభాలను గడిస్తామని చెప్పారు. జడ్పీ చెర్‌పర్సన్ వేలేటి రోజాశర్మ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధితో పాటు వ్యక్తిగత అభివృద్ధిపై దృష్టి సారించాలని కోరారు. ఎమ్మెల్సీ ఫారూఖ్‌హుస్సేన్ మాట్లాడుతూ అంకాపూర్ చికెన్ అంటే పేరు గడించిందన్నారు. హరీశ్ ఆలోచనతో మటన్ అంటే ఇర్కోడ్ ప్రపంచానికి తెలుస్తుందన్నారు. సమావేశంలో సెర్ప్ డైరెక్టర్ అనంతం, కేంద్ర మాంస పరిశోధన సీనియర్ శాస్త్రవేత్త బస్వారెడ్డి, మన్సిపల్ చైర్మెన్ రాజనర్సు, సుడా చైర్మన్ రవీందర్ రెడ్డి,డీపీఓ సురేశ్‌బాబు, టీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వేలేటి రాధాకృష్ణశర్మ తదితరులు మాట్లాడారు. ఈ సమావేశంలో ప్రజాప్రతినిధులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# కోడ్' అమలు అతిపెద్ద విజయం

కోల్‌కతా, ఆగస్టు 12: దేశంలో ఎన్నికల షెడ్యూలు ప్రకటించిన వెంటనే అమల్లోకి వచ్చే 'నియమావళి' విజయవంతం కావడాన్ని 'అతి పెద్ద విజయం'గా ప్రధాన ఎన్నికల కమిషనర్ సునీల్ అరోరా అభివర్ణించారు. దేశ రాజకీయ వ్యవస్థలో అన్ని రాజకీయ పార్టీలూ ఏకాభిప్రాయంతో ఆమోదించి, అనుసరించే ఏకైక విధానం 'నియమావళి' అని పేర్కొన్నారు. కోల్‌కతా ఐఐఎంలో ఆదివారం జరిగిన వార్షికోత్సవ సమావేశంలో సీఈసీ ప్రసంగించారు. రాజకీయ పార్టీలు, ఎన్నికల కమిషన్ ఎన్నో సంవత్సరాలుగా 'నియమావళి'ని అనుసరిస్తూ వస్తున్నారని ఈ సందర్భంగా అరోరా పేర్కొన్నారు. కేవలం ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసిన వెంటనే అన్ని పార్టీలూ ఏకాభిప్రాయంతో అమలు చేయడానికి ముందుకొచ్చే అంశాల్లో ఒకటైన ఎన్నికల నియమావళిని 'అతిపెద్ద విజయం' అని తాను భావిస్తానని అరోరా అన్నారు. భారత ఎన్నికల సంఘం, రాజకీయ పార్టీలూ స్వచ్ఛందంగా అమలు చేసే అంశమే నియమావళి అన్నారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా కోల్‌కతా వచ్చిన సీఈసీ అరోరా.. యావత్ ఎన్నికల ప్రక్రియలో చేయాల్సినవి.. చేయకూడనివి తెలియజేసే ఏకైక విధానమే 'నియమావళి' అని స్పష్టం చేశారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసినప్పటి నుంచి ప్రక్రియ పూర్తయ్యే వరకు రాజకీయ పార్టీలు, ఏజెంట్లు కచ్చితంగా అనుసరించే విధానం నియమావళి అని పేర్కొన్నారు.

ఎన్నికలు సేచ్ఛగా, సక్రమంగా జరిగేందుకు 'నియమావళి' దోహదపడుతోందని సీఈసీ స్పష్టం చేశారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల నేపథ్యంలో అభివృద్ధి పనులు ఆగిపోతాయన్న విమర్శకుల ప్రకటనలు సరి కాదని ఆయన పేర్కొన్నారు. నడుస్తున్న అభివృద్ధి పనులకు ఎన్నికల షెడ్యూ లు ఎలాంటి అడ్డంకి కాదనీ, మా పర్యవేక్షణలో అన్నీ జరుగుతాయని అరోరా స్పష్టం చేశారు.

ఏపీ వార్తలు

# రమణదీక్షితుల ప్రశ్నలకు సమాధానం దక్కేనా?

## భక్తకోటికి ఎప్పటికైనా సమాధానం చెప్పుకోవాల్సిందే

తిరుమల,ఆగస్ట్12(ఆర్ఎన్ఎ): తిరుమలకు సంబంధించిన విషయాలను మాజీ ప్రధాన అర్చకులు రమణదీక్షితులు లేవనెత్తిన అంశాలను రాజకీయంగా వాడుకోవడం ద్వారా సమస్యను గత టిడిపి ప్రభుత్వం తప్పుదోవ పట్టేంచింది. ఇప్పుడు రమణదీక్షితులతో పాటు ఆలయాల్లో ఉన్న సమస్యలపై జగన్ సర్కార్ దృష్టి పెట్టాలి. తిరుమల సమస్యలపై చర్చించకుండా కేవలం తనను అప్రదిష్ట పాలు చేయడానికి రమణదీక్షితులు పనిచేసారని అప్పట్లో చంద్రబాబు వ్యాఖ్యలు చేశారు. ఇదో రకంగా స్వామి భక్తులను అవమానించడం తప్ప మరోటి కాదు. సమస్యను లేవనెత్తితే చర్చించే ధైర్యం చేయలేకపోయారు. దీక్షితులు వెనక ఎవరో ఉండి తనను రాజకీయంగా దెబ్బతీస్తున్నారని చెప్పి నిజాలు బయటకురాకుండా చేశారు. ప్రపంచ ప్రఖ్యాత అధ్యాత్మిక క్షేత్రమైన తిరుమల, తిరుపతి దేవస్థానం (టిటిడి) స్వార్థపూరిత రాజకీయాలకు రణక్షేత్రంగా మారడం అవాంఛనీయం. బాబు హయాంలో టిటిడి ఛైర్మన్‌గా సుధాకర్ యాదవ్‌నియామకంతో అది పారకాష్టకు చేరింది. తిరుమల ఆలయ ప్రధాన అర్చకులుగా వ్యవహరించిన రమణదీక్షితులు టిటిడికి సంబంధించి కొన్ని ముఖ్యమైన ప్రశ్నలు లేవనెత్తారు. విమర్శలనూ సంధించారు. తిరుమలలో అవినీతి కైంకర్యాలు, అప్పనంగా దోచుకునే అభరాణాల అమ్యామ్యాలపై ఆయన సంధించిన ప్రశ్నలకు సమాధానమివ్వాల్సిన ప్రభుత్వం ఆ పని చేయకపోగా ఎదురుదాడికి దిగింది. పదవీవిరమణ నిబంధనను తెరపైకి తీసుకొచ్చి దీక్షితులపై వేటు వేసి, ఆరోపణలపై వివరణ ఇవ్వాలంటూ నోటీసులు పంపించారు. సమస్యను పట్టించకోకుండా పక్కదారి పట్టించే ప్రయత్నాలు చేశారు. ఇదంతా బిజెపి చేస్తున్న కుట్రగా అభివర్ణిచి మరింత రాజకీయ ప్ర యోజనం పొందాలని బాబు యత్నించినా ఫలించలేదు. ప్రజాసే వయే పంమావధిగా ఏర్పాటైన టిటిడి పాలక మండలి తర్వాత తర్వాత కాలంలో రాజకీయ నాయకులకు అధ్యాత్మిక విడిదిగా మారిపోయింది. భక్తులు సమర్పించిన కానుకలతో సొంత సేవలు చేసుకుంటున్నారు. ధార్మిక కార్యక్రమాలను పక్కన పెట్టారు. అన్యమత ప్రచారాలు జరుగుతున్నా తేలికగా తీసుకున్నారు. గతంలో తిరుమల సంపదతో పేదలకు అత్యాధునిక వైద్య సేవలు, ఉన్నత విద్యాస ముపార్జన చేసేందుకు వీలుగా విద్యా సంస్థలు నెలకొల్పి మానవ సేవే ప్రధానమని చాటారు. జంతు సంపదను, వృక్ష సంపదను పరిరక్షించేందుకు చర్యలు చేపట్టి పర్యావరణహితానికీ కృషి సల్పారు. అలాంటి విశిష్టత ఉన్న తిరుమల, తిరుపతి దేవాలయాలు ఇప్పుడు రాజకీయ నేతల స్వార్థ ప్రయోజనాలకు వేదికగా మారిపోవడం దురదృష్టకరం. గతంలో అర్చకులు, సిబ్బంది సంక్షేమం కోసమ ంటూ ఏర్పాటు చేసిన ధార్మిక పరిషత్‌ను తర్వాత కాలంలో ఎత్తివేశారు. కోటానకోట్ల సంపదపైనా, బంగారు, వజ్ర తదితర ఆభరణాల నిర్వహణపైనా ప్రభుత్వ జవాబుదారీతనం, పారదర్శకతపై ఎలాంటి చర్యలు తసీఉకున్నారో భక్తకోటికి తెలియచేయాలి. దీనిని పక్కన పెట్టి తన ప్రభుత్వాన్ని అప్రతిష్ట పాలు చేసే ప్రయత్నాలు జరుగుతు న్నాయని, అందులో రమణదీక్షితులు ఎపిసోడ్ కూడా ఉందని చంద్రబాబు చెప్పడం ప్రజలను అవమానించడం తప్ప మరోటి కాదు.

# వైసీపీ నేతల అక్రమాలు అడ్డుకోండి

### – సీఎం జగన్‌కు కన్నాలక్ష్మీనారాయణ లేఖ

అమరావతి, ఆగస్టు12(ఆంఎన్ఎ) : ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం కారుమంచి గ్రామంలో వైసీపీ నేతలు అక్రమాలకు పాల్పడుతున్నారని, వారి అక్రమాలకు అడ్డుకటవేయాలని ఏపీ సీఎం, వైసీపీ అధినేత వై.ఎస్ జగన్‌ను బీజేపీ ఏపీ అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన జగన్‌కు బహిరంగ లేఖను రాశారు. గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో వాటర్ ట్యాంక్ నిర్మాణానికి గ్రామస్థ నుంచి రూ.25లక్షలు వసూలు చేశారు. ఆ డబ్బుతో గ్రామంలోనే 24ఎకరాలు కొనుగోలు చేసి వాటర్ ట్యాంక్ నిర్మించి ఫెన్సింగ్ కూడా ఏర్పాటు చేశారు. అయితే ఆ స్థలంలో కొంత భాగాన్ని వైసీపీ నేతలు సిరివరపు విజయభాస్కర్‌రెడ్డి, సూరం రమణ కబ్జా చేసి ప్రైవేట్ వాటర్ ప్లాంట్ నిర్మిస్తున్నారని లేఖలో కన్నా పేర్కొన్నారు. మూడు వారాల క్రితం నిర్మాణ పనులు చేవడుతూ గ్రామస్థులను బెదిరిస్తున్నారని, దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి స్పందన లేకపోవడంతో ముఖ్యమంత్రి అయిన మీ దృష్టికి తీసుకొస్తున్నామని అన్నారు. లేఖతో పాటు అక్రమ నిర్మాణాల ఫోటోలను కూడా జతపరుస్తున్నామని, అక్రమ నిర్మాణాలను తొలగించేలా చర్యలు తీసుకుని కారుమంచి గ్రామస్థులకు న్యాయం చేయాలని కోరుతున్నామటూ కన్నా లక్ష్మీనారాయణ ముఖ్యమంత్రికి రాసిన లేఖలో పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వం, ముఖ్యమంత్రి జగన్‌పై ఇటీవల బీజేపీ నేతలు ఎదురుదాడి చేస్తున్న సంగతి తెలిసిందే. రాజన్న పేదోళ్ల ఆకలి నింపితే.. జగనన్న వారి కడుపులు కొడుతున్నారంటూ కన్నా లక్ష్మీనారాయణ ఇటీవల తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆయనతో పాటు పలువురు బీజేపీ నేతలు రాష్ట్ర ప్రభుత్వ పాలనపై మండిపడుతున్నారు. జగన్ అనాలోచిత నిర్ణయాలు తీసుకుంటూ ప్రజలను ఇబ్బంది పెడుతున్నారంటూ ఆరోపిస్తున్నారు.

# వైఎస్ జగన్ పాదయాత్రపై జయహో పుస్తకావిష్కరణ



అమరావతి, ఆగస్టు 12:చారిత్రాత్మక 'ప్రజాసంకల్పయాత్ర' పాదయాత్రపై రూపొందించిన జయహో పుస్తకాన్ని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్, ది ప్రింట్ ఎడిటర్ చీఫ్ పద్మభూషణ్ శేఖర్ గుప్తా చేతుల మీదుగా సోమవారం ఆవిష్కంచారు. సీనియర్ పాత్రికేయులు రామచంద్రమూర్తి ఆధ్వర్యంలో జయహో పుస్తకం సంకలనం చేయబడింది. ఈ పుస్తకాన్ని ప్రముఖ ఎమెస్కో సంస్థ ప్రచురించింది. 14 నెలల పాటు రాష్ట్రవ్యాప్తంగా వైఎస్ జగన్ చేపట్టిన పాదయాత్రలోని వివిధ చారిత్రాత్మక ఘట్టాలను దీనిలో పొందుపరిచారు. 3,648 కి.మీ సుధీర్ఘంగా సాగిన పాదయాత్రను ఫోటోలతో సహా పుస్తకాన్ని రూపకల్పన చేశారు. ఈ కార్యక్రమంలో సీఎం జగన్‌తో పాటు, శేఖర్‌గుప్తా, రామచంద్రమూర్తి, వైఎస్సార్‌సీపీ నేతలు, సీనియర్ పాత్రికేయులు పాల్గొన్నారు.

### ప్రజల నమ్మకాన్ని వమ్ముచేయం: సీఎం వైఎస్ జగన్

ప్రజాసంకల్ప పాదయాత్ర అనేది ఒక స్పిరిట్ అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. 3648 కి,మీ పాదయాత్ర చేయడమంటే సామాన్యమైన విషయం కాదని, ప్రజల సహకారంతోనే పూర్తి చేయగలిగానని అన్నారు. ఏకంగా 14 నెలల పాటు సాగిన ఈ ప్రయాణంలో ప్రతి పేదవాడిని కలిశానని, దాని ఫలితంగానే చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 50 శాతం ఓట్లు వైఎస్సార్‌సీపీకి వచ్చాయని సీఎం గుర్తుచేశారు. ప్రజలు తనపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ముచేయకుండా.. ప్రతీక్షణం ప్రజల కోసమే పనిచేస్తున్నామని స్పష్టం చేశారు. తన పాదయాత్రపై పుస్తకాన్ని రూపకల్పన చేసినందుకు సీఎం కృతజ్ఞతలు తెలిపారు.

### వైఎస్ జగన్ చరిత్ర సృష్టించారు..

పాదయాత్ర ద్వారా వైఎస్ జగన్ చరిత్ర సృష్టించారని ప్రముఖ జర్నలిస్ట్ శేఖర్ గుప్తా అన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ ఆశయాలను, వారసత్వాన్ని జగన్ ముందుకు తీసుకెళ్తున్నారని అన్నారు. వైఎస్సార్‌తో తనక ప్రత్యేకమైన అనుబంధం ఉన్నట్లు ఆయన గుర్తుచేశారు. దేశంలో జాతీయ పార్టీల కంటే ప్రాంతీయ పార్టీలే బలంగా ఉన్నాయన్నారు. వైఎస్ జగన్ నాయకత్వం రాష్ట్ర ప్రజలకు ఎంతో అవసరముందన్నారు. కార్యక్రమంలో రామచంద్రమూర్తి మాట్లాడుతూ.. తన నాలుగున్నర దశాబ్దాల పాత్రికేయ అనుభవంలో పాదయాత్రపై పుస్తకాన్ని రూపొందిచడం గొప్ప విషయమన్నారు.

# వైసీపీ ఎమ్మెల్సీ అభ్యర్థుల ఖరారు

### – మోపిదేవి, మహ్మద్ ఇక్బాల్, రామకృష్ణారెడ్డికి చోటు
### – అధికారికంగా ప్రకటించిన సీఎం వైఎస్ జగన్
### – మూడు స్థానాలకు ఆగష్టు 26న ఎన్నికలు





అమరావతి, ఆగస్టు12(ఆంఎన్ఎ) : ఏపీ ఎమ్మెల్సీ అభ్యర్థుల జాబితాను సోమవారం వైసీపీ అధినేత, సీఎం జగన్మోహన్‌రెడ్డి విడుదల చేశారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో మూడు ఎమ్మెల్సీ స్థానాలకు నోటిఫికేషన్ వెలువడిన సంగతి తెలిసిందే. ఆగష్టు 26న ఎన్నికలు నిర్వహించనుండగా.. బుధవారంతో నామినేషన్ల పక్రియ ముగియనుంది. సంఖ్యాబలం కారణంగా ఈ మూడు స్థానాలు వైఎస్ఆర్సీపీ ఖాతాలో చేరనున్నాయి. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీకి చెందిన కరణం బలరామ కృష్ణమూర్తి, వైఎన్ఆర్సీపీకి చెందిన ఆళ్ల శ్రీనివాన్ (నాని), కొలగట్ల వీరభద్ర స్వామి ఎమ్మెల్యేలుగా గెలుపొందటంతో ఈ మూడు ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ అయ్యాయి. వీరిలో ఆళ్ల నాని డిప్యూటీ సీఎంగా ఎన్నికయ్యారు. ఈ మూడు స్థానాలకు ఉపఎన్నిక నిర్వహించేందుకు ఈసీ నోటిఫికేషన్ జారీ చేసింది. నామినేషన్లకు తుది గడువు దగ్గర పడుతుండటంతో వైఎస్ఆర్సీపీ అభ్యర్థుల పేర్లను సీఎం జగన్ ఖరారు చేశారు. అందరూ ఊహించినట్టుగానే మంత్రి మోపిదేవి వెంకటరమణ, మైనార్టీ నాయకుడు మహ్మద్ ఇక్బాల్‌కు ఈ జాబితాలో చోటు దక్కింది. మూడో స్థానం కోసం కర్నూలు జిల్లా సీనియర్ నాయకుడు చల్లా రామకృష్ణారెడ్డి పేరును ఖరారు చేశారు. ఇక్బాల్ హిందూపురం నుంచి పోటీ చేసిన నందమూరి బాలకృష్ణ చేతిలో ఓడారు. మైనార్టీ కోటాలో ఆయన పేరు ఖరారు చేశారు. ఆది నుంచి తనతోపాటే ఉండి, కేసుల్లో జైలుకు వెళ్లిన మోపిదేవికి మంత్రి పదవి ఇచ్చిన జగన్.. ఇప్పుడు ఆయున్ను ఎమ్మెల్సీ చేస్తున్నారు. మూడో ఎమ్మెల్సీ స్థానాన్ని చిలకలూరిపేటకు చెందిన మర్రి రాజశేఖర్‌కు కేటాయిస్తారని భావించారు. బీసీ మహిళ అయిన విడదల రజినీకి ఎమ్మెల్యే టికెట్ ఇచ్చిన జగన్.. ప్రత్తిపాటి పుల్లారావును ఓడిస్తే మర్రి రాజశేఖర్‌ను మంత్రి చేస్తానని మాటిచ్చారు. కానీ మంత్రివర్గ జాబితాలో ఆయనకు చోటు దక్కలేదు. ఇప్పుడు ఎమ్మెల్సీ పదవి కూడా ఆయనకు లభించలేదు. ఆయనకు వేరే ఏదైనా పదవి ఇస్తారని భావిస్తున్నారు.

# ఖట్టర్ వ్యాఖ్యలు ఆయన స్థాయికి తగ్గట్లుగా లేవు

### చర్యలు తీసుకోవాలన్న రాహుల్

న్యూఢిల్లీ,ఆగస్ట్12(ఆర్ఎన్ఎ): జమ్మూకశ్మీర్ మహిళలపై హరియాణా ముఖ్యమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ చేసిన వ్యాఖ్యలు ఆయన స్థాయికి తగినవి కావని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ విమర్శించారు. ఖట్టర్ వ్యాఖ్యలపై శనివారం ఆయన ట్విటర్ ద్వారా స్పందించారు. ఈ సందర్భంగా ట్వీట్‌లో పేర్కొంటూ... ఈ వ్యాఖ్యల్ని చూస్తుంటే ఇన్ని సంవత్సరాలుగా ఆర్ఎస్ఎస్ శిక్షణ వారి మనసుల్ని ఎంత బలహీనంగా చేసిందో అర్థమవుతోందని అన్నారు. మహిళల్ని సొంతం చేసుకోవడానికి వారేమైనా ఆస్తులా అని ప్రశ్నించారు. అదేవిధంగా కాంగ్రెస్ మహిళా విభాగం నాయకురాలు సుష్మితా దేవ్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి అలాంటి వ్యాఖ్యలు చేయడం మంచిది కాదన్నారు. దీనిపై భాజపా అధినాయకత్వం చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. ఇదిలావుంటే హరియాణా సీఎం శుక్రవారం ఒక సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. అందులో భాగంగా జమ్మూకశ్మీర్ ఆర్టికల్ 370 రద్దుపై మాట్లాడటంతో పాటు కశ్మీర్ మహిళలపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఖట్టర్ చేసిన ఈ వ్యాఖ్యలు పెద్ద దుమారాన్నే రేపాయి.

జమ్మూకశ్మీర్‌లో ఎవరు శాశ్వత నివాసితులో తేల్చేందుకు తీసుకొచ్చిన ఆర్టికల్ 370ను కేంద్రం రద్దు చేసిన సంగతి తెలిసిందే. ఈ ఆర్టికల్ రద్దుతో కశ్మీరీ అమ్మాయిలను పెళ్లి చేసుకునేందుకు మార్గం సుగమమైందని ఖట్టర్ అన్నారు. బీహార్ నుంచి కోడళ్లను తెచ్చుకుంటామని మా కేబినెట్ మంత్రులు అంటుండేవారు. ఇప్పుడు ఆ సమస్య లేదు. ఇకపై కశ్మీర్ నుంచి కోడళ్లను తెచ్చుకోవచ్చు. ఆర్టికల్ 35ఏ రద్దుతో ఇది సాధ్యమైందన్నారు హర్యానా సీఎం తెలిపారు. కశ్మీర్ అమ్మాయిలను కోడళ్లు, భార్యగా చేసుకునేందుకు అందరూ మొగ్గుచూపుతారని మనోహర్‌లాల్ ఖట్టర్ పేర్కొన్నారు. భేటీ బచావో భేటీ పఢావో కార్యక్రమం తర్వాత హర్యానాలో లింగ నిష్పత్తిలో వ్యత్యాసం తగ్గిందన్నారు. ఒకప్పుడు 1000 మంది బాలురకు 850 మంది అమ్మాయిలు ఉండేవారు. భేటీ బచావో భేటీ పఢావో కార్యక్రమం విజయవంతమైన తర్వాత అమ్మాయిల సంఖ్య 933కు చేరిందని తెలిపారు. ఒక కశ్మీరీ మహిళ భారతదేశంలోని ఇతర రాష్ట్రంలోని ఒక వ్యక్తిని పెళ్లి చేసుకుంటే ఆ మహిళక కశ్మీరీ పౌరసత్వం కోల్పోయేది. కానీ ఆర్టికల్ 370 రద్దుతో కశ్మీరి మహిళ ఆ పౌరసత్వాన్ని కోల్పోదు.

## తెలంగాణకు మొండిచేయి చూపుతున్న కేంద్రం: నామా

ఖమ్మం,ఆగస్ట్12(ఆర్ఎన్ఎ): కేంద్రం మాటలు చెబుతోంది కానీ ఆదుకోవడంలేదని టీఆర్ఎస్ ఎంపీ నామా నాగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు.

తెలంగాణకు ఏ సాయం చేయడం లేదని నామా నాగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం ఏ ఒక్క తెలంగాణ ప్రాజెక్టుకు నిధులు ఇవ్వలేదన్నారు. కీలక బిల్లుల విషయంలో కేంద్రానికి అండగా నిలిచామని చెప్పారు. కాళేశ్వరానికి జాతీయహోదా, బయ్యారం స్టీల్‌ప్లాంట్, మైనింగ్ వర్సిటీ, రైల్వేలైన్లు, మిషన్ భగీరథకు నిధులు ఇవ్వాలని కేంద్రాన్ని కోరామని పేర్కొన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రెండు మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేయాలన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించాలని కేంద్రం పెద్దలను ఆహ్వానించామని ఎంపీ నామా తెలిపారు.

## ఎట్టకేలకు ద్యుతిచంద్‌కు వీసా

### మార్గం సుగమం చేసిన కేంద్రమంత్రి కిరణ్ రిజిజు

న్యూఢిల్లీ,ఆగస్ట్12 (ఆర్ఎన్ఎ): త్వరలో యూరప్‌లో జరగనున్న ప్రపంచ అథ్లెటిక్ ఛాంపియన్‌లో పాల్గొనటానికి యూరప్ వెళ్లేందుకు ద్యుతీచంద్‌కు మార్గం సుగమమైంది. గతంలో యూరప్‌వీసా కోసం ఆమె ప్రయత్నించగా అందులో విఫలమైంది. దీంతో ద్యుతీ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనడంపై సందిగ్ధత ఏర్పడింది. జపాన్ రాజధాని టోక్యోలో 2020లో జరగనున్న ఒలింపిక్స్‌కు అర్హత సాధించాలంటే ఈ పోటీలలో పాల్గొనడం తప్పనిసరి. ఈ విషయమై ఆమె కేంద్ర క్రీడల శాఖామంత్రి కిరణ్‌రిజుజును సంప్రదించింది. ఆయన ప్రత్యేక చొరవతీసుకుని ఆమెకు వీసా లభించేలా చేశారు. ఈ సందర్భంగా ద్యుతీచంద్ మాట్లాడుతూ 'కష్టకాలంలో నాకు వెన్నదన్నుగా నిలిచి, సమస్యను పరిష్కరించేవారి మధ్య ఉన్నందుకు గర్వంగా భావిస్తున్నానని తెలిపింది. ప్రత్యేక చొరవ తీసుకుని నాకు వీసా లభించేలా చేసిన భారత క్రీడాసమాఖ్యకు, డా. జయశంకర్‌కు, ఒడిశా క్రీడా సంఘానికి, కేంద్ర క్రీడాశాఖమంత్రి కిరణ్‌రిజుజుకు ప్రత్యేక కృతజ్ఞతలంటూ ట్విట్టర్‌లో పేర్కొంది. త్వరలో జరగనున్న ఈ భారీ ఈవెంట్‌లో సత్తా చాటేందుకు తాను సిద్ధంగా ఉన్నానని, అందుకు ఎంతో శ్రమిస్తున్నానని వెల్లడించారు.

# పసుపు రైతులతో కేంద్ర,రాష్ట్ర వ్యవసాయాధికారుల భేటీ

### సమస్యలపై రైతులతో చర్చ
### మద్దతు ధరలతో పాటు, బోర్డు ఏర్పాటు చేయాలని వినతి

నిజామాబాద్,ఆగస్ట్12(ఆర్ఎన్ఎ): రైతులు పండించిన పసుపు పంటకు తగిన ధర ఇచ్చేలా కృషి చేయడమే లక్ష్యమని కేంద్ర అగ్రికల్చర్ కమిషనర్ డి.ఎస్.ఎన్ మూర్తి అన్నారు. శనివారం నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని పసుపు పరిశోధన కేంద్రంలో ఆయన పసుపు రైతులతో సమావేశం అయ్యారు. పసుపు రైతులతో కేంద్ర, రాష్ట్ర ఉద్యానశాఖ కమిషనర్లు భేటీ అయ్యారు. మూడు జిల్లాల నుంచి 30 మంది రైతులు హాజరయ్యారు. పసుపు పంటకు మద్దతు ధర పెంచేందుకు చేపట్టాల్సిన చర్యలపై అధికారులు చర్చించారు. రైతుల అభిప్రాయాలు తీసుకుని కేంద్రానికి నివేదిక సమర్పించనున్నారు.

పసుపు రైతులు ఎం కొరుకుంటున్నారు, వారి అభిప్రాయాలు ఏమిటి అనేది తెలుసుకొని కేంద్ర పభుత్వనికి నివేధించడనికి ఈ సమావేశాన్ని తెలంగాణ రాష్ట్ర అగ్రికల్చర్ కమిషనర్ వెంకట్రాంరెడ్డితో కలిసి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తమకు మద్దతు ధర రూ.15 వేలు ఇస్తే సాగులో అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయని రైతులు కమిష్‌నర్లకు తెలిపారు. పసుపు సాగుకు ఎకరానికి రూ. లక్ష 20 వేల నుండి రూ. లక్ష 50 వేల వరకు పెట్టుబడి అవుతుంటే పంటలకు తగిన ధర రాక రూ.30వేల వరకు ఎకరాకు నష్టాలను చవి చూస్తున్నట్టుగా రైతులు వెల్లడించారు. ప్రాణం తీసే పోగాకుకు బోర్డు ఉన్నప్పుడు, ప్రాణం పోసే పసుపునకు బోర్డు ఎందుకు ఏర్పాటు చేయడం లేదని కేంద్ర కమిషనర్ ఎదుట రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పసుపు బోర్డు లేకున్నా సరే మద్దతు ధర ఇస్తే చాలని కొందరు రైతులు స్పష్టం చేశారు. లోక్‌సభ ఎన్నికల సమయంలో పసుపు రైతుల ఉద్యమానికి నాయకత్వం వహించిన అన్వేష్‌రెడ్డి, మునిపల్లి సాయిరెడ్డి ఈ సమావేశంలో పాల్గొని మట్లాడారు. మద్దతు ధరతో పాటు పసుపు బోర్డు తప్పని సరిగా కావాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కమిషనర్ వెంకట్రాంరెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రలో సాగవుతున్న పసుపులో కేవలం ఎనిమిది శాతం మాత్రమే మన దగ్గర వినియోగమవుతోందన్నారు. వెల్లుల్లి, అల్లం, జిలకర్ర, మెంతులు, చింతపండు, ధనియాలు లాంటిని సాగు చేస్తే మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందన్నారు. అంతక ముందు పసుపు పరిశోధన కేంద్రంలో 30 ఎకరాల్లో వేసిన పంటలను కేంద్ర, రాష్ట్ర అగ్రికల్చర్ కమిషనర్లు డి.ఎస్.ఎన్ మూర్తి, వెంకట్రాంరెడ్డి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టి.ఎస్.హెచ్.డి.సి.ఐ.జి.ఎమ్‌లు బాబు, సుభాషిని, డి.డి.హెచ్ మదుసుధన్, జిల్లా అగ్రికల్చర్ అధికారి నర్సింగ్ దాస్, కమ్మర్‌పల్లి పసుపు పరిశోధన కేంద్రం సైంటిస్ట్ మహేందర్ రెడ్డి, హెచ్.వో.లు మహేష్, రోహిత్ పాల్గొన్నారు.

# వైభవంగా జలజాతర..పాల్గొన్న మంత్రులు

మంచిర్యాల,ఆగస్ట12(ఆర్ఎన్ఎ): ఎల్లంపల్లి ప్రాజెక్టు వద్ద ఏర్పాటు చేసిన కాళేశ్వరం-ఎల్లంపల్లి జలజాతర వైభవంగా జరిగింది. వేడుకలో భాగంగా.. మంత్రులు ఇంద్రకరణ్ రెడ్డి, కొప్పుల ఈశ్వర్ పాల్గొన్నారు. వేడుకలో భాగంగా గోదావరి నదికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వెంకటేష్ నేత, జడ్పీ చైర్ పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి, అసిఫాబాద్ జెడ్పి చైర్మన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యేలు దివాకర్ రావు, దుర్గం చిన్నయ్య, బాల్క సుమన్ , టీబీజీకేఎస్ అధ్యక్షుడు వెంకట్రావు, టీఆర్ఎస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. పూలతో గంగమ్మ తల్లికి వీరు పూజలు చేశారు.

# బురద ప్రవాహం నుంచి తప్పించుకున్న ఇద్దరు

### కేరళ వరదల్లో అరుదైన దృశ్యం

తిరువనంతపురం,ఆగస్ట్12(ఆర్‌ఎన్‌ఎ): కేరళలో వరదల వల్ల జనం ఎదుర్కొంటున్న ఇబ్బందులను కళ్లకు కట్టే దృశ్యం ఇప్పుడు వైరల్‌గా మారింది. మలప్పురం జిల్లాలోని ఓ ప్రాంతంలో ఉప్పెనలా తన్నుకొస్తున్న బురద నీటి నుంచి ఇద్దరు వ్యక్తులు త్రుటిలో తప్పించుకున్నాడు. ఈ దృశ్యం అక్కడే ఉన్న సీసీటీవీ కెమేరాలో రికార్డయింది. మహిళ, గొడుగు పట్టుకొని మరో యువకుడు నడుచుకుంటూ వస్తుండగా, ఈ ఘటన జరిగింది. ఇంతలో వరద నీటి శబ్దాన్ని గమనించిన యువకుడు అప్రమత్తమై.. మహిళతో సహా గోడ పక్కకు పరిగెత్తి వరద తీవ్రత నుంచి తప్పించుకోగలిగారు. బురద నీరు దూసుకొస్తున్న తీరు ఒళ్లు గగుర్పొడిచేలా ఉంది. రదల వల్ల కేరళలో 40 మంది వరకూ ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. సుమారు లక్ష మంది నిరాశ్రయులయ్యారు. గత మూడు రోజుల్లో వయనాడ్, మలప్పురం జిల్లాల్లో రెండు కొండచరియలు విరిగిపడ్డ ఘటనలు చోటుచేసుకున్నాయి.




## 370 రద్దుపై కోర్టుకెక్కిన నేషనల్ కాన్ఫరెన్స్

న్యూఢిల్లీ,ఆగస్ట్12(ఆర్‌ఎన్‌ఎ): జమ్ముకశ్మీర్‌లో 370 అధికరణను రద్దు చేస్తూ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ జారీ చేసిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ ఆ రాష్ట్ర మాజీ సీఎం ఒమర్ అబ్దుల్లాకు చెందిన నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఆ ఉత్తర్వులు చెల్లుబాటు కాకుండా ఆదేశాలివ్వాలని కోరుతూ ఆ పార్టీ నేతలు మహ్మద్ అక్బర్ లోన్, హస్నేన్ మసూదీ నేడు సర్వోన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. అంతేగాక.. జమ్ముకశ్మీర్ రీ ఆర్గనైజేషన్ యాక్ట్ 2019 రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించాలని పిటిషనర్లు కోరారు. ఆర్టికల్ 370 రద్దును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో ఇదివరకే ఓ పిటిషన్ దాఖలైన విషయం తెలిసిందే. దానిపై అత్యవసర విచారణ జరపాలంటూ ప్రముఖ న్యాయవాది ఎంఎల్‌శర్మ పిటిషన్‌లో కోరారు. అయితే ఇందుకు జస్టిస్ ఎన్‌వీ రమణ నేతృత్వంలోని ధర్మాసనం నిరాకరించింది. ఈ పిటిషన్‌ను ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం తగిన సమయంలో విచారిస్తుందని జస్టిస్ రమణ స్పష్టం చేశారు. మరోవైపు ప్రత్యేక ప్రతిపత్తి తొలగింపు, రాష్ట్ర విభజన నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా విధించిన భద్రతాపరమైన ఆంక్షలను శుక్రవారం సడలించారు. అయితే మాజీ ముఖ్యమంత్రులు ఒమర్ అబ్దుల్లా, మెహబూబా ముఫ్తీ సహా పలువురు రాజకీయ నాయకులు మాత్రం ఇంకా గృహనిర్బంధంలోనే ఉన్నారు.

## ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ స్లమ్ దర్శన్

### స్థానికుల సమస్యలపై ఆరా

వరంగల్,ఆగస్ట్12 (ఆంర్‌ఎన్‌ఎ): గత కొన్ని రోజులు కురుస్తున్న వర్షాలకు వరంగల్ అర్బన్ జిల్లా హన్మకొండ కంచంకుంటలో జలమయమై లోతట్టు ప్రాంతాలను 'స్లమ్ దర్శన్' పేరుతో ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ సందర్శించారు. స్థానికులతో మాట్లాడుతూ.. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యను తెలుసుకోవడానికే తాను వచ్చానని అన్నారు. స్థానికంగా ఉన్న సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే వినయ్ అధికారులను ఆదేశించారు. ఆ తర్వాత అనారోగ్యంతో బాధపడుతున్న రోగులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందించారు. అనంతరం వడ్డెపల్లి ప్రణయ్ పార్కు లో 5 లక్షల రూపాయలతో ఏర్పాటు చేసిన జిమ్ సెంటర్ ను ఎమ్మెల్యే వినయ్ ప్రారంభించారు.

## పంద్రాగస్టుకు ముస్తాబైన గోల్కొండ

హైదరాబాద్,ఆగస్ట్12 (ఆర్‌ఎన్‌ఎ): పంద్రాగస్టుకు గోల్కొండ కోట ముస్తాభైంది. అధికారులు భారీగా ఏర్పాట్లు చేశారు. ట్రాఫిక్, ఆర్‌అండ్‌బీ, జీహెచ్‌ఎంసీ, అగ్నిమాపక, కేంద్రపురావస్తు శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. కోటను అందంగా, ధగధగలాడేలా విద్యుత్ దీపాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే పోలీసులు గోల్కొండ కోటను తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఈ సారి కూడా రాణీమహల్ గార్డెన్‌లో జాతీయ పతాకావిష్కరణకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వారం రోజుల ముందునుంచే పోలీసులు రిహార్సల్స్ చేపట్టారు. పంద్రాగస్టు వేడుకలకు గోల్కొండ కోట పరిసర ప్రాంతాల్లో 8 కేంద్రాల్లో పార్కింగ్ సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు పోలీసులు చెబుతున్నారు. వీఐపీ, వీవీఐపీ, అధికారులు, అనాధికారులు, ప్రజల కోసం ఆయా ప్రాంతాల్లో పార్కింగ్ సౌకర్యం కల్పిస్తున్నారు. గోల్కొండ కోటలోని పరిసర ప్రాంతాల్లో పార్కింగ్ సౌకర్యం పై, సీఎం కాన్వాయ్ విచ్చేసే ప్రాంతాలను పోలీసులు ప్రత్యేకంగా పరిశీలించారు.

# అభివృద్ధిలో దూసుకెళ్తున్న తెలంగాణ

### -కెసిఆర్ సమర్థ నాయకత్వమే కారణం: ఎమ్మెల్యే

ఖమ్మం,ఆగస్ట్12(ఆర్‌ఎన్‌ఎ): దేశంలోనే కాక ప్రపంచంలోనే గుర్తింపు పొందేలా తెలంగాణలోఅనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతూ దూసుకెళ్తున్నామని, ఇందుకు కేసీఆర్ సమర్థ నాయకత్వమే కారణమని కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. దేశంలోఎక్కడా లేని విధంగా కోటి ఎకరాల మాగాణా చేయాలని సిఎం కెసిఆర్ భగీరథ యత్నం చేస్తున్నారని అన్నారు. అలాగే మంచినీటి కోసం మిషన్‌భగీరథతో ప్రతిఇంటికి నల్లానీరు ఇచ్చే కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామన్నారు. ఇందుకు ఖమ్మం జిల్లాలోనే రెండున్నరేళ్లలో 4వేల 166 కోట్ల రూపాయల పనులు జరుగుతున్నాయన్నారు. రెండు ప్రధానమైన ఇరిగేషన్ ప్రాజెక్టులు కూడా మంజూరు చేయడం జరిగిందన్నారు. అందులో ఒకటి భక్త రామదాసు ప్రాజెక్టు అని దీంతో 60వేల ఎకరాలకు సాగు నీరు అందుతుందన్నారు. దీనికి 600 కోట్లను వెచ్చిస్తున్నామన్నారు.

భక్తరామదాసు ప్రాజెక్టు ద్వారా పాలేరు నియోజకవర్గం శాశ్వతంగా కరువునుంచి బయట పడుతుందన్నారు. భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. అవసరమైనచోట్ల పైప్‌లైన్ల నిర్మాణం చేస్తామన్నారు. ఎస్‌ఎస్‌పి కాలువల లైనింగ్ పనుల నిర్మాణం ఆధునీకరణ పనులు కూడా రానున్న రెండున్నరేళ్లలో పూర్తి చేస్తామన్నారు.

మిషన్ కాకతీయ ద్వారా 4వేల 500 చెరువులను పూర్వవైభవం తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటే ఇప్పటికే 1800 చెరువులు పూర్తయ్యాయన్నారు. ఉమ్మడి ఖమ్మం

జిల్లాలో రెండవ అతిపెద్ద ప్రాజెక్టు అయిన సీతారామ ఎత్తిపోతల పథకాన్ని నిర్ణీత కాలంలో పూర్తి చేసిన ఘనత సీఎం కేసీఆర్÷-దని అన్నారు. అడిగిందే తడవుగా సీతారామ ప్రాజెక్టును మంజూరి చేసిన సీఎంకు జిల్లా ప్రజలకు ఎంతో రుణపడి ఉంటారన్నారు.

ఇకపోతే జాతీయరహదారి విస్తరణ పనులు త్వరితగతిన చేపట్టాలని ఎమ్మెల్యే అన్నారు. మున్నేరు వంతెన నుంచి రామవరం మీదుగా వెళ్లే జాతీయ రహదారి విస్తరణ పనులను చేపట్టాలన్నారు. పనుల్లో పురోగతి కన్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు స్థానికంగా ఉండాలన్నారు. అధికారులు అందుబాటులో ఉండి పనులను పర్యవేక్షించాలన్నారు.

అలాగే సాగునీటి పనులను వేగవంతం చేయాల్సిందిగా సూచించారు.

తాగునీటి సరఫరా కోసం కొనసాగుతున్న పనుల్లో రోజువారీ నివేదికలను అందించాలన్నారు. పైపులైన్లు ఏ రూట్లో వెళుతున్నాయో మ్యాపుల ద్వారా గుర్తించాలన్నారు. తాగునీటి సమస్యపై ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాల్సిన బాధ్యతను గుర్తించాలన్నారు. ప్రతి మండలంలో 500 మెట్రిక్ టన్నుల కెపాసిటీగల గోదాముల నిర్మాణం కూడా జరుగుతుందన్నారు. విద్యా వైద్య రంగాల్లో అభివృద్ధి కోసం 50 కోట్లు కేటాయించడం జరిగిందన్నారు.

# తెలంగాణలో టిడిపి ఖాళీ కాబోతోంది

### టిఆర్‌ఎస్ నేతలూ క్యూలో ఉన్నారన్న లక్ష్మణ్

### కెసిఆర్ అవినీతిపై కేంద్రానికి వివరించాం


### సెప్టెంబర్ 17న భారీగా విమోచన సభ: కిషన్ రెడ్డి

హైదరాబాద్,ఆగస్ట్12 (ఆర్‌ఎన్‌ఎ): తెలంగాణలో టీడీపీ ఖాళీ కాబోతోందని బిజెపి అధ్యక్షుడు లక్ష్మణ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. టీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తోన్న అంశాన్ని కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు వివరించామన్నారు. కశ్మీర్ సమస్యను పరిష్కరించినట్లే తెలంగాణ ఆత్మగౌరవాన్ని షా కాపాడుతారని ఆయన చెప్పుకొచ్చారు. కాంగ్రెస్‌కు భవిష్యత్ లేదు కాబట్టే ఆ పార్టీ నేతలు బీజేపీలో చేరుతున్నారని ఈ సందర్భంగా లక్ష్మణ్ తెలిపారు. సార్వత్రిక ఎన్నికల ఫలితాల తర్వాత బీజేపీ ఆపరేషన్ ఆకర్ష్‌కు తెరలేపిన విషయం విదితమే. ఇప్పటికే తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు సిట్టింగ్‌లు, మాజీలు కాషాయ కండువాలు కప్పేసుకుంటున్నారు. మరికొందరు నేతలు కూడా బీజేపీ తీర్థం పుచ్చుకుంటారని వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు లక్ష్మణ్ మీడియాతో మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సెప్టెంబర్ 17న తెలంగాణలో అమిత్ షా పర్యటిస్తారని లక్ష్మణ్ తెలిపారు. ఈ పర్యటనలో తన ఇంట్లో బీజేపీ క్రియాశీలక సభ్యత్వాన్ని షా తీసుకోనున్నారని ఆయన చెప్పారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డివి అన్నీ పగటి కలలేనని లక్ష్మణ్ విమర్శలు గుప్పించారు. టీఆర్‌ఎస్‌కు మేలు చేయడానికే కాంగ్రెస్ పనిచేస్తోందని.. తెలంగాణ ద్రోహుల పార్టీ మజ్లిస్‌తో ఆ పార్టీ అంటకాగుతోందని విమర్శించారు. హిందువులపై సీఎం కేసీఆర్, కేటీఆర్ పిచ్చిగా మాట్లాడుతున్నారన్నారు. అంతటితో ఆగని ఆయన.. అనేక మంది టీఆర్‌ఎస్ నేతలు బీజేపీలో చేరుతారని లక్ష్మణ్ చెప్పారు. టీఆర్‌ఎస్ కుటుంబపాలనను ఎదుర్కొనే దమ్ము బీజేపీకే ఉందని లక్ష్మణ్ చెప్పుకొచ్చారు. ఇదిలావుంటే సెప్టెంబర్ 17న తెలంగాణలో భారీ సభను ఏర్పాటు చేస్తామని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. విమోచన దినోత్సవ సభకు అమిత్‌షా వస్తారని చెప్పారు. మజ్లిస్ ఒత్తిడితోనే రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ విమోచన దినం నిర్వహించడం లేదన్నారు. తెలంగాణలో అధికారంలోకి రావటమే తమ లక్ష్యమని కిషన్‌రెడ్డి చెప్పారు. అయోధ్య విషయం కోర్టు పరిధిలో ఉందన్నారు. కశ్మీర్ విభజన విషయంలో మెజార్టీ ప్రజలు బీజేపీ వైపు ఉన్నారని వ్యాఖ్యానించారు. 370 రద్దును రాజకీయం చేయాలని కాంగ్రెస్ చూసిందన్నారు. కశ్మీర్ అభివృద్ధి బాట పడుతుందని కిషన్‌రెడ్డి చెప్పారు. ఇదిలా ఉంటే.. ఈ నెల 18న తెలంగాణలో బీజేపీ వర్కింగ్

ప్రెసిడెంట్ జేపీ నడ్డా పర్యటించనున్నారని.. హైదరాబాద్ ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో సభ ఏర్పాటు చేస్తున్నట్లు బీజేపీ నేతలు చెబుతున్నారు. ఈ సందర్భంగా జేపీ నడ్డా సమక్షంలో భారీ చేరికలు ఉంటాయని తెలంగాణ కమలనాథులు చెబుతున్నారు.

# మసీదుల్లో ప్రార్థనలకు అనుమతి

న్యూఢిల్లీ, ఆగస్టు 12: ఈద్-ఉల్-అజా సందర్భంగా సోమవారంనాడు కాశ్మీర్ వ్యాలీలోని వివిధ మసీదుల్లో ప్రార్థనలు చేసుకోవడానికి ముస్లింలకు అనుమతి ఇచ్చామని ప్రభుత్వ సీనియర్ అధికార వర్గాలు ఆదివారంనాడు ఇక్కడ తెలిపాయి. జమ్మూ-కాశ్మీర్‌లో ఆర్టికల్ 370ను కేంద్ర ప్రభుత్వం ఇటీవల రద్దు చేసిన నేపథ్యంలో అల్లర్లు, హింసాత్మక సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రభుత్వం ఈనెల 5న వివిధ అంశాల్లో ఆంక్షలు విధించిన విషయం తెలిసిందే. అందులో భాగంగా జమ్మూ-కాశ్మీర్‌లో మొబైల్ ఫోన్లు, ల్యాండ్‌లైన్ల ఫోన్లపై తాత్కాలింగా విధించిన ఆంక్షలను వీలైనంత తొందరలోనే ఎత్తివేస్తామని ఆ వర్గాలు స్పష్టం చేశాయి. జమ్మూ-కాశ్మీర్‌లో ప్రమాదాలు జరుగకుండా, అల్లర్లకు ఆస్కారం లేకుండా శాంతి నెలకొనేందుకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని ఆ వర్గాలు తెలిపాయి. రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులపై జిల్లా పాలనా యంత్రాంగం ఎప్పటికప్పుడు సమీక్షిస్తోందని, ఈ నేపథ్యంలో ఈద్ సందర్భంగా



మసీదుల్లో ప్రార్థనలు జరుపుకునేందుకు ప్రజలకు అవకాశం కల్పిస్తున్నామని ఆ వర్గాలు స్పష్టం చేశాయి. గత శుక్రవారంనాడు సమీపంలోని మసీదుల్లో ప్రార్థనలు చేయడానికి సైతం అనుమతించామని, అయితే, వ్యాలీలో ఎక్కువ సంఖ్యలో గుమికూడకూడదనే నిబంధన విధించామని తెలిపాయి. మొబైళ్లు, ల్యాండ్‌లైన్ ఫోన్లపై విధించిన నిబంధనలు కేవలం తాత్కాలికమేనని, తప్పుడు సమాచారం, పుకార్లు వ్యాపించకుండా శాంతి నెలకొనేందుకే తాము ఈ చర్యకు ఉపక్రమించామని ఆ వర్గాలు స్పష్టం చేశాయి. పరిస్థితులను చక్కదిద్దే క్రమంలో ప్రభుత్వం తీసుకున్న తాత్కాలిక చర్యలు, నిషేధాల వల్ల కొంతవరకు ఇబ్బంది కలిగినా అదంతా ప్రజల మేలు కోసమేనని తెలిపాయి. ప్రతిరోజూ ఏదో ఒక అంశంలో ఉన్న నిబంధనలను ఎత్తివేస్తున్నామని, అదేవిధంగా ఫోన్ల వినియోగంపై ఉన్న తాత్కాలిక ఆంక్షలను సైతం త్వరితగతిన ఎత్తేసేందుకు చర్యలు తీసుకుంటామని ఆ వర్గాలు పేర్కొన్నాయి.

# కులు మనాలిలో విషాదం

### హైదరాబాద్ వైద్యుడి మృతి

సిమ్లా,ఆగస్ట్12(ఆర్‌ఎన్‌ఎ): హిమాచల్‌ప్రదేశ్‌లోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన కులూమనాలిలో విషాదం చోటుచేసుకుంది. ఇటీవల విహార యాత్ర కోసం అక్కడికి వెళ్లిన హైదరాబాద్‌కు చెందిన వైద్యుడు చంద్రశేఖర్ రెడ్డి ప్రమాదంలో మృతిచెందారు. నాగోల్ మోహన్‌నగర్‌లో నివసించే చంద్రశేఖర్‌రెడ్డి విహార యాత్ర కోసం కులూమనాలి వెళ్లారు. పారాచ్యూట్ ద్వారా గాలిలోకి ఎగిరిన ఆయన ప్రమాదవశాత్తు కింద పడి తీవ్ర గాయాలపాలై ప్రాణాలు కోల్పోయారు. విషయం తెలుసుకున్న ఆయన కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఈ ఘటనతో మోహన్‌నగర్‌లో విషాద ఛాయలు అలముకున్నాయి.

ప్యారాచూట్ వైర్లు తెగిపోవడంతో డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి కిందపడి మృతిచెందారు. చంద్రశేఖర్ స్వస్థలం కర్నూలు జిల్లా నంద్యాల సమీపంలోని కొత్తపల్లె గ్రామం. కుటుంబంతో కలిసి కొంతకాలంగా హైదరాబాద్‌లోని నాగోల్‌లో నివాసం ఉంటున్నారు. ప్రస్తుతం చంద్రశేఖర్ శ్రీకర ఆస్పత్రిలో ఉద్యోగం చేస్తున్నాడు. చంద్రశేఖర్ పలు కార్పొరేట్ ఆసుపత్రుల్లో పనిచేసినట్లు ఆయన సన్నిహితులు చెబుతున్నారు. మీడియా ద్వారా సమాచారం అందుకున్న తోటి వైద్యులు చంద్రశేఖర్ మృతిపై దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. చంద్రశేఖర్‌తో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. చంద్రశేఖర్ మృతదేహాన్ని హైదరాబాద్ కు తీసుకువచ్చేందుకు కేంద్రసహాయ మంత్రి కిషన్‌రెడ్డి కలిసేందుకు కుటుంబసభ్యులు వెళ్లినట్లు సమాచారం. చంద్రశేఖర్ బుధవారం రాత్రి స్నేహితులతో కలిసి కులుమనాలి వెళ్లారు. చంద్రశేఖర్ మృతితో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరు అవుతున్నారు. ఆయన స్వగ్రామైన కొత్తపల్లె విషాదఛాయలు అలముకున్నాయి.

### వెంకయ్య సమర్థతను ఆవిష్కరించిన

# 'లిజనింగ్, లెర్నింగ్, లీడింగ్'

## నిబద్ధ రాజకీయాలకు ఆయన పెట్టింది పేరు


## రాజ్యసభ ఛైర్మన్‌గా బాధ్యతాయుతంగా సభ నిర్వహణ

చెన్నై,ఆగస్ట్12(ఆర్‌ఎన్‌ఎ): విలువలు కలిగిన రాజకీయాలు అనుసరించిన ప్రస్తుత ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, రెండేళ్లుగా రాజ్యసభలో ప్రత్యేకశైలితో సభాకార్యక్రమాలు జరిగేలా చేస్తున్న ప్రయత్నాలు ఆయన దార్శనికతకు అద్దం పడుతున్నాయి. ఆర్టికల్ 370 రద్దు సమయంలో సభాధ్యక్షుడిగా ఆయన వ్యవహరించిన తీరు సర్వత్రా హర్షం వ్యక్తం అయ్యింది. ఆదివారం చెన్నైలోని కలైవానర్ అరంగంలో 'లిజనింగ్, లెర్నింగ్, లీడింగ్' అనే పుస్తకాన్ని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆవిష్కరించారు. ఉపరాష్ట్రపతిగా వెంకయ్యనాయుడు రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కార్యక్రమానికి కేంద్రమంత్రి ప్రకాశ్ జావడేకర్ అధ్యక్షత వహించారు. రజనీకాంత్‌తో పాటు, తమిళనాడు సిఎం పళనిస్వామి తదితరులు పాల్గొన్నారు. తాను క్రియాశీల రాజకీయాలకు దూరమయ్యానేగానీ.. ప్రజాజీవితం నుంచి విశ్రాంతి తీసుకోలేదని ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఈ సందర్భంగా పేర్కొన్నారు. దేశమంటే కేవలం భౌగోళిక చిత్రం కాదని, అది కోట్ల మంది సమ్మిళిత అభివృద్ధి ముఖచిత్రం కావాలని ఆకాంక్షించారు. ప్రజాజీవితంలోకి వచ్చిన నాటి నుంచి వారికి మరింత దగ్గరగా ఉన్నానని తెలిపారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో సాగుతున్న తన పర్యటనలను విజ్ఞాన సముపార్జన యాత్రలుగా ఆయన అభివర్ణించారు. 2020 తర్వాత నానాజీ దేశ్‌ముఖ్ బాటలో సామాజిక సేవలో గడుపుదామ నుకుంటున్నానని, ఈ విషయాన్ని ప్రధాని మోదీకి చాలాసార్లు వివరించానని చెప్పారు. దేశంలో సుప్రీంకోర్టు 4 బెంచ్‌లు ఏర్పాటు చేయాలని, ప్రయోగాత్మకంగా అదనపు బెంచ్‌ను చెన్నైలో ఏర్పాటు చేయాలని సూచించారు. జమ్మూ-కశ్మీర్‌లో ఆర్టికల్ 370ని రద్దు చేయడం ఆవశ్యకమని చెప్పారు. బలవంతంగా ఏభాషనూ ఇతరులపై రుద్దడం, ఏ భాషనూ వ్యతిరేకించడం తగదని చెప్పారు. ఈ పుస్తకం కేవలం వెంకయ్య నాయుడు రెండేళ్ల ప్రస్థానానికి సంబంధించిన అంశాల సమాహారం మాత్రమే కాదని, జీవితంలో ఒక మనిషి ఎలా నడుచుకోవాలో తెలిపేదని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా చెప్పారు. ఆర్టికల్ 370 రద్దుపై వెంకయ్య నాయుడు ఏబీవీపీలో ఉన్నప్పుడే పోరాడారని గుర్తుచేశారు. ఈ బిల్లు రాజ్యసభకు వెళ్లిన సమయంలో ఆమోదం పొందుతుందా? లేదా? అనే సందేహం తనకు ఉండేదని, అందుకే మొదట బిల్లును రాజ్యసభలో, తర్వాత లోక్‌సభలో ఆమోదించాలనుకున్నామని పేర్కొన్నారు. రాజ్యసభలో వెంకయ్య నాయుడు అద్భుతంగా వ్యవహరించి బిల్లు ఆమోదం పొందేలా సభను నడిపారని కితాబిచ్చారు. ఆర్టికల్ 370వల్ల భారత్‌కుగానీ, కశ్మీరుకుగానీ ఎలాంటి ప్రయోజనం లేదని అందుకే రద్దు చేశామని పేర్కొన్నారు. రాజకీయ విలువల గురించి మాట్లాడడం వేరు...వాటిని ఆచరించడం వేరు. రాజకీయాల్లో విలువల గురించి మాట్లాడుతూ వాటిని ఆచరించి చూపుతున్న అరుదైన వ్యక్తిత్వం వెంకయ్యనాయుడిది. పార్లమెంటులో సమస్యలపై అర్థవంతమైన చర్చ జరగాలని, ప్రజల గొంతుక వినిపించాలని వెంకయ్య సభ్యులకు పదేపదే సూచిస్తూ సభను నడుపుతున్నారు. తన సూచన రానున్న కాలంలో మార్పునకు నాంది కావాలి. పార్లమెంట్ అనగానే గొడవలు, వాకౌట్లు, వాయిదాలు అన్నరీతిగా సాగుతోంది. ఇలాంటి పరిస్థితులు పోవాలని వెంకయ్య నాయుడు అభిలషిస్తున్నారు. వెంకయ్య నాయుడు భారత 15వ ఉప రాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టాక రాజ్య సభలో చేసిన తొలిపలుకులు ఎంతో విలువైనవి. ఎంతో ఉన్నతమైనవి. సభ్యుల బాధ్యతలను గుర్తు చేసేవిగా ఉన్నాయి. మనం ఏం చేస్తున్నామో..ఏం చేయకూడదో సుతిమెత్తగా చెప్పినవి. అంతేగాకుండా తాను రైతు బిడ్డనని, ఇలా చెప్పుకోవడానికి గర్విస్తానని చెప్పడం ద్వారా దేశంలోని రైతాంగానికి ప్రతినిధిగా మాట్లాడారు. అందుకే ఆయన చమత్కారంగా అయినా ఓ మంచిమాట చెప్పారు. అవర్ కల్చర్ ఈజ్ అగ్రికల్చర్ అన్నారు. ఈ ఒక్కమాట చాలు రైతులకు మనం అండగా ఉండాలని, మనమంతా వారి వారసులమని చెప్పకనే చెప్పారు.

### ట్రబుల్ షూటర్ వెంకయ్య

సర్వేపల్లి రాధాకృష్ణన్ తర్వాత ఉపరాష్ట్రపతిగా తెలుగువాడు, మేధావి అయిన వ్యక్తి ఈ పదవికి ఎంపిక కావడం దేశానికి గర్వకారణంగా భావించాలి. వెంకయ్య మూర్తీభవించిన తెలుగువాడే అయినా భారతీయత ఆయన అంతరాత్మ. వెంకయ్య నాయుడు అంటే అందరికీ ఇష్టమే. అయన ట్రబుల్ షూటర్. అందుకే రాజ్యసభలో 370 ఆర్టికల్ రద్దు సందర్భంగా ఎలాంటి గొడవ లేకుండా సాఫీగా చర్చ సాగి, అది రద్దు అయ్యేలా బిల్లును చేపట్టారు. ఇంతటి సమున్నతుడు గనకనే సభ్యుల బాధ్యతలను గుర్తు చేస్తూ ముందుకుసాగాలని చెప్పగలిగారు. పార్లమెంటు నడుస్తున్న తీరును ప్రత్యక్ష ప్రసారాల ద్వారా చూస్తున్న సామాన్యుడు కొంత అసంతృప్తికి గురవుతున్నాడని నిర్మొహమాటంగానే అంటున్నారు. వారి భావాలను అర్థం చేసుకొని మసలుకోవాలని ఎంపీలకు సూచించారు. అద్భుతమైన మన పార్లమెంటరీ ప్రజాస్వామ్యం వైపు ప్రపంచదేశాలు కూడా చూస్తున్నాయన్న విషయాన్ని గుర్తుపెట్టుకొని పనిచేయాలని హితవు చెబుతుంటారు. మనకు మున్ముందు ఉజ్వల భవిష్యత్తు ఉంది. స్వాతంత్ర్యం వచ్చిన 70 ఏళ్ల తర్వాత కూడా మనం ఇంకా పేదరికం, నిరక్షరాస్యత, అసమానతలు, వ్యవసాయ సమస్యలు, అధికార దుర్వినియోగం, ప్రాంతీయ, ఆర్థిక అసమానతలను ఎదుర్కొంటున్నాం. మనతోపాటు స్వాతంత్రం పొందిన కొన్ని దేశాలు స్పష్టమైన దృక్పథంతో ముందుకెళ్తున్నాయి. వీటిని దృష్టిలో ఉంచుకొని మనం కలిసి పనిచేసి దేశాన్ని ముందుకు తీసుకెళ్లాలని ఆయన పదేపదే సూచిస్తుంటారరు. అధికారపక్షం చేతిలో అధికారం ఉంటుంది. ప్రతిపక్షానికి చెప్పే అవకాశం ఉంటుంది. మనమంతా ప్రజా తీర్పును గౌరవించాలి. ప్రజా స్వామ్యం అంటే కేవలం సంఖ్యే కాదు. పరస్పరం అభిప్రాయాలను అర్థం చేసుకోవడానికి ప్రయత్నించడం ముఖ్యం అని సభ్యులకు గుర్తుచేస్తుంటారు.

# బీజేపీలో చేరిన పోగట్ ఫ్యామిలీ



హైదరాబాద్, ఆగష్టు 12: ఈ ఏడాది చివరిలో హర్యానాలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఇవాళ మేటి రెజ్లర్లు.. బీజేపీ పార్టీలో చేరారు. కామన్‌వెల్త్ చాంపియన్ బబితా ఫోగట్‌తో పాటు ఆమె తండ్రి మహావీర్ పోగట్‌లు కేంద్ర క్రీడాశాఖ మంత్రి కిరణ్ రిజుజు సమక్షంలో పార్టీలో చేరారు. ఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. మరో రెండు నెలల్లో హర్యానాలో ఎన్నికల జరగనున్న తరుణంలో ఫోగట్ ఫ్యామిలీ బీజేపీలో చేరడం ఆ పార్టీకి కలిసి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. మోదీ చేపట్టిన విధానాలు, స్కీమ్‌లు తమను ఆకట్టుకున్నట్లు మహావీర్ పోగట్ చెప్పారు. అయితే ఆ రాష్ట్ర సీఎం మనోహర్ లాల్ ఖట్టార్.. కశ్మీర్ అమ్మాయిలపై చేసిన కామెంట్లను బబితా పోగట్ స్వాగతించింది. సీఎం ఖట్టార్ ఎటువంటి అనుచిత వ్యాఖ్యలు చేయలేదని అర్జున అవార్డ్ గ్రహిత బబితా తెలిపింది. 2016లో రిలీజైన దంగల్ సినిమా తర్వాత పోగట్ ఫ్యామిలీ మరింత పాపులర్ అయ్యింది.

# బీజేపీలోకి ప్రముఖ క్రీడాకారిణి!

న్యూఢిల్లీ, ఆగష్టు 12: ప్రముఖ రెజ్లర్ బబితా ఫోగాట్, ఆమె తండ్రి మహావీర్ సింగ్ ఫోగాట్ సోమవారం బీజేపీలో చేరారు. కేంద్ర క్రీడల మంత్రి కిరెన్ రిజిజు సమక్షంలో ఢిల్లీలో పార్టీ కేంద్ర కార్యాలయంలో వారు కాషాయం కండువా కప్పుకున్నారు. ఈ ఏడాది చివర్లో హరియాణా అసెంబ్లీ ఎన్నికల జరగనున్న నేపథ్యంలో ఆ రాష్ట్రానికి చెందిన ప్రముఖ క్రీడాకారులైన బబిత, మహావీర్ బీజేపీ గూటికి చేరారు.

ఆర్టికల్ 370 రద్దు నేపథ్యంలో కశ్మీర్ నుంచి అందమైన వధువులను తెచ్చుకోవచ్చంటూ హరియాణా సీఎం మనోహర్ లాల్ ఖట్టర్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలను బబితా రెండో రోజుల కిందట సమర్థించిన సంగతి తెలిసిందే. అంతేకాకుండా ఆర్టికల్ 370 రద్దును సమర్థిస్తూ ఆమె గత కొన్ని రోజులుగా వ్యాఖ్యలు చేస్తున్నారు. 'దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరుణాన్ని చూసే అదృష్టం నాకు లేకపోయింది. కానీ, ఆర్టికల్ 370, 35ఏల రద్దుతో కశ్మీర్ స్వాతంత్ర్యం పొందడాన్ని చూసే అదృష్టం దక్కినందుకు ఆనందంగా ఉంది' అని బబిత ట్వీట్ చేశారు. అయితే, క్రీడాకారులకు హరియాణా బీజేపీ సర్కారు అందించే నగదు ప్రోత్సాహకాలు సరిగ్గా లేవంటూ ఆమె గతంలో పలుసార్లు విమర్శలు చేశారు. 2014, 2018 కామన్‌వెల్త్ గేమ్స్ గోల్డ్ మెడలిస్ట్ అయిన బబిత ప్రస్తుతం 'నాచ్ బలియే' డ్యాన్స్ షోలో పాల్గొంటున్నారు.

### ప్రజల భాగస్వామ్యంతోనే పరిసరాల పరిశుభ్రత

వరంగల్,ఆగస్ట్12 (ఆంఎన్‌ఎ): పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడంలో ప్రజలు ఆదర్శం గా ఉండాలని వరంగల్ మున్సిపల్ అధికారులు అన్నారు. ప్రజలు ఎవరికి వారు తమ వీధుల్లో చెత్తా చెదారం వేయకుండా చూసుకుంటే పట్టణం క్లీన్‌గా ఉంటుందని అభిప్రాయపడ్డారు. ప్రజలంతా చెత్తవేసతూ పోతే వేలమందిని పెట్టినా క్లీన్ చేయలేమన్నారు. ఇది గమనించి చెత్తను బుట్టల్లో వేసి స్వచ్ఛతను చాటాలన్నారు. అలాగే పన్నుల చెల్లింపులో కూడా ముందుకు వస్తే పౌరసేవలను విస్తృతం చేయగలమని అన్నారు. ప్రజలనుంచి కార్పోరేషన్‌కు రావాల్సిన పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని క్షేత్రస్థాయి సిబ్బందికి సూచించారు. కార్పోరేషన్‌కు చెల్లించాల్సిన టాక్స్‌ను లక్ష్యంగా నిర్దేశించుకుని వసూల్లు చేయాలన్నారు. ఇందుకు సంబందించిన నివేదికను రూపొందించి సమర్పించాలన్నారు. ఆర్‌ఐలు సాదించాల్సిన టార్గెట్లను నిర్ణయించాలన్నారు.

### వానలతో ఊరట

జనగామ,ఆగస్ట్12 (ఆర్ఎన్ఎ): ఇటీవల కురిసిన వర్షాలతో రైతులు ఊరట చెందారు. వివిధ పంటలకు ఇది తడులను ఇచ్చిందని, అలాగే భూగర్భ జలాలకు తోడుగా నిలిచిందని జిల్లా వ్యవసాయ అధికారి అన్నారు. ఇటీవల కురిసిన వానలు పత్తిపంటలకు లాభదాయకమని అన్నారు. ప్రస్తుత పరిస్థితులలో పత్తిపంటకు ఎక్కువగా పెనుబంక, పచ్చదోమ ఆసించిందని, పంటను కాపాడకునేందుకు రైతులు మోనోక్రోటోఫాస్, ఎపిఫేట్, ధమోమిధాక్స, షిప్రోనిల్ ఒక లీటర్ నీటిలో కలపి ముదుత ఎక్కువగా ఉన్నట్లతే వారంలో రెండు సార్లు పంటలపై పిచికారి చేయాలని, రసం పీల్చే పురుగులు చనిపోతాయని రైతులకు తెలిపారు.

### ఫొటోగ్రఫీ రంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

మచిలీపట్నం,ఆగష్టు 12: : జిల్లా కేంద్రం మచిలీపట్నంలో ఆదివారం మచిలీపట్నం డివిజన్ ఫోటో అండ్ వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కెమెరా సృష్టికర్త లూయిస్ జాక్వెస్ మండే డాగురే కాంస్య విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ప్రముఖ సినిమాటోగ్రాఫర్ చోటా కె నాయుడు చేతుల మీదుగా ఆవిష్కృతమైన ఈ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) పాల్గొన్నారు. ప్రపంచంలోనే తొలి సారిగా మచిలీపట్నంలో కెమెరా సృష్టికర్త డాగురే కాంస్య విగ్రహం ఏర్పాటు చేయడం అభినందనీయమని చోటాకే నాయుడు పేర్కొన్నారు. ఫొటోగ్రఫీ రంగానికి ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. చరిత్ర ప్రసిద్ధిగాంచిన బందరు రావడం తన పూర్వ జన్మ సుకృతమన్నారు. బందరు కళలకు కాణాచి అన్నారు.

# లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

## హరితహారంలో బాగస్వాములుకావాలి

## విద్యార్థులకు పద్మా దేవేందర్ సూచన

మెదక్,ఆగస్ట్12(ఆర్‌ఎన్‌ఎ): విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని శ్రద్ధగా చదువుకోవాలని, ఎట్టి పరిస్థితిలో మత్తుపదార్థాల జోలికి వెళ్లకూడదని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేవంర్ గౌడ్ అన్నారు.

పిల్లలు చదువుతో పాటు సాంస్కృతి కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు. అలాగే ప్రభుత్వం చేపట్టిన హరితహారంలో బాగస్వాములు కావాలన్నారు. ఉన్నత చదువులకు ఇంటర్ ఫలితాలు ఎంతో కీలకమని, అందుకే అన్ని పాఠ్యాంశాల్లో మెరుగైన మార్కులు సాధించడం ద్వారా ఉత్తమ శ్రేణిలో ఉత్తీర్ణులు అయ్యేందుకు కళాశాల ప్రారంభం నుంచే ప్రణాళికతో చదవాలని ఉద్బోధించారు. విద్యార్థులు చదువుపై శ్రద్ధ పెట్టడంతో పాటు సామాజిక బాధ్యతను గుర్తెరగాలని సూచించారు. మంచి నాయకత్వ లక్షణాలను పెంపొందింపజేసుకోవాలని చెప్పారు. విద్యార్థి దశ ఎంతో కీలకమని, ఈ తరుణంలో భావోద్వేగాలను పక్కనపెట్టి చదువుపై దృష్టి సారించాలన్నారు. దేశభవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని యువత సన్మార్గంలో పయనించి దేశాభివృద్ధికి తోడ్పడాలని పేర్కొన్నారు. ఎక్కడపుట్టామన్నది ముఖ్యం కాదని, ఎక్కడకు చేరామన్నదే ముఖ్యమన్నారు. విద్యార్థులు భయాన్ని పారదోలి, లక్ష్యం వైపు ఏకాగ్రతతతో ముందుకెళ్లాలన్నారు. మంచి చదువు నడవడిక, ప్రవర్తన, విద్యార్థి దశ నుంచే అలవరుచుకోవాలన్నారు. సమయాన్ని వృథా చేయకుండా పుస్తకాలు చదవాలని తెలిపారు. అనవసరంగా ఖర్చులు చేయకుండా మంచి పనులకు డబ్బులు వినియోగించాలని హితవు పలికారు. తల్లిదండ్రులు కష్టాన్ని గుర్తెరిగి వారి కలలను సాకారం చేయాలన్నారు. దేశాన్ని ప్రేమించాలని, దేశంకోసం సమాజంకోసం పాటుపడాలన్నారు. మంచి లక్ష్యంతో ముందుకెళ్లి ఉన్నతమైన విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను చేరుకున్నపుడే దేశాభివృద్ధికి తోడ్పాటు అందించగలమన్నారు.

# కరీంనగర్‌లో కారు బీభత్సం

### - సైకిల్‌ను తప్పించబోయి షాపులోకి దూసుకెళ్లిన కారు

కరీంనగర్, ఆగస్టు12(ఆర్‌ఎన్‌ఎ) : కరీంనగర్‌లో సోమవారం ఉదయం ఓ కారు బీభత్సం సృష్టించింది. రాజీవ్ రహదారిపై వేగంగా వెళుతున్న ఓ కారు.. సైకిల్‌ను తప్పించబోయి రోడ్డు పక్కన ఉన్న కిరాణా షాపు పైకి దూసుకెళ్లింది. ఈ ఘటన జిల్లాలోని గన్నేరువరం మండలం గుండ్లపల్లి వద్ద చోటు చేసుకుంది. కారు హైదరాబాద్ నుంచి వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. సైకిల్ అడ్డురావడంతో వేగంగా వెళుతున్న కారు అదుపుతప్పింది. పక్కనే ఉన్న బీజేపీ గద్దెను ఢీకొట్టి పక్కనే ఉన్నకిరాణాషాపు పైకి సుమారు 6అడుగుల ఎత్తుకు దూసుకెళ్లింది. ఘటనలో కారు నుజ్జునుజ్జు కాగా, షాపు పూర్తిగా ధ్వంసం అయింది. కారుతో సహా అందులోని ఆరుగురు వ్యక్తులు సుమారు 40నిమిషాలపాటు షాపుపైన ఉన్నారు. వారిలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు జేసీబీ సహాయంతో కారు కిందకి దించారు. క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంలో ఎలాంటి ప్రాణం నష్టం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. కాగా స్థానికుల సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు కిరాణం షాపు దగ్ధం కావడంతో తనకు పరిహారం అందించి ఆదుకోవాలని షాపు యాజమాని డిమాండ్ చేశారు.

# వరద బీభత్సం.. ఇంటి కప్పుపై మొసలి.




హైదరాబాద్, ఆగష్టు 12: కర్ణాటక రాష్ట్రాన్ని వరదలు ముంచెత్తుతున్నాయి. సుమారు 2 వేలకు పైగా గ్రామాలు నీట మునిగాయి. గ్రామాల్లోకి వరద నీటితో పాటు మొసళ్లు, పాములు వచ్చి చేరుతున్నాయి. బెల్గాం జిల్లాలోని రాయ్‌బాగ్ తాలుకా పరిధిలోని ఓ గ్రామంలోకి మొసళ్లు వచ్చాయి. వరద నీరు ఇళ్లను ముంచెత్తడంతో.. మొసళ్లు ఇండ్ల కప్పులపై సేద తీరుతున్నాయి. మొసళ్లను చూసి స్థానికులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.

ఆగష్టు 1వ తేదీ నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కుండపోత వర్షాలకు తోడు వరదలు పోటెత్తాయి. ఆగస్టు 1 నుంచి ఇప్పటి వరకు 40 మంది మృతి చెందారు. మరో 14 మంది అదృశ్యమైనట్లు ఆ రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. ఇక 5,81,702 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లారు. 50,595 జంతువులను వరదల నుంచి కాపాడారు. 3,27,354 మంది 1168 పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్నారు. ఈ భారీ వర్షాలకు, వరదలకు 17 జిల్లాల్లోని 80 తాలుకాలు తీవ్రంగా నష్టపోయాయి. 2028 గ్రామాల్లోకి వరద నీరు వచ్చి చేరడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 4.20 లక్షల హెక్టార్లలో పంట దెబ్బతిన్నది. 28,325 ఇండ్లు ధ్వంసమయ్యాయి.

# వనపర్తి జిల్లాలో దారుణ ఘటన

### ఇద్దరిని బలిగొన్న అతివేగం

హైదరాబాద్,ఆగస్ట్12(ఆర్‌ఎన్‌ఎ): డ్రైవర్ అతివేగం తండ్రీకొడుకులను బలి తీసుకుంది. మృతుల కుటుంబానికి తీరని శోకాన్ని మిగిల్చింది. వనపర్తి జిల్లా ఖిల్లా ఘనపూర్ మండల శివారులో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. అడ్డాకులకు చెందిన ఓ కుటుంబం తుఫాన్ వాహనంలో పెళ్లిచూపుల కోసం ఖిల్లా ఘనపూర్ కు వెళ్తోంది. ఐతే అతివేగంలో ఉన్న తుఫాన్ వాహనం ట్రాక్టర్ ను ఓవర్ టేక్ చేయబోయి, ఎదురుగా వస్తున్న బైక్ ను ఢీకొట్టింది. దీంతో బైక్ పై వెళ్తున్న కర్నెతండా కు చెందిన తండ్రీకొడుకులు పర్మయా, ఎనిమిదేండ్ల తరుణ్ తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. పలువురికి గాయాలు అయ్యాయి. మృతదేహాలను వనపర్తి జిల్లా ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులకు చికిత్స అందిస్తున్నారు. అటు తండ్రీకొడుకుల మృతితో కర్నెతండాలో విషాదం నెలకొంది.

### కారుదూసుకెళ్లి బాలుడికి తీవ్ర గాయాలు

కరీంనగర్ జిల్లాలోని గన్నేరువరం మండలం గుండ్లపల్లి క్రాస్ రోడ్డు వద్ద సోమవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వేగంగా వచ్చిన కారు అదుపుతప్పి సుబు ఖాన్ అనే కుర్రాడిని ఢీకొట్టి, కిరాణా షాప్ పైకి దూసుకుపోయింది. ప్రమాద సమయంలో కారులో ఆరుగురు ప్రయాణిస్తుండగా.. అందులో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులతో పాటు, రెండు కాళు విరిగిపోయిన బాలుడిని సమీప దవాఖానకు తరలించారు. అయితే, అధికారులు ఇప్పటికే గుండ్లపల్లి క్రాస్ రోడ్డును అధికారులు యాక్సిడెంట్ జోన్ గా ప్రకటించారు. కానీ తరుచూ ఇలాంటి రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న అధికారులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

క్రీడలు

# విడీస్‌పై భారత్ విజయం



**- రెండో వన్డేలో 59 పరుగుల తేడాతో గెలుపు**
**- వన్డే కెరీర్‌లో 42వ సెంచరీ చేసిన టీమిండియా కెప్టెన్**
**- బంతితో చలరేగిన భువనేశ్వర్**

పోర్ట్ ఆఫ్ స్పెయిన్, ఆగస్టు12(ఆర్‌ఎన్‌ఎ) : వెస్టిండీస్‌తో జరిగిన రెండో వన్డేలో భారత్ 59 పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 279 పరుగులు చేసింది. బ్యాట్‌తో సారథి కోహ్లీ (120; 125బంతుల్లో), బంతితో భువనేశ్వర్ కుమార్(4/31) చెలరేగారు. వర్షం కారణంగా మ్యాచ్‌ను 46 ఓవర్లకు కుదించి విండీస్ లక్ష్యాన్ని 270 పరుగులుగా నిర్దేశించారు. భారత బౌలర్ల ధాటికి వెస్టిండీస్ పోరాటం 42 ఓవర్లలో 210 పరుగుల వద్దే ముగిసింది. ఓపెనర్ లూయిస్ (65; 80బంతుల్లో ), పూరన్ (42; 52బంతుల్లో ) మినహా మిగతా బ్యాట్స్‌మెన్ విఫలమయ్యారు. విండీస్ స్కోరు రెండొందలు దాటిందంటే లూయిస్-పూరన్ వల్లే. వీరిద్దరూ మరో వికెట్ పడకుండా నిదానంగా ఆడుతూ ఇన్నింగ్స్ నిలబెట్టారు. ఆచితూచి ఆడిన లూయిస్ 23వ ఓవర్‌లో అర్ధశతకం బాదాక మరో 15 పరుగులు జోడించి కుల్దీప్ బౌలింగ్‌లో కోహ్లీ చేతికి చిక్కాడు. తర్వాత పూరన్(42), ఛేజ్(18) పోరాడే ప్రయత్నం చేశారు. కుదురుకుంటున్న ఈ జోడీని భువనేశ్వర్ 35వ ఓవర్‌లో విడదీశాడు. ఇద్దరినీ వెంటవెంటనే పెవిలియన్‌కు పంపి విండీస్ కష్టాలను రెట్టింపు చేశాడు. భారత బౌలరల్లో భువనేశ్వర్ (4/31), షమి(2/39), కుల్దీప్(2/59) ఆకట్టుకున్నారు. ఈ విజయంతో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో భారత్ 1-0తో బోణీ కొట్టింది. అంతకుముందు బ్యాటింగ్‌కు దిగిన భారత్ 50 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 279 పరుగులు చేసింది. మొదట్లో, చివర్లో తడబడినా.. మధ్యలో కెప్టెన్ విరాట్ కోహ్లీ సెంచరీ, యువ బ్యాట్స్‌మన్ శ్రేయస్ అయ్యర్ (68 బంతుల్లో 71; 5 ఫోర్లు, సిక్స్) చక్కటి అర్ధ సెంచరీలతో మెరవడంతో టీమిండియా మెరుగైన స్కోరు సాధించింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా... ఓపెనర్లు విఫలమైనా కోహ్లీ, అయ్యర్ ఇన్నింగ్స్‌ను నిలబెట్టడంతో మంచి స్కోర్ చేసింది. వన్డేల్లో కోహ్లీ 42వ శతకం సాధించాడు. ఓపెనర్ ధావన్ (2) పరుగుల ప్రయాస కొనసాగడంతో భారత్‌కు శుభారంభం దక్కలేదు. ఇన్నింగ్స్ మూడో బంతికే అతడు కాట్రెల్‌కు వికెట్ల ముందు దొరికిపోయాడు. అంపైర్ ఔటివ్వకున్నా విండీస్ రివ్యూ కోరి ఫలితం రాబట్టింది. మరో ఓపెనర్ రోహిత్ శర్మ (34 బంతుల్లో 18; 2 ఫోర్లు)... 11వ బంతికి ఖాతా తెరిచాడు. ఆ తర్వాతా ఇబ్బందిగానే కనిపించాడు. సమన్వయ లోపంతో రెండుసార్లు రనౌటయ్యే ప్రమాదం ఎదుర్కొన్నాడు. ఎక్కువగా స్ట్రయికింగ్ తీసుకున్న కోహ్లీ తనదైన శైలిలో సాధికారికంగా ఆడాడు. చకచకా అర్ధసెంచరీ (57 బంతుల్లో) అందుకున్నాడు.

వరుణుడి ఇన్నింగ్స్ సాగిందిలా..

తొలి వన్డేను రద్దు చేయించిన వరుణుడు ఈ మ్యాచ్‌లోనూ కీలక ఇన్నింగ్స్ ఆడాడు. ముందుగా భారత్ బ్యాటింగ్ సాగుతుండగా 43వ ఓవర్‌లో జల్లులతో కూడిన వర్షం రావడంతో మ్యాచ్ అరగంటకు పైగా ఆగింది. తర్వాత విండీస్ ఇన్నింగ్స్ సాగుతుండగా 13వ ఓవర్‌లో మరోసారి వర్షం వచ్చింది. అప్పుడు కూడా సుమారు అరగంట సమయం వృథా అయింది. దీంతో డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో లక్ష్యాన్ని 46 ఓవర్లలో 270 పరుగులుగా కుదించారు.

# భువనేశ్వర్ కుమార్ పట్టిన అద్భుత క్యాచ్ చూశారా..? వీడియో..!



ట్రినిడాడ్: ట్రినిడాడ్‌లోని పోర్ట్ ఆఫ్ స్పెయిన్ క్వీన్స్ పార్క్ ఓవల్ మైదానంలో భారత్, వెస్టిండీస్ జట్ల మధ్య జరిగిన రెండో వన్డేలో భారత్ విండీస్‌పై డక్ వర్త్ లూయిస్ పద్ధతిలో 59 పరుగుల తేడాతో విజయం సాధించిన విషయం విదితమే. కాగా ఈ మ్యాచ్‌లో భారత ఫాస్ట్ బౌలర్ భువనేశ్వర్ కుమార్ అద్భుతమైన క్యాచ్ పట్టాడు. విండీస్ ఇన్నింగ్స్ 35వ ఓవర్‌లో భువనేశ్వర్ కుమార్ వేసిన బంతిని ఆడిన వెస్టిండీస్ ప్లేయర్ ఛేజ్ బంతిని స్ట్రెయిట్ డ్రైవ్‌గా తరలించబోయాడు. కానీ బంతి ఎడ్జ్ తీసుకుని గాల్లోకి లేచింది. దీంతో బంతిని భువనేశ్వర్ కుమార్ ఒడిసి పట్టాడు. ఈ క్రమంలో భువీ ఎడమ వైపు డైవ్ చేస్తూ ఒంటి చేత్తో క్యాచ్ పట్టాడు. కాగా ఈ క్యాచ్ వీడియో ఇప్పుడు నెట్‌లో వైరల్‌గా మారింది. ఇక ఈ మ్యాచ్‌లో మొత్తం 4 వికెట్లు తీసిన భువీ భారత్ మ్యాచ్ గెలవడంలో తన వంతు పాత్రను పోషించాడు. కాగా వెస్టిండీస్‌తో జరుగుతున్న 3 వన్డేల సిరీస్‌లో మొదటి వన్డే వర్షం కారణంగా రద్దవగా రెండో వన్డేలో భారత్ గెలిచి సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో ఉంది. ఇక ఈ సిరీస్‌లో 3వ వన్డే కూడా ఇదే క్వీన్స్ పార్క్ ఓవల్ మైదానంలో ఈ నెల 14వ తేదీన జరగనుంది.

# భక్తిశ్రద్ధలతో బక్రీద్ ప్రార్థనలు

**- మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలుచేసిన ముస్లీం సోదరులు**

హైదరాబాద్, ఆగస్టు12(ఆర్‌ఎన్‌ఎ) : త్యాగానికి ప్రతీకగా జరుపుకొనే బక్రీద్‌ను ముస్లింలు తెలుగు రాష్ట్రాల్లో భక్తిశ్రద్ధలతో జరుపుకొంటున్నారు. మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం పరస్పరం పండగ శుభాకాంక్షలు తెలుపుకొంటూ ఆలింగనం చేసుకున్నారు. చార్మినార్ సమీపంలోని మక్కామసీదు వద్ద అధిక సంఖ్యలో ముస్లింలు పాల్గొని ప్రార్థనలు చేశారు. ఏర్పాట్లను పర్యవేక్షించిన సీపీ అంజనీకుమార్ ఎలాంటి ఇబ్బందులు లేకుండా భద్రత ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. తెలంగాణలోని అన్ని జిల్లాల్లో మసీదులు ఉదయం నుంచి ప్రార్థనలతో సందడిగా మారాయి. ముస్లీంలు ఉదయం మసీదులకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరినొకరు అలింగనం చేసుకున్నారు. అనంతరం పేదలకు వస్త్రాలు, ఇతర పదార్థాలను పంపిణీ చేశారు. మహబూబాద్ జిల్లా తొర్రూరు పట్టణ కేంద్రంలో, జమా మజీద్ లో బక్రీద్ పర్వదిన వేడుకల్లో మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పాల్గొన్నారు. అనంతరం ఎర్రబెల్లి మాట్లాడుతూ.. ముందుగా ముస్లిం సోదరులందరికీ బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మీ దయవల్ల ఎమ్మెల్యే నైనా, కేసీఆర్ ఆశీస్సులతో మంత్రి పదవిని పొందానని, రాబోయే రోజుల్లో తొర్రూరు రూపురేఖలను మార్చి రాష్ట్రంలోనే సుందరమైన పట్టణంగా తీర్చి దిద్దుతా..తొర్రూరు ముస్లిం సోదరుల ఆప్యాయతతో నేను ఇంత పెద్దపదవిలో ఉన్నాను.. ముస్లింలకు అభివృద్ధిలో పెద్దపీట వేసిన మహాత్ముడు మన ముఖ్యమంత్రి కేసీఆర్ అని కొనియాడారు. వరంగల్ జిల్లా మట్టెవాడ ఈద్గాలను తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలియశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నరేందర్ మాట్లాడుతూ.. తెలంగాణా రాష్టంలో హైదరాబాద్ తర్వాత ఎక్కువగా మైనార్టీలు ఉండే నియోజకవర్గం తూర్పు నియోజకవర్గం,ఈ నియోజకవర్గంలో అందరం కలిసి మెలిసి ఉంటామన్నారు. మీకు సహాయసహకారాలు అందిస్తూ మీ వెన్నంటి ఉంటామని, ఈద్గాలు, మసీదులను అభివృద్ధి చేస్తామని, మీ సమస్యలను తీర్చడంలో ముందుంటామన్నారు. ఈద్గాలను వర్షం నిలవకుండా ఆహ్లాదకర వాతావరణం ఉండే విధంగా ఏర్పాట్లు చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి కేసీఆర్ మైనార్టీల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు రూపొందించి వారి అభివృద్ధికి కృషిచేస్తున్నానన్నారు. ఈ సందర్భంగా అందరికి బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా ఏపీ వ్యాప్తంగా బక్రీద్ పర్వదినాన్ని ముస్లీం సోదరులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలోని గాంధీజీ మహిళా కళాశాల మైదానంలో చేపట్టిన సామూహిక ప్రార్థనల్లో దేవాదాయ శాఖ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు. ముస్లింలను ఆత్మీయ ఆలింగనం చేసుకుని బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. త్యాగం, సహనానికి ప్రతీకగా జరుపుకొనే బక్రీద్ పండగ... ప్రజలందరి మధ్య శాంతి, సుహృద్భావాలను పెంపొందించాలని మంత్రి ఆకాంక్షించారు. వైకాపా ప్రభుత్వం మైనారిటీల సంక్షేమానికి కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. గుంటూరు జిల్లాలో పవిత్ర బక్రీద్ పర్వదినం సందర్భంగా ముస్లింలు ప్రత్యేక ప్రార్థనాల్లో పాల్గొన్నారు. గుంటూరు నగరంపాలెం ఈద్గా వద్ద వేలాదిమంది సాముహిక నమాజ్ చేశారు. ఇస్లాం మతపెద్దలు బక్రీద్ ప్రత్యేకతను, పండగ వెనుక దాగి ఉన్న త్యాగాన్ని వివరించారు. ఈ ప్రార్థనలో గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే మద్దాలి గిరిధర్ పాల్గొన్నారు. బక్రీద్ సందర్భంగా పరస్పరం ఆలింగనం చేసుకుని అభినందనలు చెప్పుకున్నారు. బక్రీద్ ప్రార్థనల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు చర్యలు చేపట్టారు.

# హిందూ యువతి మృతదేహానికి ముస్లింలు అంత్యక్రియలు



హైదరాబాద్, ఆగష్టు 12: ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో మతసామరస్యం పరిఢవిల్లింది. చనిపోయిన హిందూ యువతి మృతదేహానికి ముస్లింలు దగ్గరుండి అంతిమ సంస్కారాలు చేశారు. హోరీలాల్ విశ్వకర్మ పక్షవాతంతో బాధపడుతున్నాడు. ఆయన భార్య గుండె సంబంధిత వ్యాధి బారిన పడింది. ఈ దంపతులకు ఇద్దరు పిల్లలు. తల్లిదండ్రులు పని చేయలేని స్థితిలో ఉండడంతో వారికి కుమారుడే పెద్ద దిక్కు అయ్యాడు. అతనే కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కూతురు సోని మలేరియా వ్యాధితో బాధపడుతూ ఆదివారం కన్నుమూసింది. ఈ కుటుంబ పరిస్థితిని అర్థం చేసుకున్న మానవతావాదులైన ముస్లిం సోదరులు.. సోని అంత్యక్రియలు చేసేందుకు ముందుకు వచ్చారు. ముస్లింలే దగ్గరుండి అంత్యక్రియలకు ఏర్పాట్లు చేశారు. వారే తమ భుజాలపై సోని మృతదేహాన్ని వేసుకుని.. రామజపం చేస్తూ అంత్యక్రియలు నిర్వహించారు. ఇక ఈ కుటుంబానికి ముస్లింలు ఆర్థికంగా సాయం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు.

## గిగాఫైబర్ కనెక్షన్‌తో..

# హెచ్‌డీ టీవీ, సెట్‌టాప్ బాక్సులు ఉచితం

**- రిలయన్స్ జియో యూజర్లుకు అంబానీ బంపర్ ఆఫర్**
**- వచ్చే 12 నెలల్లో సేవలను దేశమంతటా అందిస్తాం**
**- ఆగష్టు 15 నుంచి రిజిస్ట్రేషన్లు ప్రారంభిస్తున్నాం**
**- భారత ఆర్థిక వ్యవస్థ ఇప్పుడునంత ప్రకాశవంతంగా మునుపెన్నడూలేదు**
**- రియల్స్ ఎదుగుదలను ఆపడం ఎవరితరంకాదు**
**- రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముఖేష్ అంబాని**

న్యూఢిల్లీ, ఆగస్టు12(ఆంఎన్ఎ) : రిలయన్స్ జియో యూజర్లుకు ముకేశ్ అంబానీ బంపర్ ఆఫర్ ఇచ్చారు. జియో మూడో వార్షికోత్సవం సందర్భంగా సెప్టెంబర్ 5న జియోగిగా ఫైబర్ సేవలను ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. రిలయన్స్ ఇండస్ట్రీట్ 42వ వార్షిక సర్వసభ్య సమావేశం సోమవారం జరిగింది. రిలయన్స్ అధినేత, సీఎండీ ముకేశ్ అంబానీ సహా, ఆయన కుటుంబం ఈ మీటింగ్‌కు తరలి వచ్చింది. ముఖ్యంగా ముకేశ్ అంబానీ తల్లి, భార్య నీతూ అంబానీ, కుమార్తె ఆశ, కుమారుడు ఆకాశ్ అంబానీ తోపాటు కీలక వాటాదారులు, ఇతర ప్రమోటర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖేష్ అంబాని మాట్లాడుతూ.. జియో వెల్‌కమ్ ఆఫర్లో భాగంగా.. ఫరెవర్ ప్లాన్ తీసుకున్న వారికి 4కే రిజల్యూషన్‌తో కూడిన హెచ్‌డీ ఎల్ఈడీ టీవీలను, సెట్ టాప్ బాక్సులను ఉచితంగా ఇస్తామని ప్రకటించారు. ఇప్పటికే ఐదు లక్షల నివాసాల్లో ట్రయల్ రన్ నిర్వహిస్తున్నామన్నారు. వచ్చే 12 నెలల్లో గిగాఫైబర్ సేవలను దేశమంతటా అందిస్తామన్నారు. ఆగష్టు 15 నుంచి రిజిస్ట్రేషన్లు ప్రారంభిస్తామన్నారు. జియో ఫరెవర్ ప్లాన్‌కు సంబంధించిన వివరాలను ముకేశ్ అంబానీ పూర్తిగా వెల్లడించలేదు. కానీ దీర్ఘకాలిక జియో గిగాఫైబర్ ప్లాన్‌లను ఎంపిక చేసుకున్న వారికి ఉచితంగా టీవీలను అందజేస్తామని మాత్రం ప్రకటించారు. ఏ బ్రాండ్ టీవీలను ఇస్తారు, సెక్యూరిటీ డిపాజిట్ తీసుకుంటారా? లేదా అనేది తెలియాల్సి ఉంది. రిలయన్స్ గిగాఫైబర్‌లో 100 ఎంబీపీఎస్ నుంచి 1జీబీపీఎస్ వరకు స్పీడ్‌తో ఇంటర్నెట్ అందజేస్తారు. జియో గిగాఫైబర్ సర్వీస్ ద్వారా ఉచితంగా ల్యాండ్‌లైన్ కనెక్షన్, ఇంటర్నెట్, డిజిటల్ సెట్‌టాప్ బాక్స్, అల్ట్రా హై డెఫినిషన్ ఎంటర్‌టైన్‌మెంట్, వర్చువల్ కంటెంట్, ఇంటరాక్టివ్ గేమింగ్, స్మార్ట్ హోమ్ సొల్యూషన్లను అందజేయనున్నారు. దేశంలో 2 కోట్ల మందికి గిగాఫైబర్ సేవలను అందిస్తామని అంబానీ తెలిపారు. జియో ఫైబర్ ప్లాన్‌ను నెలకు రూ.700 నుంచి రూ.10 వేల వరకు ఉంటాయని అంబానీ తెలిపారు. జియో ఫైబర్ కోసం ఇప్పటికే 15 మిలియన్ల రిజిష్ట్రేషన్లు వచ్చాయన్నారు. జియో ఫైబర్ కస్టమర్లు సినిమాలు రిలీజైన రోజునే ఇంట్లో నుంచే వాటిని చూడొచ్చాన్నారు. క్లౌడ్ డేటాసెంటర్ల ఏర్పాటు కోసం రిలయన్స్, మైక్రోసాఫ్ట్ చేతులు కలిపాయని ముకేశ్ అంబానీ తెలిపారు. ఐటీ స్టార్టప్‌లకు జియో-అజూర్ సేవలను ఉచితంగా అందజేస్తామన్నారు. దేశంలో అత్యున్నత విలువ కల కంపెనీగా తన సత్తా చాటుతోందని, భారత ఆర్థిక వ్యవస్థలో రిలయన్స్ కీలక భూమికను పోషిస్తోందని తెలిపారు. రిలయన్స్ వృద్ధి, అలాగే భారత ఆర్థికవ్యవస్థ ప్రస్తుతం ఉన్నంత ప్రకాశవంతంగా ఇంతకుముందెన్నడూ కనిపించలేదని అంబానీ పేర్కొన్నారు. ఇండియా వృద్ధిని, రిలయన్స్ ఎదుగుదలను ఆపడం ఎవ్వరి తరమూ కాదని ఆయన వెల్లడించారు. న్యూ ఇండియా, న్యూ రిలయన్స్ అనే నినాదాన్నిచ్చారు.

### కొత్త సినిమాను రిలీజ్ రోజునే ఇంట్లో చూడొచ్చు..

రిలయన్స్ గ్రూప్ అధినేత ముఖేశ్ అంబానీ సినిమాలకు సంబంధించి కీలక ప్రకటన చేశారు. ఇకపై ప్రజలు థియేటంకు వెళ్లి, క్యూలైన్లలో నిల్చోవాల్సిన పనిలేకుండా కొత్త ఫీచర్ ను తీసుకొస్తున్నామని ఆయన తెలిపారు. ఇందులో భాగంగా కొత్త సినిమాలు రిలీజ్ అయ్యేంరోజునే వాటిని ఇంట్లోనే కూర్చుని చూడవచ్చని ప్రకటించారు. ఈ సౌలభ్యం ప్రీమియం జియో ఫైబర్ కస్టమర్లకు మాత్రమేనని చెప్పారు. 2020 మధ్యలో 'జియో ఫస్ట్ డే.. ఫస్ట్ షో మూవీస్' పేరిట ఈ సేవలను అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. అలాగే జియో పోస్ట్ పెయిడ్ కస్టమర్ల కోసం' జియో పోస్ట్ పెయిడ్ ప్లస్' అనే పథకాన్ని తీసుకొస్తున్నామని వెల్లడించారు.


### రిలయన్స్ రిఫైనరీలో 5.3లక్షల కోట్ల విదేశీ పెట్టుబడులు..

సౌదీకి చెందిన ఆరామ్‌కో సంస్థ .. రిలయన్స్ ఓటీసీ సంస్థలో సుమారు 75 బిలియన్ల డాలర్లు పెట్టుబడి పెట్టనున్నది. అంటే సుమారు 5.3 లక్షల కోట్లు అన్నమాట. ఇది ఆ రిలయన్స్ కంపెనీలో 20 శాతం వాటా. ఈ విషయాన్ని సోమవారం రిలయన్స్ ఇండస్ట్రీస్ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరక్టర్ ముకేశ్ అంబానీ తెలిపారు. ఆయిల్, పెట్రో కెమికల్ వ్యాపారంలో సంయుక్తంగా ముందుకు వెళ్లేందుకు సౌదీ ఆరామ్‌కోతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు ముకేశ్ చెప్పారు. ఈ ఒప్పందం ప్రకారం సౌదీ కంపెనీ రిలయన్స్ పెట్రో కెమికల్స్‌కు 500 బ్యారెళ్ల క్రూడ్ ఆయిల్‌ను ప్రతిరోజు సరఫరా చేస్తుందన్నారు. జామ్‌నగర్‌లో ఉన్న రిఫైనరీకు ఈ సరఫరా జరుగుతుందని, ఆరామ్‌కోకు ప్రపంచంలోనే అతిపెద్ద ఆయిల్ ఎక్స్‌పోర్టర్ అన్న పేరుందని తెలిపారు. జామ్‌నగర్‌లోని ఇంటిగ్రేటెడ్ రిఫైనరీ కూడా అతిపెద్ద పెట్రోకెమికల్ సంస్థ అని ముకేశ్ తెలిపారు. గత 20ఏళ్ల నుంచి జామ్‌నగర్ రిఫైనరీ ప్రతిరోజు సౌదీ ఇంధనాన్ని రిఫైన్ చేస్తున్నట్లు ఆయన చెప్పారు. భారత్, సౌదీ మధ్య వాణిజ్య బంధాలకు ప్రధాని మోదీ, ప్రిన్స్ సల్మాన్‌లు బలమైన పునాది వేశారని ముకేశ్ అన్నారు.

### జమ్మూకశ్మీర్,లడఖ్ లో భారీగా రిలయన్స్ పెట్టుబడులు...


ఆర్టికల్ 370రద్దు తర్వాత ఆగస్టు-8,2019న జమ్మూకశ్మీర్,లడఖ్ లో పెట్టుబడులు పెట్టాలని పారిశ్రామికవేత్తలకు ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఇటీవల పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. మోడీ పిలుపునందుకుని ఇప్పటికే పలువురు పారిశ్రామికవేత్తలు జమ్మూకశ్మీర్, లడఖ్లో పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధమయ్యారు. నేను సైతం అంటూ రిలయన్స్ కూడా జమ్మూకశ్మీర్,లడఖ్ లో భారీగా పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధమైంది. సోమవారం ముంబైలో జరిగిన 42వ రిలయన్స్ యాన్యువల్ జనరల్ మీటింగ్ లో స్వయంగా రిలయన్స్ అధినేత ముఖేష్ అంబానీ ఈ విషయాన్ని ప్రకటించారు. సమీప భవిష్యత్తులో జమ్మూకశ్మీర్,లడఖ్ లో పెట్టుబడులకు సంబంధించిన ప్రకటన త్వరలోనే వస్తుందని ఆయన అన్నారు. జమ్మూకశ్మీర్,లడఖ్ ప్రజల అభివృద్ధి అవసరాలకు తాము మద్దతుగా ఉంటామన్నారు. ఓ స్పెషల్ టాస్క్ ఫోర్స్ ని ఏర్పాటు చేసి రాబోయే నెలల్లో జమ్మూకశ్మీర్,లడఖ్ లో పెట్టుబడులకు సంబంధించిన ప్రకటన వస్తుందని తెలిపారు. అంతేకాకుండా ఈ ఏడాది ఫిబ్రవరిలో పుల్వామా దాడిలో అమరులైన జవాన్ల కుటంబాల బాధ్యతను తీసుకున్నట్లు ఈ సందర్భంగా అంబానీ ప్రకటించారు. అమర జవాన్ల పిల్లల విద్యకు సంబంధించి, అలాగే వారి కుటుంబాల జీవన భృతికి సంబంధించి తాము పూర్తిబాధ్యత తీసుకున్నట్లు ప్రకటించారు. భారతీయుల డేటా ప్రైవసీ కోసం బ్లాక్‌చైన్ వ్యవస్థను తీసుకొస్తున్నామని, జియో డేటా సెంటర్ల కోసం మైక్రోసాఫ్ట్‌తో జతకడుతున్నామని అంబానీ వివరించారు. 'అజుర్ ప్లాంట్ ఫాం'ను మైక్రోసాఫ్ట్ అందజేయనున్నామన్నారు. ఈ సందర్భంగా మైక్రోసాఫ్ట్ సీఈవో సత్యనాదెళ్ల వీడియో బైట్‌ప్లే చేశారు.

అంతేకాదు దేశీయంగా స్టార్టప్స్‌కు జియో పూర్తి సహకారం అందిస్తుందని ప్రకటించారు. 2020, జనవరి రిజిస్ట్రేషన్ ప్రారంభిస్తామని చెప్పారు. అనంతరం జియోతో హై ఎండ్ వీడియో కాన్ఫరెన్స్ ఎలా చేయవచ్చో లైవ్‌గా చేసి చూపించారు ఇషా, ఆమె సోదరుడు ఆకాశ్ అంబానీ. ఈ సందర్భంగా ఆకాశ్ అంబానీ మాట్లాడుతూ.. మల్టీ ప్లేయర్ గేమింగ్ ప్లాంట్‌ఫామ్‌ను ప్రారంభిస్తున్నామని చెప్పారు.



సినిమా

# కెవ్వుకేక.. డ్రీమ్‌గర్ల్ ట్రైలర్




హైదరాబాద్: హిందీ సినిమా డ్రీమ్‌గర్ల్ ట్రైలర్ రిలీజైంది. జాతీయ ఉత్తమ నటుడు ఆయుష్మాన్ ఖురానా ఈ ఫిల్మ్‌లో ప్రధాన పాత్ర పోషిస్తున్నాడు. కామిడీ కథా నేపథ్యంతో వస్తున్న ఈ సినిమా మరోసారి ఆయుష్మాన్‌కు పెద్ద హిట్ ఇచ్చేలా ఉన్నది. కాల్ సెంటర్‌లో పనిచేస్తున్న హీరో ... ఆడ గొంతుతో కస్టమర్లకు కిక్ ఎక్కిస్తున్నాడు. డ్రీమ్‌గర్ల్ లుక్‌ను రిలీజ్ చేస్తున్నట్లు ఆయుష్మాన్ తన ట్విట్టర్ అకౌంట్‌లో తెలిపాడు. అన్నూ కపూర్, నుష్రత్ బరూచా కూడా ఈ ఫిల్మ్‌లో నటిస్తున్నారు. పూజ అనే అమ్మాయి పేరుతో హీరో ఆడగొంతుతో మాట్లాడుతూ ప్రేక్షకులను థ్రిల్ చేస్తున్నాడు. యూపీలోని మథురలో ఫిల్మ్ షూటింగ్ జరిపారు. రాజ్ శాండిల్య దీన్ని డైరక్ట్ చేస్తున్నాడు. గత ఏడాది అందాధున్, బదాయి హోలతో హిట్ కొట్టిన ఆయుష్మాన్ ఈ ఏడాది కూడా ఆర్టికల్ 15తో ఊపుమీద కనిపించాడు. ఇక ఇప్పుడు డ్రీమ్‌గర్ల్ అతని స్టార్‌డమ్‌ను మరింత పెంచేలా ఉంది.

# చివరి దశలో 'బిగిల్'





అట్లీ దర్శకత్వంలో 'తలబది' విజయ్ హీరోగా ఏజీఎస్ సంస్థ నిర్మిస్తున్న చిత్రం 'బిగిల్'. కొన్ని సంవత్సరాలుగా విజయ్ తన చిత్రాలను దీపావళికి విడుదల చేస్తున్నారు. ఈ సినిమాను కూడా అదే తరహాలో ప్రేక్షకుల ముందుకు తెచ్చి అలరించేందుకు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. చెన్నైలో భారీ బ్జడెట్‌తో ఎగ్మూరు రైల్వేస్టేషన్ సెట్‌ను ఏర్పాటు చేశారు. ఆర్ట్ డైరెక్టర్ ముత్తురాజ్ దీన్ని నిర్మించారు. ఇక్కడే కొన్ని రోజులుగా కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. చాలావరకు సన్నివేశాలు రైల్వేస్టేషన్‌లో జరుగుతున్నందువల్ల ఈ సెట్‌ను వేసినట్లు చిత్రవర్గాలు చెబుతున్నాయి. ఇందులో నయనతార కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. ఏఆర్ రెహ్మాన్ సంగీతం సమకూర్చుతున్నారు. వివేక్, యోగిబాబు, ఆనంద్‌రాజ్, దేవదర్శిని తదితరులు ఇతర తారాగణం. విజయ్‌కి తమ్ముడిగా 'పరియేరుం పెరుమాల్' ఫేం కదిర్ నటిస్తున్నారు. 'సింగపెన్నే..' అనే సింగిల్ ట్రాక్‌ను ఇటీవల విడుదల చేశారు రెహ్మాన్. ఈ పాటకు మంచి స్పందన లభిస్తోంది.

# బర్త్‌డే రోజూ షూటింగ్‌లో బిజీబిజీగా సారా..



కేదార్‌నాథ్ మూవీతో బాలీవుడ్‌లో అడుగుపెట్టిన స్టార్ కిడ్ సారా అలీ ఖాన్ రెండో సినిమా సింబాతో రూ 100 కోట్ల క్లబ్‌లో అడుగుపెట్టి క్రేజీ హీరోయిన్‌గా మారింది. సైఫ్ అలీ ఖాన్ గారాల పట్టి సారా 24వ పుట్టినరోజు కావడంతో ఈరోజంతా ఆమె పార్టీల్లో మునిగితేలుతుంది అనుకుంటే పొరపడినట్టే. బర్త్‌డే రోజూ ఈ భామ షూటింగ్‌తోన బిజీబిజీగా గడపనున్నారు. వరుణ్ ధావన్ లీడ్ రోల్‌లో తెరకెక్కుతున్న కూలీ నెంబర్ 1 రీమేక్ షూటింగ్ కోసం సారా ప్రస్తుతం బ్యాంకాక్‌లో ఉన్నారు. బర్త్‌డే రోజు పనికి విరామం ఇచ్చేందుకు మూవీ రూపకర్తలు ముందుకొచ్చినా సారా సున్నితంగా తోసిపుచ్చినట్టు తెలిసింది. గత ఏడాది సైతం బర్త్‌డే రోజు ఆమె తన తొలి మూవీ కోసం సన్నద్ధమయ్యేందుకు రోజంతా డ్యాన్స్ ప్రాక్టీస్‌లో మునిగిపోయారు. ఇక ఈసారి బ్యాంకాక్‌లో షూటింగ్‌లో ఉండటంతో సెట్‌లోనే బర్త్‌డేను జరుపుకోనున్నారు.

# కొత్త లుక్‌లో తాప్సీ




సూపర్ న్యాచురల్ థ్రిల్లర్ సినిమాల్లో భయపెట్టడానికి దెయ్యం, పాడుబడిన భవంతులు, చీకట్లో కొన్ని సన్నివేశాలు తీయడం కామన్. ఇవేమీ లేకుండా ఓ సూపర్ న్యాచురల్ థ్రిల్లర్ ఎ÷-లాన్ చేశారు బాలీవుడ్ దర్శకుడు అనురాగ్ కశ్యప్. తాప్సీ ముఖ్య పాత్రలో నటించను న్నారు. ఇది వరకు అనురాగ్ కశ్యప్ దర్శకత్వంలో వచ్చిన 'మన్‌మర్జియా', ఆయన నిర్మాణంలో వచ్చిన 'సాంద్ కీ ఆంఖే'లో హీరోయిన్‌గా నటించారు తాప్సీ. ఈ సూపర్ న్యాచురల్ థ్రిల్లర్ విశేషాలను తాప్సీ తెలుపుతూ ? 'ఇప్పటి వరకు ఇండియన్ స్క్రీన్ మీద చూడనటువంటి అంశాలు మా సినిమాలో ఉంటాయి.

ఈ సినిమాలో పలు గెటప్స్‌లో కనిపిస్తాను. గుర్తుపట్టలేనటువంటి లుక్ కాదు కానీ ఇప్పటివరకూ మీరు చూడని గెటప్‌లో మాత్రం కచ్చితంగా కనిపిస్తాను. షూటింగ్ మొత్తం విదేశాల్లో చేస్తాం. అనురాగ్‌తో సినిమా అంటే మానసికంగా ప్రిపేర్ అయ్యుండాలి. షూటింగ్ ముందు ఏదో ఓ బాంబ్ వేస్తాడు. 'మన్‌మర్జియా' షూటింగ్ రెండు రోజుల ముందు జుత్తు మొత్తం రంగు వేసుకోమన్నాడు. అందుకే ఈసారి నేను రెడీగా ఉన్నాను. గుండు చేయించుకోవడానికి తప్ప ఏం చేయమన్నా చేయడానికి సిద్ధంగానే ఉన్నాను అన్నారు.

## పదేళ్ల తరువాత..

# నాగార్జున సాగర్ గేట్లు ఎత్తివేత



నల్గొండ, ఆగస్టు12(ఆంఎస్‌ఎ) : ఎగువన కురుస్తున్న భారీ వర్షాలు, వరదలతో కృష్ణానది ఉగ్రరూపంతో దాల్చింది. శ్రీశైలం, జురాల ప్రాజెక్టుల నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండటంతో నాగార్జున సాగర్ నిండు కుండలా మారింది. ఆదివారం శ్రీశైలంలో 10 గేట్లను ఎత్తి నీటిని, నాగార్జున సాగర్‌లోకి వదిలారు. నిన్నటి నుంచి భారీ ప్రవాహం సాగర్‌లోకి భారీగా వరద నీరు చేరి, సాగర్ జలకళ సంతరించుకుంది. దీంతో సోమవారం ఉదయం అధికారులు సాగర్‌లోని 24 గేట్లను ఎత్తి, దిగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టుకు నీటిని విడుదల చేశారు. సాగర్ డ్యాం సమీపంలో పూజలు నిర్వహించి 24 గేట్లను, 5 మీటర్ల మేర ఎత్తారు. ప్రస్తుతం సాగర్‌కు ఇన్ ఫ్లోలో

### - 24గేట్లు ఎత్తి దిగువకు నీటీవిడుదల
### - సాగర్ వద్ద పెద్దెత్తున సందర్శకుల తాకిడి

సుమారు 9.50 లక్షల క్యూసెక్కుల నీరు ఉండగా, అవుట్ ఫ్లోలో సుమారు లక్ష క్యూసెక్కులుగా ఉంది. ఇంకా వరద ఉధృతి ఇలాగే కొనసాగితో మొత్తం 26గేట్లు ఎత్తే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 312 టీఎంసీలు. శ్రీశైలం నుంచి వస్తున్న వరద ప్రవాహంతో ప్రస్తుతం సాగర్‌లో నీటి నిల్వ 235 టీఎంసీలకు చేరుకుంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా.. ప్రస్తుత నీటి మట్టం 564 అడుగులకు చేరింది. గతేడాది సెప్టెంబరు నెలలో పులిచింతలకు నీటిని విడుదల చేయగా.. ఈసారి ఆగస్టు రెండో వారంలోనే నీటిని విడుదల చేయడం గమనార్హం. గతేడాది నాలుగు గేట్లు మాత్రమే ఎత్తి, కేవలం గంట సేపు మాత్రమే దిగువకు నీటిని విడుదల చేశారు. గత పదేళ్ల నుంచి సాగర్‌లో 24 గేట్లు తెరుచుకోవడం ఇదే తొలిసారి. 2009లో అప్పటి వరద ఉధృతికి 26 గేట్లు ఎత్తి నీటిని విడుదల చేశారు. నాగార్జున సాగర్ నుంచి విడుదల చేసిన నీరు పులిచింతల ప్రాజెక్టులోకి పరుగులు తీస్తోంది. దీంతో కేవలం 44 టీఎంసీల నీటి నిల్వ మాత్రమే ఉన్న పులిచిం తల ప్రాజెక్టు ఒక్క రోజులో నిండే అవకాశం ఉంది. ఆ తర్వాత ప్రకాశం బ్యారేజీకి విడుదల చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

సాగర్ వద్ద పర్యాటకుల కోలాహలం..

నాగార్జునసాగర్ నిండుకుండలా, జలకళ సంతరి ంచుకోవడంతో పర్యాటకలను ఆకర్షిస్తోంది. వరుస సెలవుల నేపథ్యంలో పెద్ద ఎత్తున సందర్శకులు సాగర్ చేరుకున్నారు. కృష్ణమ్మ పరుగులను చూసేందుకు భారీ సంఖ్యలో తరలివస్తున్నారు. ప్రాజెక్టు అందాలను తనివీ తీరా ఆస్వాదిస్తూ ఎంజాయ్ చేస్తున్నారు. సాగర్‌కు వరద ఇలాగే పెరిగితే, రానున్న వారం రోజుల్లో పర్యాటకుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. సందర్శకుల తాకిడి నేపథ్యంలో అధికారులు సాగర్ వద్ద భద్రతను పటిష్టం చేశారు.

# మేం శ్రీరాముడి వారసులం

### - జైపూర్ రాజ కుటుంబీకురాలి ప్రకటన

న్యూఢిల్లీ, ఆగస్టు12(ఆర్ ఎన్ఎ) : తాము శ్రీరాముడి కుమారుడు కుశుడి వారసులమని బీజేపీ ఎంపీ, జైపూర్ రాజకుటుంబానికి చెందిన దియా కుమారి ప్రకటించారు. అయోధ్య రామ జన్మభూమి కేసు సందర్భంగా ఇప్పటికీ రాముడి కుటుంబీకులు లేదా వారసులు ఎవరైనా ఉన్నారా? అని సుప్రీం కోర్టు ప్రశ్నించింది. దీనికి స్పందనగా దియా కుమారి తాము కుశుడి వారసులమని తెలిపారు. తనలాగే రాముడి వారసులు ఈ ప్రపంచంలో చాలా మంది ఉన్నారని ఆమె తెలిపారు. రాముడి వారసులం కావడం తమకెంతో గర్వకారణమని ఆమె చెప్పారు. తాము కుశుడి వారసులం అని చెప్పడానికి తమ కుటుంబం వద్ద ప్రాచీన పత్రాలు ఉన్నాయని ఆమె తెలిపారు. అవసరమైతే ఆ ఆధారాలను అందజేస్తానన్నారు. మా గ్రంథాలయం, మ్యూజియంలలో ప్రాచీన పత్రాలు, మనుస్మృతి, వంశవృక్షం ఉన్నాయి. వీటి ఆధారంగా తాము కుశుడి వారసులమని నిరూపించగలమని దియా కుమారి తెలిపారు. తాము లవుడి వారసులమని రాథోడ్లు ప్రకటించుకున్నారని దియా చెప్పారు. కోర్టు వాదనల్లో తలదూర్చే ఉద్దేశం తనకు లేదన్న దియా.. అవసరమైతే డాక్యుమెంట్లను అందజేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని తెలిపారు. జైపూర్ రాజవంశానికి చెందిన దియా కుటుంబీకుల దగ్గరున్న వంశ వృక్షంలో దశరథుడు 62వ స్థానంలో ఉండగా.. రాముడు 63, కుశుడు 64వ స్థానాల్లో ఉన్నారు.

# జమ్మూకశ్మీర్‌లో ప్రశాంతంగా బక్రీద్ పర్వదినం

జమ్మూకశ్మీర్, ఆగస్టు12(ఆర్‌ఎన్‌ఎ) : జమ్మూకశ్మీర్‌లో బక్రీద్ వేడుకలను ముస్లిం సోదరులు ప్రశాంతంగా జరుపుకుంటున్నారు. కశ్మీర్ లోయతో పాటు వివిధ నగరాల్లో ముస్లింలు ప్రార్థనలు చేశారు.

రాచౌరీలో మసీదులో వందలాది మంది నమాజ్ చేశారు. జమ్మూలోని ఈద్గాలో సుమారు 5వేల మంది నమాజ్ చేసినట్లు జమ్మూకశ్మీర్ ప్రిన్సిపల్ కార్యదర్శి రోహిత్ కన్సాల్ తెలిపారు. సోమవారం అంతర్జాతీయ బోర్డర్ వద్ద పాకిస్థాన్ రేంజర్లు, బోర్డర్ సెక్యూర్టీ ఫోర్స్ దళాలు మిఠాయిలు పంచుకోలేదు. పాక్ రేంజర్లకు స్వీట్లు ఇచ్చేందుకు బీఎస్‌ఎఫ్ ప్రయత్నించింది. కానీ పాక్ నుంచి ఎటువంటి సమాచారం అందలేదు. ఆర్టికల్ 370 రద్దు తర్వాత కశ్మీర్ ఓ రకంగా నిర్మానుషంగా మారింది. పటిష్టమైన భద్రతను ఏర్పాటు చేయడంతో జనం ఎక్కువగా వీధుల్లోకి రావడం లేదు.

టూరిస్టుల సంఖ్య కూడా తగ్గింది. కొన్ని చోట్ల ఇంకా కర్ఫ్యూ లాంటి పరిస్థితులు ఉన్నాయి. అలాంటి చోట మసీదులో ఈజ్ ప్రార్థనలకు అనుమతి ఇవ్వలేదు. చిన్న చిన్న మసీదుల్లో ముస్లింలు ప్రార్థనలు చేసిన ఫోటోలను కొందరు రిలీజ్ చేశారు. శనివారం శ్రీనగర్‌లో ఆంక్షలు ఎత్తివేయడంతో స్వల్పస్థాయి ఘర్షణలు చోటుచేసుకున్నాయి. దీంతో మళ్లీ అక్కడ భద్రతను పటిష్టం చేశారు. ఇంకా అనేక ప్రాంతాల్లో ఫోన్, ఇంటర్నెట్ సేవలను పునరుద్ధరించలేదు. శ్రీనగర్, బారాముల్లాలో చెదురుముదురు సంఘటనలు చోటుచేసుకున్నట్లు హోంశాఖ చెప్పింది.

## అత్యాచార నిందితులకు..

# ఉరిశిక్ష పడేలా చర్యలుతీసుకుంటాం

### - వెన్నెల కుటుంబ సభ్యులను ఓదార్చిన మంత్రి ఎర్రబెల్లి

వరంగల్ అర్బన్, ఆగస్టు12 (ఆర్‌ఎన్‌ఎ) : హన్మకొండలో 9వ తరగతి బాలిక అత్యాచారానికి గురై చనిపోయిన కేసు నిందితులకు ఉరిశిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని పంచాయతీ రాజ్ శాఖమంత్రి ఎర్రబెల్లి దయాకరరావు అన్నారు. హన్మకొండ సమ్మయ్యనగర్ కాలనీలో అత్యాచారానికి గురై మరణించిన మైనర్ బాలిక వెన్నెల కుటుంబ సభ్యులను సోమవారం మంత్రి ఎర్రబెల్లి ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తొమ్మిది నెలల చిన్నారి శ్రీహిత హత్య కేసు నిందితుడికి పడిన ఉరి శిక్షలాగే, వెన్నల కేసు నిందితులకు కూడా పడుతుందన్నారు. సీఎం కేసీఆర్ స్వయంగా ఈ కేసు గురించి ఆరాదీశాడని, అన్ని రకాలుగా ఆదుకుంటాం అని భరోసా ఇచ్చారన్నారు. ఫస్టా కోర్టు ద్వారా ఇలాంటి ఘటనలపై చర్యలు తీసుకుంటామన్న ఎర్రబెల్లి, వరంగల్ లో మహిళల భద్రతకోసం ప్రత్యేక కమిటీని ఏర్పాట్లు చేస్తామన్నారు. షీటీంలను బలోపేతం చేసేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. మహిళల భద్రత కోసం అందరు కలిసి రావాలని సూచించారు. ప్రజలను చైతన్యం చేసే కార్యక్రమాలు, నిరసనలు చేయాలని, ఇలాంటి సంఘటనలను రాజకీయం చేయడం తగదని చెప్పారు మంత్రి ఎర్రబెల్లి హితవు పలికారు. ఆదివారం హన్మకొండలో దారుణం జరిగింది. 9వ తరగతి చదువుతున్న ఓ విద్యార్థిపై మృగాళ్లు అత్యాచారానికి పాల్పడ్డారు. అవమానాన్ని తట్టుకోలేక ఆ బాలిక ఆత్మహత్య చేసుకుంది. హన్మకొండలో జరిగిన ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. అత్యాచారానికి పాల్పడ్డ యువకులను శిక్షించాలంటూ స్థానికులు పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. ఇదిలా ఉంటే ఇటీవల చిన్నారిపై అత్యాచారం చేసి హత్య చేసిన పోలేపాక ప్రవీణ్ (25)కు మరణ శిక్ష విధించిన విషయం తెలిసిందే. చిన్నారిపై అత్యాచారానికి పాల్పడిన ఉన్మాదికి ఉరి శిక్షపడిన మరుసటి రోజే ఇలాంటి ఘటన జరగడం స్థానికులను కలవరపెడుతోంది.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.